www.vishvambhara.com
తెలుగు దినపత్రిక
# విశ్వంభర
అక్షరం సాక్షిగా..
మంగళవారం
24-09-2024
సంపుటి : 01 | సంచిక : 142 | పేజీలు : 12 | వెల : 5/- తెలంగాణ / ఆంధ్రప్రదేశ్



డా॥ కాచం సత్యనారాయణ CMD

# దక్షిణ లెబనాన్ పై భీకర దాడులు

- ఒక్కరోజే 300లకుపైగా లక్ష్యాలపై విరుచుకుపడ్డ ఇజ్రాయెల్
- 21మంది చిన్నారులు సహా 274 మంది మృతి
- మరో 700 మందికి గాయాలు
- మరో గాజాలా మారుతోంది
- యూఎన్ ఓ చీఫ్ ఆంటోనియో గుటెరస్ ఆందోళన



**లెబనాన్:** హెజ్బొల్లా స్థావరాలే లక్ష్యంగా దక్షిణ లెబనాన్ పై ఇజ్రాయెల్ భీకర దాడులు చేసింది. సోమవారం ఒక్కరోజే 300లకుపైగా లక్ష్యాలపై విరుచుకుపడింది. ఈ వైమానిక దాడుల్లో 21మంది చిన్నారులు సహా 274 మంది మృతిచెందినట్లు లెబనాన్ ఆరోగ్యశాఖ వెల్లడించింది. మరో 700 మందికి..

మిగతా2లో...

## మానవాళి విజయం
# యుద్ధభూమిలో లేదు

- సమష్టి శక్తిలో ఉంది
- ప్రపంచ శాంతి, అభివృద్ధికి సంస్కరణలు అవసరం
- యూఎన్ఓలో మోదీ
- 25 కోట్ల మందిని పేదరికం నుంచి బయటకు తెచ్చామని వెల్లడి
- 15 టాప్ టెక్ సీఈవోలతో రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్న ప్రధాని

2






## రాష్ట్రంలో ప్రతి కుటుంబానికి
# ఫ్యామిలీ డిజిటల్ కార్డులు

- రేషన్, హెల్త్ ప్రొఫైల్ తో పాటు సంక్షేమ పథకాలన్నిటికీ ఇక ఒకే కార్డు..
- ఎక్కడైనా సంక్షేమ పథకాలను పొందేలా చర్యలు..
- కుటుంబ సభ్యులందరికీ ఆరోగ్య సేవలు..
- పైలట్ ప్రాజెక్టుకు అవసరమైన చర్యలు చేపట్టండి
- ఇతర రాష్ట్రాల్లో అమలులో ఉన్న విధానాలను అధ్యయనం చేయండి
- వైద్య ఆరోగ్యశాఖ అధికారులతో సమీక్షా సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

రాష్ట్రంలో ప్రతి కుటుంబానికి ఫ్యామిలి డిజిటల్ కార్డు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం యోచిస్తోంది. రేషన్, ఆరోగ్య, ఇతర సంక్షేమ పథకాలన్నింటిని ఒకే కార్డు ద్వారా అందించాలని భావిస్తోంది. ఈ అంశంపై వైద్యారోగ్య, పౌరసరఫరాల శాఖ అధికారులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జూబ్లీహిల్స్ లోని తన నివాసంలో సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. కుటుంబాల సమగ్ర వివరాల నమోదుతో ఇప్పటికే రాజస్థాన్, హరియాణా, కర్ణాటక రాష్ట్రాలు కార్డులు ఇచ్చినందున వాటిపై అధ్యయనం చేయాలని, వాటితో కలుగుతున్న ప్రయోజనాలు, ఇబ్బందులపై అధ్యయనం చేసి ఒక సమగ్ర నివేదిక రూపొందించాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు.

**విశ్వంభర, హైదరాబాద్:**

తెలంగాణ వ్యాప్తంగా ప్రతి శాసనసభ నియోజకవర్గం పరిధిలో ఒక పట్టణ, ఒక గ్రామీణ ప్రాంతాన్ని ఎంపిక చేసుకొని పైలట్ ప్రాజెక్టు కింద ఈ ఫ్యామిలి డిజిటల్ కార్డులకు సంబంధించి కార్యాచరణ ప్రారంభించాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా ఫ్యామిలీ డిజిటల్ కార్డులు ఉండాలని, ఈ కార్డులతో లబ్ధిదారులు ఎక్కడైనా రేషన్, ఆరోగ్య సేవలు పొందేలా ఉండాలని ముఖ్యమంత్రి సూచించారు. ఈ ఫ్యామిలీ డిజిటల్ కార్డులో ప్రతి కుటుంబ సభ్యుని హెల్త్ ప్రొఫైల్ ఉండాలని, అది దీర్ఘకాలంలో వైద్య సేవలకు ఉపయోగపడుతుందని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. ఆయా కుటుంబ సభ్యులు తమ కుటుంబాల్లో సభ్యుల కలయిక, తొలగింపునకు సంబంధించి ఎప్పటికప్పుడు కార్డును అప్‌డేట్ చేసుకునేలా ఉండాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. ఈ ఫ్యామిలీ డిజిటల్ కార్డుల వ్యవస్థ మానిటరింగ్ కు జిల్లాలవారీగా వ్యవస్థలను ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. సమావేశంలో రాష్ట్ర మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, దామోదర రాజనరసింహ, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి, ముఖ్యమంత్రి కార్యదర్శులు చంద్రశేఖర్‌రెడ్డి, సంగీత సత్యనారాయణ, పౌరసరఫరాల శాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్, ఆరోగ్య శాఖ కార్యదర్శి క్రిస్టియానా జడ్ చోంగ్తూ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీలంక నూతన అధ్యక్షుడిగా దిసనాయకే
# ప్రమాణస్వీకారం

- 24 ఏళ్ల తర్వాత ఆపీఠం అధిరోహించిన కమ్యూనిస్టు నాయకుడు
- స్వచ్ఛమైన పాలన నినాదంతో నమ్మకం కలిగించారు..
- అంతర్గత సంక్షోభంతో మార్పుకోరుకున్న ప్రజలు


2



## స్పేస్ స్టేషన్
# కమాండర్‌గా సునీతా విలియమ్స్

- అప్పగించినట్లు నాసా ప్రకటన
- ఈ పదవి స్వీకరించడం ఇది రెండోసారి
- భద్రతను చూసుకోవడమే ఆమె కీలక బాధ్యత

2



# భరతుడిలా పరిపాలిస్తా!

- దిల్లీ కొత్త ముఖ్యమంత్రి ఆతిశీ
- సీఎం కుర్చీని ఖాళీగా ఉంచి మరో సీట్లో కూర్చుని బాధ్యతల స్వీకరణ



**దిల్లీ:** దిల్లీ 8వ ముఖ్యమంత్రిగా ఆతిశీ సింగ్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సమయంలో ఆమె ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్‌పై తనకున్న గౌరవాన్ని చాటుకున్నారు. ఆయన కోసం పక్కన కుర్చీని ఖాళీగా ఉంచి, తాను వేరే సీట్లో కూర్చొని బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆతిశీ, రామాయణంలో రాముడు అరణ్యాలకు వెళ్లినప్పుడు భరతుడు అయోధ్యను పాలించినట్లే కేజ్రీవాల్ తిరిగి వచ్చే వరకు తాను ఈ 4 నెలల పాటు దిల్లీ సీఎంగా పని చేస్తానని అన్నారు. కేజ్రీవాల్ ఇమేజ్‌ను దెబ్బతీయడానికి బీజేపీ చేయని ప్రయత్నమంటూ లేదని..

మిగతా2లో...

## అక్టోబరు మొదటివారం నుంచి
# ధాన్యం కొనుగోళ్లు

- గతంలో అవకతవకలకు పాల్పడిన మిల్లర్లకు ధాన్యం ఇచ్చేది లేదు
- మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి స్పష్టీకరణ
- ఏర్పాట్లపై అధికారులతో సమీక్ష

2




మరిన్ని తాజా వార్తల కోసం స్కాన్ చేయండి



## నేటి చికెన్ ధరలు

| ఫామ్ ధర | రిటైల్ |
|---|---|
| ₹ 125 | ₹ 147 |
| స్కిన్ | స్కిన్‌లెస్ |
| ₹ 213 | ₹ 243 |

## ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి ఇంటిపై దాడి

- టపాసులు పేలుస్తూ.. కాంగ్రెస్ కార్యకర్తల హంగామా
- అడ్డుకున్న బీఆర్ఎస్ కార్యకర్తలు..ఘర్షణ
- తీవ్రంగా ఖండించిన కేటీఆర్, హరీశ్‌రావు



**విశ్వంభర, హైదరాబాద్:**

మెదక్ జిల్లా శివ్వంపేట మండలం గోమారం గ్రామంలో ఆదివారం అర్ధరాత్రి ఉద్రిక్త వాతావరణం నెలకొంది. వినాయక నిమజ్జన వేడుకల్లో నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మా రెడ్డి ఇంటి ముందు టపాసులు పేల్చుతూ కాంగ్రెస్ కార్యకర్తలు హంగామా సృష్టించారు. ఎమ్మెల్యే ఇంటి ముందు టపాసులు పేలుస్తుండగా బీఆర్ఎస్ కార్యకర్తలు అడ్డుకున్నారు. దీంతో కాంగ్రెస్, బీఆర్ఎస్ కార్యకర్తల మధ్య ఘర్షణ, తోపులాట జరిగాయి. ఎమ్మెల్యే ఇంటి ముందు టపాసులు పేలుస్తూ, కాంగ్రెస్ కార్యకర్తలు గేటు నుంచి లోపలికి వెళ్లి బీఆర్ఎస్ కార్యకర్తలపై రాళ్లు, కర్రలతో దాడికి దిగారు. వెంటనే పోలీసులు రంగంలోకి దిగి..

మిగతా2లో...

# ప్రమాదరహితంగా రోడ్లు

- ప్రపంచవ్యాప్తంగా అనుసరిస్తున్న అధునాతన రోడ్డు నిర్మాణ పద్ధతులను తెలంగాణలోనూ అమలు చేస్తాం
- రోడ్ సేఫ్టీ పై ప్రపంచబ్యాంకు ప్రతినిధులతో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సమావేశం
- హాజరైన అర్ అండ్ బీ స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్ రాజ్, స్పెషల్ సెక్రటరీ దాసరి హరి చందన, ఈఎన్సీ, సీఈ లు



2

## తిరుమల లడ్డూ వ్యవహారంలో
# కీలక పరిణామాలు

- 'సుప్రీం'లో బీజేపీ నేత సుబ్రహ్మణ్య స్వామి పిల్..
- కల్తీ నెయ్యి వ్యవహారంలో కేంద్రం సీరియస్..
- తమిళనాడు కంపెనీకి షోకాజ్ నోటీసులు..!
- నేను అపరాధం చేస్తే నాతో పాటు కుటుంబం సర్వనాశనం కావాలి..
- తిరుమలలో మాజీ చైర్మన్ భూమన ప్రమాణం
- శ్రీవారి లడ్డూ పవిత్రతను పునరుద్ధరించాం : దేవస్థానం బోర్డు

9



## భరతుడిలా పరిపాలిస్తా!

ఢిల్లీ కొత్త ముఖ్యమంత్రి ఆతిశీ

(మొదటి పేజీ తరువాయి)



ఆతిశీ విమర్శించారు.

'ఖాళీ కుర్చీ కేజ్రీవాల్ కోసం వెయిట్ చేస్తుంది'

"నేను ఢిల్లీ సీఎంగా బాధ్యతలు తీసుకున్నాను. అయితే నాకు ప్రస్తుతం రామాయణంలో భరతుడికి ఎదురైన పరిస్థితే ఎదురైంది. రాముడి వనవాస సమయంలో భరతుడు రాజ్యం బాధ్యతలు చేపట్టాల్సి వచ్చినప్పుడు ఆయనకు ఎలాంటి బాధ కలిగిందో, ఇప్పుడు నాకు అలాగే బాధగా ఉంది. రాముడి 14ఏళ్ల వనవాసం సమయంలో సింహాసనంపై రాముడి పాదుకలు ఉంచి రాజ్యాన్ని ఏలాడు. వచ్చే నాలుగు నెలలు నేను కూడా అలాగే పరిపాలిస్తాను. అరవింద్ కేజ్రీవాల్ గౌరవం, నైతికతకు ఉదాహరణగా నిలిచారు. గత రెండేళ్లుగా బీజేపీ ఆయన ఇమేజ్‌ను దిగజార్చేందుకు తీవ్రంగా ప్రయత్నించింది. ఆయనపై తప్పుడు కేసులు బనాయించి, ఆరు నెలలు జైల్లో ఉంచింది. దీంతో ప్రజల్లో తిరిగి విశ్వసనీయత పొందేవరకు సీఎం సీటులో కూర్చోనన్నారు కేజ్రీవాల్. అందుకే రాజీనామా చేశారు. ఢిల్లీ సీఎం పీఠం అరవింద్ కేజ్రీవాల్‌దే. ఢిల్లీ ప్రజలు ఆయన్ను మళ్లీ ముఖ్యమంత్రి చేస్తారని ఆశిస్తున్నా. అప్పటివరకు ఈ ఖాళీ కుర్చీ ఈ ఆఫీస్‌లోనే ఉంటుంది. కేజ్రీవాల్ కోసం ఎదురుచూస్తుంది" అని ఆతిశీ అన్నారు.

'రాజ్యాంగాన్ని అగౌరపరిచారు'

అయితే ఆతిశీ చేసిన పనిని బీజేపీ తీవ్రంగా తప్పుబట్టింది. ఆమె ఖాళీ కుర్చీని చూపించడం అనేక ప్రశ్నలకు దారితీస్తుందని బీజేపీ ఎంపీ మనోజ్ తివారీ అన్నారు. దాని అర్థం, ఆమె తనను తాను సీఎం డి పరిగణించడం లేదని ఎద్దేవా చేశారు. సీఎంగా ఉండి, మరో వ్యక్తిని ముఖ్యమంత్రి అనుకోవడం, ఆ స్థానాన్ని, రాజ్యాంగాన్ని అగౌరపరచడం అని అన్నారు. "నేను ఢిల్లీ సీఎంకు ఓ లేఖ రాశాను. అయితే ఆ లేఖను ఎవరు చదువుతారు? ఒక సీఎం, తాను కీలుబొమ్మ అని ఎలా చెప్పుకోగలరు? వారు ప్రజల మనోభావాలను దెబ్బతీస్తున్నారు" అని మనోజ్ తివారీ మండిపడ్డారు.

'రబ్బర్ స్టాంప్, పప్పెట్ సీఎం'

లాలు ప్రసాద్ యాదవ్ రబ్‌డీ దేవి, మన్‌మోహన్ సోనియా మోడల్ లాగా ఆతిశీ కేజ్రీవాల్ ఢిల్లీ ప్రభుత్వాన్ని నడపాలనుకుంటున్నట్లు బీజేపీ అధికార ప్రతినిధి ప్రదీప్ భండారీ విమర్శించారు. రబ్బర్ స్టాంప్, పప్పెట్ ముఖ్యమంత్రిని సీఎంగా ఎందుకు చేశారని ఢిల్లీ ప్రజలు ప్రశ్నిస్తున్నారని భండారీ అన్నారు. "ఢిల్లీ ప్రజలంటే ఆతిశీ, కేజ్రీవాల్‌కు ద్వేషం. వారు ఢిల్లీ ప్రజలకు ఒక తాత్కాలిక సీఎంను ఇవ్వలేకపోయారు. కానీ ఒక పప్పెట్ సీఎంను ఇచ్చారు" అని భండారీ ధ్వజమెత్తారు.

26, 27వ తేదీల్లో అసెంబ్లీ సమావేశాలు

కాగా, ఆతిశీతో పాటు పర్యావరణ శాఖ మంత్రిగా గోపాల్ రాయ్, కార్మిక ఎస్సీ, ఎస్టీ, ఉపాధి, భవనాల శాఖ మంత్రిగా ముఖేశ్ అహ్లావత్ బాధ్యతలు చేపట్టారు. ఈ నెల 26, 27వ తేదీల్లో ఢిల్లీ అసెంబ్లీ సమావేశాలు జరగనున్నాయి. విద్య, రెవెన్యూ, ఆర్థిక, విద్యుత్ సహా 13 మంత్రిత్వ శాఖలు ఆతిశీ వద్ద ఉన్నాయి.

## శ్రీలంక నూతన అధ్యక్షుడిగా దిసనాయకే ప్రమాణస్వీకారం

**కొలంబో:** శ్రీలంక తదుపరి అధ్యక్షుడిగా మార్క్సిస్ట్ నేత అనుర కుమార దిసనాయకే (56) సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. తీవ్ర ఆర్థిక సంక్షోభంతో దివాలా అంచున ఉన్న శ్రీలంక అధ్యక్ష ఎన్నికల్లో ఆయన ఘన విజయం సాధించిన విషయం విదితమే. దీంతో శ్రీలంక తదుపరి అధ్యక్షునిగా దిసనాయకే సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. అధ్యక్ష కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో దిసనాయకే ప్రధాన న్యాయమూర్తి జయంత జయసూర్య ప్రమాణ స్వీకారం చేయించారు.

కాగా, శనివారం జరిగిన ఎన్నికల్లో ప్రథమ ప్రాధాన్య ఓట్ల లెక్కింపులో ఎవరికీ 50 శాతానికిపైగా ఓట్లు రాలేదు. దీంతో రెండో ప్రాధాన్య ఓట్లను లెక్కించి ఈ ఫలితాన్ని ప్రకటించారు. దిస్సనాయకే మార్క్సిస్ట్ జనతా విముక్తి పెరమున పార్టీ నేత. మరికొన్ని పార్టీలతో కలిసి నేషనల్ పీపుల్స్ పవర్ (ఎన్‌పీపీ) పేరుతో ఎన్నికల్లో పోటీ చేశారు. సమగి జన బలవేగయ (ఎస్‌జేబీ) నేత సాజిత్ ప్రేమదాసపై దిసనాయకే గెలిచారు. ఇక లంకకు 9వ అధ్యక్షుడిగా సోమవారం ఆయన ప్రమాణ స్వీకారం చేశారు. దాదాపు 24 ఏండ్ల తర్వాత అధ్యక్ష పీఠంపై కమ్యూనిస్ట్ నాయకుడు కూర్చోవడం విశేషం.


శనివారం జరిగిన ఎన్నికల్లో 22 జిల్లాల పరిధిలోని 13,400కి పైగా పోలింగ్ కేంద్రాల్లో 1.70 కోట్ల మంది ఓటర్లలో 75 శాతం ఓటు హక్కు వినియోగించుకున్నారు. కొత్తగా దేశాధ్యక్షుడిగా ఎన్నికైన దిసనాయకే ప్రభుత్వం.. శ్రీలంకకు ఐఎంఎఫ్ ఇచ్చిన 2.9 బిలియన్ డాలర్ల బెయిలవుట్ ప్యాకేజీ నిబంధనల్లో మార్పులు చేర్పులు చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి.

ఓట్లు కురిపించిన నినాదం...

గత ఏడాది అంతర్గత సంక్షోభంతో అట్టుడికిన శ్రీలంకలో ప్రజలు మార్పు కోరుకున్నారు. 1980 తర్వాత మరోసారి కమ్యూనిస్ట్ పార్టీకి అవకాశం ఇచ్చారు. అవినీతికి తావులేని 'స్వచ్ఛమైన పాలన' నినాదంతో ఎన్నికల్లో పోటీ పడిన అనుర కమార ఓటర్లను ఆకర్షించారు. విక్రమసింఘే పాలనలో గాడీ తప్పిన ఆరోగ్యం, విద్యా, రవాణా రంగాలపై ఆయన విమర్శనాస్త్రాలు సంధించారు. ఇవన్నీ అనుర కుమార పట్ల ప్రజల్లో నమ్మకం కలిగించాయి.

విద్యార్థి రాజకీయాల నుంచి ఎదిగి...

శ్రీలంక రాజకీయాల్లో పెను సంచలనంగా మారిన అనుర కుమార దిసనాయకే డిగ్రీ చదువుతున్నప్పుడు సోషలిస్ట్ స్టూడెంట్స్ అసోసియేషన్‌లో చేరి, విద్యార్థి రాజకీయాల్లో క్రియాశీలక పాత్ర పోషించారు. 1987లో మార్క్సిస్ట్ ప్రభావిత జనతా విముక్తి పెరమున (జేవీపీ) పార్టీలో చేరారు. 2004లో శ్రీలంక ఫ్రీడమ్ పార్టీతో కలిసి జేఎన్‌పీ ప్రభుత్వ ఏర్పాటులో కీలకంగా వ్యవహరించారు. శ్రీలంకలో 2022లో ఆర్థిక సంక్షోభం నేపథ్యంలో ప్రజల అసంతృప్తిని ఆయుధంగా మలచుకున్నారు. మార్పు, అవినీతి రహిత సమాజ నిర్మాణం వంటి నినాదాలతో జనాదరణ పొందారు. ఎన్నికల ప్రసంగాల్లో గత పాలకుల అవినీతి, వైఫల్యాల గురించి వివరించడంతోపాటు, దేశంలో జవాబుదారీతనం, వ్యవస్థాగత మార్పులు రావాలని గట్టిగా చెప్పారు.



# ప్రమాదరహితంగా రోడ్లు

### మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సమావేశం



**విశ్వంభర, హైదరాబాద్ :** ప్రపంచవ్యాప్తంగా అనుసరిస్తున్న అధునాతన రోడ్డు నిర్మాణ పద్ధతులను తెలంగాణలోనూ అమలు చేస్తామని, అందుకోసం స్మార్ట్ రోడ్ టెక్నాలజీ, ఇంటలిజెన్స్ ట్రాఫిక్ మేనేజ్ మెంట్, ఫ్యూచరిస్టిక్ ఆటోమేటెడ్ కన్ స్ట్రక్షన్, ఐసీటీ వంటి అధునాతన పద్ధతులను రోడ్ల నిర్మాణంలో వినియోగించి రోడ్డు మరణాలను తగ్గిస్తామని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు. ప్రపంచబ్యాంకు ప్రతినిధులతో సచివాలయంలో మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి సమావేశమయ్యారు.ఈ సందర్భంగా సమావేశంలో పాల్గొన్న ప్రపంచబ్యాంక్ రవాణారంగ ప్రధాన అధికారిణి రీనూ అనుజా ప్రపంచబ్యాంకు సహకారంతో మన దేశంలోని వివిధ రాష్ట్రాల్లో అమలవుతున్న రోడ్ల నిర్మాణాలు, వాటి తీరుతెన్నులపై పీపీటీ రూపంలో మంత్రికి వివరించారు. తమిళనాడు, రాజస్థాన్, కర్ణాటక, పశ్చిమ బెంగాళ్ వంటి రాష్ట్రాల్లో "ఇన్ఫర్మేషన్ అండ్ కమ్యూనికేషన్ టెక్నాలజీ" (ఐసీటీ) సాంకేతికతను ఉపయోగించి రోడ్డు ప్రమాదాలను ఎలా నివారించారు, ఎంతశాతం మరణాల రేటు తగ్గిందన్న విషయాలను గణాంకాలతో వివరించారు. అంతేకాదు, ఇంటెలిజెంట్ ట్రాఫిక్ మేనేజ్ మెంట్ సిస్టమ్ ఆధారిత విధానాన్ని అనుసరించడం వల్ల ప్రమాదాలకు చెక్ పెట్టవచ్చని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి కోసం ప్రభుత్వం అనుసరిస్తున్న విజన్ కు అనుగుణంగా అర్బన్ ఏరియాలను..రూర్బన్ కు విస్తరించడం, మెగా క్లస్టర్స్ అభివృద్ధి, గ్రామీణ ప్రాంతాలను నగరాలతో అనుసంధానించడం, విమెన్ స్కిల్లింగ్ హబ్స్ ఏర్పాటు వంటి నూతన విధానాలను రూపొందించడం ద్వారా రాష్ట్ర ప్రగతిని వేగవంతం చేయవచ్చని తన ప్రజెంటేషన్ లో వివరించారు. మరోవైపు రాష్ట్రంలో ఇన్నోవేటివ్ ఫైనాన్స్ మోడల్ ద్వారా ఆర్థిక సహకారం అందించేందుకు అనువైన ప్రాజెక్టుల గురించి రీనూ అనుజా మంత్రికి వివరించారు.


పట్టించుకోని గత ప్రభుత్వం

అనంతరం మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ.. వందలాది మంది ప్రజలు రోడ్డు ప్రమాదాల్లో చనిపోయినప్పటికీ గత ప్రభుత్వం ఏమాత్రం శ్రద్ధ వహించలేదని.. దానివల్ల ఎందరో అమాయకులు రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలు పోగొట్టుకున్నారని అన్నారు. గత ప్రభుత్వం పదేళ్లో రోడ్డు భద్రతా ప్రమాణాలు ఏ మాత్రం పాటించలేదని, ప్రమాద బాధితులకు సత్వర చికిత్స అందించేందుకు కనీసం ట్రామాకేర్ సెంటర్లను ను కూడా నిర్మించలేదన్నారు. కానీ తాము అధికారంలోకి వచ్చాక.. రాష్ట్ర ఆర్థిక పరిస్థితులను గుర్తెరిగి.. అత్యంత ప్రమాదకరంగా ఉన్న హైవేలపై ట్రామాకేర్ సెంటర్లను ఏర్పాటు చేసేలా చర్యలు చేపట్టామన్నారు. ఇప్పటికే హైదరాబాద్‌విజయవాడ జాతీయరహదారిపై ట్రామాకేర్ సెంటర్ నిర్మాణంలో ఉందని తెలిపారు. తెలంగాణలో నిర్మిస్తున్న రహదారుల నిర్మాణంలో వరల్డ్ రోడ్డు కాంగ్రెస్ నిర్దేశిత ప్రమాణాలను పాటిస్తున్నామని తెలిపారు.

తెలంగాణలో రోడ్ల అభివృద్ధికి ప్రపంచబ్యాంకు సహకారంపై ప్రభుత్వంలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని.. మాకు ప్రజల ప్రాణాలు కాపాడటం ముఖ్యమని.. ప్రత్యేక ప్రణాళికలతో వస్తే.. మరోసారి సాధ్యాసాధ్యాలపై సుదీర్ఘంగా చర్చించి ఒక నిర్ణయం తీసుకుందామని ప్రపంచబ్యాంకు ప్రతినిధులకు మంత్రి వివరించారు. ఈ సమావేశంలో ఆర్ అండ్ బీ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్, ప్రత్యేక కార్యదర్శి దాసరి హరిచందన, ఈఎన్సీ మధుసూధన్ రెడ్డి తో పాటు శాఖకు సంబంధించిన సీఈలు, ఇతర అధికారులు సమావేశంలో పాల్గొన్నారు.

## మానవాళి విజయం యుద్ధభూమిలో లేదు

- 15 టాప్ టెక్ సీఈవోలతో రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్న ప్రధాని



**న్యూయార్క్:** మానవాళి విజయం యుద్ధభూమిలో లేదు.. సమష్టి శక్తిలో ఉందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అన్నారు. ప్రపంచ శాంతి, అభివృద్ధికిగాను అంతర్జాతీయ సంస్థల్లో సంస్కరణలు అవసరమన్నారు.ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అమెరికా పర్యటన కొనసాగుతోంది. మూడు రోజుల పర్యటన నిమిత్తం అమెరికా వెళ్లిన ప్రధాని.. క్వాడ్ దేశాల సదస్సులో పాల్గొన్నారు. ఆ తర్వాత న్యూయార్క్‌లో జరిగిన ప్రవాస భారతీయులతో ప్రత్యేక కార్యక్రమానికి హాజరై మాట్లాడారు.తాజాగా న్యూయార్క్ లోని యూఎన్ఓ జనరల్ అసెంబ్లీలో 'సమ్మిట్ ఆఫ్ ది ఫ్యూచర్' ను ఉద్దేశించి మోదీ ప్రసంగించారు. ప్రపంచ భవిష్యత్తు గురించి అంతర్జాతీయ సమాజం చర్చిస్తున్న వేళ.. మానవ కేంద్రీకృత విధానాలకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. ఈ క్రమంలో తన డిజిటల్ పబ్లిక్ ఇన్ఫ్రాస్ట్రక్చర్‌ను మొత్తం ప్రపంచంతో పంచుకునేందుకు భారత్ సిద్ధంగా ఉందని తెలిపారు.సుస్థిరాభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూనే మానవ సంక్షేమం, ఆహారం, ఆరోగ్య భద్రత కల్పించాల్సిన అవసరాన్ని ప్రధాని మోదీ గుర్తుచేశారు. 25 కోట్ల మందిని పేదరికం నుంచి బయటకు తెచ్చినట్లు తెలిపిన ఆయన.. తద్వారా సుస్థిరాభివృద్ధి విజయం సాధించవచ్చని నిరూపించామన్నారు. ఈ విజయ అనుభవాలను గ్లోబల్ సౌత్తో పంచుకునేందుకు భారత్ సిద్ధంగా ఉందన్నారు.

15 టాప్ టెక్ సీఈవోలతో ప్రధాని మోదీ రౌండ్ టేబుల్ సమావేశం..

అమెరికా పర్యటనలో భాగంగా ప్రధాని మోదీ టెక్ కంపెనీల సీఈవోలతో ప్రధాని రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్నారు.మసాచుసెట్స్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎంఐటీ) స్కూల్ ఆఫ్ ఇంజినీరింగ్.. న్యూయార్క్‌లోని ఓ హోటల్‌లో ఈ సమావేశాన్ని నిర్వహించింది. గూగుల్ సీఈవో సుందర్ పిచాయ్, అడోబ్ సీఈవో శంతను నారాయణ్, ఎన్విడియా సీఈవో జెన్‌సెన్ హాంగ్ సహా 15 టాప్ టెక్ సీఈవోలు ఈ రౌండ్‌టేబుల్ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సమావేశానికి సంబంధించిన ఫొటోను మోదీ ఎక్స్ వేదికగా పంచుకున్నారు. సీఈవోలతో ఫలప్రదమైన చర్చలు జరిగాయని, టెక్నాలజీ, ఇన్నోవేషన్ తదితర అంశాల గురించి చర్చించినట్లు తెలిపారు. సాంకేతికత, ఆవిష్కరణలు సహా పలు అంశాలపై చర్చలు జరిపామన్నారు. ఆయా రంగాల్లో భారత్ సాధించిన ప్రగతి గురించి మాట్లాడినట్లు చెప్పారు. మేడ్ బై ఇండియా గురించి ప్రత్యేకంగా ప్రస్తావించినట్లు వెల్లడించారు.

## దక్షిణ లెబనాన్ పై భీకర దాడులు

(మొదటి పేజీ తరువాయి)

గాయాలైనట్లు పేర్కొంది. చనిపోయిన వారిలో చిన్నారులు, మహిళలు, పారామెడికల్ సిబ్బంది కూడా ఉన్నారని తెలిపింది.

**విధ్వంస ప్రణాళికతోనే..**

సోమవారం ఉదయం నుంచే ఇజ్రాయెల్ సేనలు భీకర దాడులు ముమ్మరం చేశాయని లెబనాన్ ప్రభుత్వం వెల్లడించింది. తమ గ్రామాలు, పట్టణాలను నామరూపాల్లేకుండా చేయాలనే ప్రణాళికలో భాగంగానే ఈ దాడులకు వ్యూహరచన చేసినట్లు కనిపిస్తోందని ఆరోపించింది. దాడుల్ని అడ్డుకునేలా చర్యలు తీసుకోవాలని ఐరాసతోపాటు శక్తిమంతమైన దేశాలను కోరింది.

హెజ్బొల్లా స్థావరాలే లక్ష్యంగా దాడులు చేస్తామని ఇజ్రాయెల్ ముందుగానే వెల్లడించింది. దక్షిణ ప్రాంతంలో హెజ్ బొల్లా ఆయుధాలు నిల్వ చేసిన నివాసాలు, ఇతర ప్రదేశాలను తక్షణమే వీడాలని స్థానికులను హెచ్చరించింది. అనంతరం బెకా లోయ ప్రాంతాల్లో భారీగా దాడులు చేపట్టింది. మరోవైపు.. ఇజ్రాయెల్ సైన్యం హెచ్చరికలతో వేలాది మంది తమ వాహనాల్లో సురక్షిత ప్రాంతాలకు బారులు తీరారు.

**మరో గాజాలా మారుతోంది**

లెబనాన్ మరో గాజాలా మారుతోందని ఐక్యరాజ్య సమితి చీఫ్ ఆంటోనియో గుటెరస్ ఆందోళన వ్యక్తం చేశారు. కాల్పుల విరమణపై ఇరు పక్షాలకూ ఆసక్తి లేదనే విషయం స్పష్టమవుతోందన్నారు. న్యూయార్క్ ఐరాస సాధారణ సభ ప్రారంభానికి ముందు గుటెరస్ ఈ వ్యాఖ్యలు చేశారు.

## అక్టోబరు మొదటివారం నుంచి ధాన్యం కొనుగోళ్లు

**విశ్వంభర, హైదరాబాద్:** గతంలో అవకతవకలకు పాల్పడిన మిల్లర్లకు ఈసారి ధాన్యం ఇచ్చేదిలేదని పౌరసరఫరాలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తేల్చిచెప్పారు. అక్టోబరు మొదటి వారంలో మొదలయ్యే ధాన్యం కొనుగోళ్లు జనవరి మాసాంతం వరకు కొనసాగుతాయన్నారు. అందుకు సంబంధించిన షెడ్యూల్‌ను ప్రకటించారు. సోమవారం మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల కేంద్రం లో ఖరీఫ్ పంట కొనుగోలుపై సంబంధిత అధికారులతో ఉత్తమ్ సమీక్షించారు. ఖరీఫ్ మార్కెటింగ్ సన్నద్ధత, కొనుగోలు కేంద్రాల ఏర్పాటు, మౌలిక సదుపాయాల కల్పనపై విస్తృతంగా చర్చించారు.ప్రజల సొమ్ముతో అప్పుచేసి కొనుగోలు చేస్తున్న ధాన్యం విషయంలో అవకతవకలకు అవకాశం ఇవ్వొద్దని అధికారులకు సూచించారు.

ధాన్యం దిగుమతి జరగకుండా చర్యలు

సరిహద్దు రాష్ట్రల నుంచి ధాన్యం దిగుమతి జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఉత్తమ్ సూచించారు. రాష్ట్రంలో పండిన ప్రతిగింజను కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని అందుకు అనుగుణంగా రాష్ట్రవ్యాప్తంగా 7,139 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. సన్నాలు, దొడ్డు వడ్లు వేర్వేరు కేంద్రాల్లో కొనుగోలు చేసేందుకు ఏర్పాట్లు చేసినట్లు వివరించారు.

**ధాన్యంపై రూ.500 బోనస్**

రైతులను సన్నాలవైపు ప్రోత్సహించేందుకు వీలుగా క్వింటాల్ ధాన్యంపై 500 బోనస్ అందించన్నట్లు ఉత్తమ్ వివరించారు. ఇది విప్లవాత్మకమైన నిర్ణయంగా మంత్రి అభివర్ణించారు. 40 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం నిల్వ ఉంచేందుకు వీలుగా గోదాములను ప్రభుత్వం సిద్ధం చేసిందని తెలిపారు. జనవరి నుంచి రాష్ట్రవ్యాప్తంగా అన్ని చౌక ధరల దుకాణాల్లో సన్న బియ్యం అందించనున్నట్లు మంత్రి ఉత్తమ్ పునరుద్ఘాటించారు.

**అవకతవకలు లేకుండా కొనుగోళ్లు చేపట్టాలి**

ఎక్కడా ఎటువంటి అవకతవకలు లేకుండా కొనుగోళ్ల ప్రక్రియ చేపట్టాలని అధికారులకు సూచించారు. అక్టోబరు మొదటి వారంలో నల్లగొండ, మెదక్, రెండవ వారంలో నిజామాబాద్, కామారెడ్డి, రాజన్న సిరిసిల్ల, యాదాద్రి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, నారాయణపేట జిల్లాల్లో ప్రారంభిస్తామని వివరించారు. కరీంనగర్, జగిత్యాల, వరంగల్, జనగామ, సూర్యాపేట, మేడ్చల్, ఖమ్మం, ములుగు, భూపాలపల్లి జిల్లాలు ఉంటాయని తెలిపారు.4వ వారంలో మంచిర్యాల, సంగారెడ్డి, పెద్దపల్లి, హన్మకొండ ఉండగా... నవంబర్ మొదటి వారంలో నిర్మల్, సిద్దిపేట, రంగారెడ్డి జిల్లాలు ఉంటాయని అన్నారు.

## ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి ఇంటిపై దాడి

(మొదటి పేజీ తరువాయి)

ఇరు వర్గాలకు నచ్చజెప్పడంతో పరిస్థితి సద్దుమణిగింది. ఘటన సమయంలో ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి, కుటుంబసభ్యులు ఇంట్లో లేరు. కానీ ఈ దాడి దృశ్యాలన్నీ సీసీ కెమెరాలలో రికార్డు అయ్యాయి.

నలుగురిపై కేసు నమోదు

ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి ఇంటిపై దాడి ఘటనలో నలుగురిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. మణిదీపక్ ఫిర్యాదుతో కాంగ్రెస్ కార్యకర్తలు రమేశ్, నరసింహా, భాస్కర్, సుధాకర్‌పై కేసు నమోదైనట్లు వివరించారు.

**దాడులతో సునీతా లక్ష్మారెడ్డి మనో ధైర్యాన్ని దెబ్బతీయలేరు : కేటీఆర్**

ఇంటిపై దాడి చేయడం ద్వారా ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి మనోధైర్యాన్ని దెబ్బతీయలేరని బీఆర్ ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. మెదక్ జిల్లాలోని శివంపేట మండలం గోమారంలోని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి ఇంటిపై ఆదివారం రాత్రి దాడి జరిగిన నేపథ్యంలో ఆయన సోమవారం అమెతో మాట్లాడారు. దాడి వివరాలను కేటీఆర్ అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డికి అండగా ఉంటామని కేటీఆర్ భరోసానిచ్చారు. దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కేటీఆర్ డిమాండ్ చేశారు.

**రాష్ట్రంలో గూండా రాజ్యం నడుస్తోంది : హరీశ్‌రావు**

సీనియర్ శాసనసభ్యురాలు, మాజీ మంత్రి సునీత లక్ష్మారెడ్డి ఇంటి మీద కాంగ్రెస్ కార్యకర్తలు చేసిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని మాజీ మంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు. సిద్దిపేటలో తన కార్యాలయంపై, హైదరాబాద్‌లో ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి ఇంటి మీద, సునీత లక్ష్మారెడ్డి ఇంటి మీద దాడులు జరిగాయన్నారు. రాష్ట్రంలో గూండారాజ్యాన్ని తలపించే విధంగా పరిపాలన సాగుతోందని హరీశ్‌రావు ఆరోపించారు. తెలంగాణకున్న మంచి పేరును మంటగలిపి.. ఈరోజు బిహార్‌లాగా తెలంగాణను మారుస్తున్నారని ధ్వజమెత్తారు.నిన్న సునీతా లక్ష్మారెడ్డి మీద జరిగిన దాడి కాంగ్రెస్ నాయకత్వం ప్రోత్సాహంతో జరిగిన దాడి అని పేర్కొన్నారు. రేవంత్ రెడ్డి రెచ్చగొట్టే మాటలు రాష్ట్రంలోని కాంగ్రెస్ కార్యకర్తలను ప్రతిపక్షాల మీద దాడి చేసే విధంగా ప్రోత్సహించినట్లు ఉంటున్నాయన్నారు.. ఎమ్మెల్యే నివాసంలో లేనప్పుడు ఉద్దేశపూర్వకంగా దాడి చేయాలని, ఎమ్మెల్యే ఇంటి ముందు టపాకాయలు కాల్చడం, ఇంట్లోకి విసరడం, ఇంట్లో ఉన్న వారిపై దాడి చేయడం హేయమైన చర్య అని హరీశ్‌రావు పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం, రేవంత్ రెడ్డి శాశ్వతం కాదనే విషయాన్ని పోలీసు అధికారులు గుర్తుపెట్టుకోవాలని అన్నారు.

"ఇది ప్రజా పాలన కాదు గూండాల పాలన. మా ఓపికకు కూడా ఒక హద్దు ఉంటుంది. పోలీసులు ఇలాంటి దాడులను కట్టడి చేయడంలో విఫలమైతే రాయలసీమ లాంటి ఫ్యాక్షన్ పరిస్థితులు తెలంగాణలో కూడా వచ్చే అవకాశం ఉంది. తెలంగాణ ప్రాంతంతో, తెలంగాణ ప్రజలతో మాది పేగు బంధం. ఎక్కడ ఎలాంటి హింసాత్మక ఘటనలు జరగకుండా మేం చాలా జాగ్రత్తగా వ్యవహరిస్తున్నాం. అదేవిధంగా ప్రభుత్వం పోలీసులు కూడా వ్యవహరిస్తే మంచిది. ఇంట్లో చొరబడి దాడి చేసిన వారిని అరెస్టు చేసి రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ సక్రమంగా ఉందని నిరూపించుకోవాలి. డీజీపీ పదవికి గౌరవం తెచ్చే విధంగా చట్టానికి వ్యతిరేకంగా ఎవరు వెళ్లిన వారిని ఉపేక్షించవద్దు. ఈ ఘటనపై డీజీపీ వెంటనే స్పందించి దాడి చేసిన వారిని అరెస్ట్ చేయవలసిందిగా డిమాండ్ చేస్తున్నాను. అరెస్టు చేయనట్టయితే బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలతో కలిసి డీజీపీ కార్యాలయాన్ని ముట్టడిస్తాం" అని హరీశ్‌రావు హెచ్చరించారు.

## గండ్లు పూడ్చడం చేతకాదా?

- పంటలు ఎండబెట్టడమే రైతులకు ఇచ్చే బహుమానమా?
- కాంగ్రెస్‌పై హరీశ్ రావు విమర్శలు

**విశ్వంభర, హైదరాబాద్:** కాంగ్రెస్ పాలనలో తెలంగాణ ప్రజలు గోస పడుతున్నారని.. మాజీ మంత్రి హరీశ్ రావు విమర్శించారు. ఖమ్మం జిల్లాల్లో 9 మంది ఎమ్మెల్యేలను గెలిపిస్తే.. పంటలు ఎండపెట్టడమే రైతులకు ఇచ్చే బహుమానమా? అని ప్రశ్నించారు. కాలువకు గండి పడి 23 రోజులు అవుతున్నా.. పూడ్చడం చేతకావడం లేదా? అని నిలదీశారు. ఇది పూర్తిగా ప్రభుత్వ నిర్లక్ష్యం అని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడిన హరీశ్.. ఖమ్మం జిల్లా మంత్రులపై ఫైర్ అయ్యారు. హైడ్రా పైనా కీలక వ్యాఖ్యలు చేశారు.

'ఖమ్మం జిల్లాలో ముగ్గురు మంత్రులు ఉన్నారు. 23 రోజుల్లో ఖమ్మంకు 10 సార్లు అయినా పోయి ఉంటారు. గండిపడ్డ కాలువ పక్క నుంచి వెళ్తారు. అక్కడ ఆగి ఎందుకు ఇంక పూడ్చివేయట్లేదు అని ఒక్క రివ్యూ అయినా చేయరా? 9 మంది ఎమ్మెల్యేలను గెలిపిస్తే, పంటలు ఎండపెట్టడమే మీరు రైతులకు ఇచ్చే బహుమానమా? 9 మంది ఎమ్మెల్యేలను గెలిపిస్తే, కనీసం హెలికాప్టర్ పంపకుండా తొమ్మిది మంది ప్రాణాలు బలిగొన్న పరిస్థితి మీది. మాట్లాడితే ఆకాశాన్ని దించుతాం, సూర్యుని దించుతామని పెద్ద పెద్ద డైలాగులు కొడుతారు' అని హరీశ్ రావు వ్యాఖ్యానించారు.

'తలాపున సముద్రం ఉన్నా చేప దూపకు ఏడ్చిందంట. ఈ కాంగ్రెస్ పాలనలో కృష్ణా నది పరవళ్లు తొక్కుతున్నా.. ఖమ్మం జిల్లా రైతులు సాగు నీటి కోసం ఎదురు చూసే పరిస్థితి ఏర్పడ్డది. దీనికి కారణం ముగ్గురు మంత్రుల సమన్వయ లోపం. నీటి పారుదల శాఖ మంత్రి నిర్లక్ష్యం. ముఖ్యమంత్రికి పట్టింపు లేకపోవడం వల్ల ఇవాళ ఖమ్మం జిల్లాలో పంటలు ఎండి పోతున్నాయి. కాలువకు గండి పడి 22 రోజులైనా పూడ్చలేదు.. ఇన్ని రోజులైనా గండిని పూడ్చలేని ఈ ప్రబుద్ధులు.. కాళేశ్వరం గురించి పెద్ద పెద్ద మాటలు మాట్లాడారు' అని హరీశ్ రావు విమర్శించారు.

'ఈ ప్రభుత్వానికి కూల్చివేతలు తెలుసు తప్ప.. పూడ్చివేతలు తెలియదు. పేద ప్రజల ఇండ్లు కూల్చుతూ హైడ్రా పేరుతో హైడ్రామా నడిపిస్తున్నారు. సీఎల్పీ భేటీకి అరెకపూడి గాంధీ ఎందుకు వచ్చారు. ముఖ్యమంత్రికి కలవాలనుకుంటే.. సీఎం ఆఫీసుకు వెళ్లాలి కానీ.. సీఎల్పీ మీటింగ్‌కు వస్తారా.. ఇంకా ఎన్ని రోజులు ప్రజలను మోసం చేస్తారు. మంత్రి శ్రీధర్ బాబు ఏం మాట్లాడుతున్నారో అర్థం కావడం లేదు' అని హరీశ్ రావు వ్యాఖ్యానించారు.

అటు హైడ్రా బాధితులు ఆవేదన వెళ్లగక్కుతున్నారు. 'మూడు రోజుల క్రితమే ఇల్లు రిజిస్ట్రేషన్ చేసుకున్నాం. అంతలోనే కూల్చి వేశారు. మేం కొన్న ఇల్లు ప్రభుత్వ స్థలంలో ఉందని మాకు తెలియదు. రిజిస్ట్రేషన్ ముందు అన్ని డాక్యుమెంట్లు పరిశీలించాం. అనుమతులు అన్నీ ఉన్నాయని ఇల్లు కొన్నాం. ఇల్లు కూల్చుతామని అధికారులు వచ్చి చెప్పడంతో షాకయ్యాం. ఏండ్ల తరబడి కష్టపడి సంపాదించిన సొమ్ముతో ఇల్లు కొనుక్కున్నాం. బ్యాంకు లోను కూడా తీసుకున్నాం. ఇప్పుడు ఒక్క క్షణంలో అంతా అయిపోయింది. ప్రభుత్వ స్థలంలో నిర్మాణాలు చేపట్టి అమ్మిన బిల్డర్లు, అనుమతులు ఇచ్చిన అధికారులదే ఈ పాపం. ప్రభుత్వం వారిపై చర్యలు తీసుకొని మాలాంటి బాధితులకు న్యాయం చేయాలి' అని హైడ్రా బాధితులు కోరుతున్నారు.

## స్పేస్ స్టేషన్ కమాండర్‌గా సునీతా విలియమ్స్

**ఢిల్లీ:** అంతర్జాతీయ స్పేస్ స్టేషన్‌లో సునీతా విలియమ్స్ స్పేస్ స్టేషన్‌కు కమాండర్‌గా బాధ్యతలు స్వీకరించారు. 8 రోజుల మిషన్ కోసం స్పేస్ స్టేషన్‌కు వెళ్లిన ఆమె.. బోయింగ్ స్టార్‌లైనర్ స్పేస్‌క్రాఫ్ట్ సమస్య వల్లే 8 నెలలుగా అక్కడే ఉండిపోయారు. ఇప్పుడు ఆ స్పేస్ స్టేషన్‌కు కమాండర్‌గా మారింది. రష్యా కాస్మోనాట్ ఓలెగ్ కోనెనెంకో ఆ కమాండ్‌ను సునీతాకు అప్పగించినట్లు నాసా ప్రకటించింది. కమాండర్ బాధ్యతల అప్పగింత సమయంలో స్పేస్ స్టేషన్‌లో ఓ వేడుక కూడా జరిగింది. కోనెనెంకో స్పేస్ స్టేషన్‌కు వెళ్లి ఏడాది కావొస్తోంది. అతని తో పాటు ట్రేసీ డైసన్, నికోలయి చుబ్‌లు కూడా త్వరలో భూమికి తిరిగిరానున్నారు. స్పేస్ స్టేషన్‌లోని మైక్రోగ్రావిటీ ల్యాబ్‌లో సునీతా వర్క్ చేస్తున్నారు. మానవ, రోబోటిక్ మిషన్స్‌కు చెందిన టెక్నాలజీపై ఆమె శాస్త్రీయ అధ్యయనం చేస్తోంది. స్పేస్ స్టేషన్ కమాండ్‌ను సునీతా స్వీకరించడం ఇది రెండోసారి. 12 ఏళ్ల క్రితం కూడా ఆమె ఆ బాధ్యతలు నిర్వర్తించారు. స్పేస్ స్టేషన్‌లో భద్రతను చూసుకోవడమే ఆమె కీలక బాధ్యత అవుతుంది.



# ఈ ఎన్నికల్లో ఓడిపోతే మళ్లీ పోటీ చేయను..

* ఈ నిర్ణయానికి కట్టుబడి ఉంటాను

* ట్రంప్ కీలక ప్రకటన

* నవంబరు 5న ఎన్నికలు

**వాషింగ్టన్:** అమెరికాలో అధ్యక్ష ఎన్నికలకు మరో 42 రోజులు మాత్రమే సమయం ఉంది. దీంతో ప్రధాన అభ్యర్థులు డొనాల్డ్ ట్రంప్ , కమలా హారిస్ తమ ప్రచార జోరు పెంచారు. ఈ క్రమంలోనే ఒకరిపై ఒకరు మాటల తూటాలు పేల్చుకుంటున్నారు. ఈ నేపథ్యంలో రిపబ్లికన్ పార్టీ తరఫున పోటీ పడుతున్న మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తాజాగా కీలక వ్యాఖ్యలు చేశారు. నవంబర్ 5న జరిగే ఎన్నికల్లో తాను గెలవకపోతే మరోసారి అధ్యక్ష ఎన్నికల్లో పోటీ చేయబోనని ప్రకటించారు.'ఎన్నికల్లో మేం ఓడిపోతామని అస్సలు అనుకోవడం లేదు. ఆ ఆలోచనే లేదు. మేం తప్పకుండా విజయం సాధిస్తామన్న నమ్మకం ఉంది. ఒకవేళ ఓడిపోతే.. 2028 ఎన్నికల్లో నేను బరిలోకి దిగను. ఈ నిర్ణయానికి కట్టుబడి ఉంటాను' అని ట్రంప్ స్పష్టం చేశారు. ప్రస్తుతం ట్రంప్ వ్యాఖ్యలు వైరల్‌గా మారాయి.కాగా, ట్రంప్ ఇప్పటికే ఓసారి అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వర్తించిన విషయం తెలిసిందే. 2016 నవంబర్‌లో జరిగిన ఎన్నికల్లో తొలిసారి ఆయన రిపబ్లికన్ పార్టీ తరఫున పోటీ చేసి గెలుపొందారు. ప్రత్యర్థి హిల్లరీ క్లింటన్‌పై విజయం సాధించారు. ఆ తర్వాత 2020 ఎన్నికల్లో జో బైడెన్‌పై మరోసారి పోటీ చేశారు. అయితే ఆ ఎన్నికల్లో ట్రంప్ ఓటమి చవి చూశారు. ఇప్పుడు మరోసారి అధ్యక్ష బరిలో దిగి తన అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు సిద్ధమయ్యారు.

ఇక నవంబర్ 5న అమెరికా 47వ అధ్యక్షుడి కోసం ఎన్నికలు జరగనున్న విషయం తెలిసిందే. ఈ ఎన్నికల్లో ట్రంప్‌కు డెమోక్రటిక్ అభ్యర్థి, ప్రస్తుత ఉపాధ్యక్షురాలు కమలా హారిస్ గట్టి పోటీ ఇస్తున్నారు. ఈ ఎన్నికల్లో కమలాదే పైచేయి అని అత్యధిక సర్వేలు అంచనా వేస్తున్నాయి. కీలక రాష్ట్రాల్లోనూ కమలా హారిస్‌దే పైచేయి కొనసాగుతోందని సర్వేలు చెబుతున్నాయి. దీంతో ఈ ఎన్నికలపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

## దుర్గం చెరువు ఎఫ్‌టీఎల్‌ను 6 వారాల్లో నిర్ధారించాలి : హైకోర్టు



**విశ్వంభర, హైదరాబాద్:** హైదరాబాద్‌లో ని దుర్గం చెరువు ఎఫ్‌టీఎల్‌పై సోమవారం హైకోర్టులో వాదనలు జరిగాయి. దుర్గం చెరువు ఎఫ్‌టీఎల్ నిర్ధారణ శాస్త్రీయంగా జరగలేదంటూ దాఖలైన పిటిషన్లను సీజే ధర్మాసనం విచారించింది. ఈ క్రమంలో ఎఫ్‌టీఎల్‌పై అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోవాలని హైకోర్టు ఆదేశించింది. బాధితులు చెరువుల పరిరక్షణ కమిటీకి అభ్యంతరాలు తెలపాలని హైకోర్టు తెలిపింది. వారంలోపు బాధితులు అభ్యంతరాలు తెలపాలని హైకోర్టు ఆదేశాలిచ్చింది. అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకుని 6 వారాల్లో ఎఫ్‌టీఎల్ నిర్ధారించాలని హైకోర్టు స్పష్టం చేసింది. 6 వారాల్లోపు కూల్చివేతలు చేపట్టబోమని కోర్టుకు జీహెచ్ఎంసీ తెలిపింది. రికార్డుల ప్రకారం దుర్గం చెరువు ఎఫ్‌టీఎల్ 65 ఎకరాలే ఉందని పిటిషనర్లు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దుర్గం చెరువు ఎఫ్‌టీఎల్ 160 ఎకరాలు ఉందని అధికారులు చెప్పడం సరికాదని పిటిషనర్లు వాదించారు.

## కావూరి హిల్స్‌లో హైడ్రా కూల్చివేతలు

### నేలమట్టమైన స్పోర్ట్స్ అకాడమీ షెడ్లు



**విశ్వంభర, హైదరాబాద్:** హైదరాబాద్‌లో హైడ్రా దూకుడు కొనసాగుతోంది. రాజధాని పరిధిలో ప్రభుత్వ భూములు, చెరువుల పరిరక్షణనే లక్ష్యంగా అక్రమ నిర్మాణాలను కూల్చేస్తోంది. ఆదివారం నుంచి కూల్చివేతల్లో నిమగ్నమైన హైడ్రా బుల్డోజర్లు సోమవారం మాదాపూర్‌లోని కావూరి హిల్స్ పార్కు స్థలంలోని అక్రమ షెడ్లను కూల్చేసింది. ఇక్కడ స్పోర్ట్స్ అకాడమీ ఏర్పాటు చేశారు. ఈ స్పోర్ట్స్ అకాడమీపై కావూరి హిల్స్ అసోసియేషన్ హైడ్రాకు ఫిర్యాదు చేసింది. కావూరి హిల్స్ అసోసియేషన్ ఫిర్యాదుతో అక్రమ షెడ్లను కూల్చేశారు. ఈ అక్రమ నిర్మాణాలను తొలగించి కావూరి హిల్స్ పార్కు పేరిట బోర్డును ఏర్పాటు చేశారు. పార్కు స్థలాన్ని 25 ఏళ్లు లీజుకు తీసుకున్నామని స్పోర్ట్స్ అకాడమీ నిర్వాహకులు తెలిపారు. గడువు తీరకముందే అన్యాయంగా నిర్మాణాలు తొలగించారని ఆరోపించారు.

## జానీ మాస్టర్‌ను కస్టడీకి ఇవ్వాలి

### నార్సింగి పోలీసుల పిటిషన్..

### విచారణ నేటికి వాయిదా వేసిన రంగారెడ్డి కోర్టు

**విశ్వంభర, హైదరాబాద్ :** లైంగిక వేధింపుల ఆరోపణల్లో అరెస్టయిన కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్‌ను కస్టడీకి ఇవ్వాలని కోరుతూ నార్సింగి పోలీసులు రంగారెడ్డి కోర్టులో సోమవారం పిటిషన్ దాఖలు చేశారు. నార్సింగి పోలీసులు దాఖలు చేసిన పిటిషన్‌పై కోర్టు విచారణను మంగళవారానికి వాయిదా వేసింది. ఐదురోజుల పాటు కస్టడీకి ఇవ్వాలని పిటిషన్‌లో పోలీసులు కోరారు. పోక్సో కేసు కావడంతో కస్టడీకి ఇవ్వాలని కోర్టుకు విజ్ఞప్తి చేశారు. మరో వైపు జానీ మాస్టర్ బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు. జానీ పిటిషన్‌పై విచారణను కోర్టు బుధవారానికి వాయిదా వేసింది. ప్రస్తుతం జానీ మాస్టర్ చర్లపల్లి జైలులో జ్యుడీషియల్ కస్టడీలో ఉన్నారు. ఈ కేసులో జానీని కస్టడీకి ఇస్తే మరిన్ని వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని పోలీసులు పేర్కొన్నారు. లైంగిక వేధింపులు, పోక్సో కేసుతో జానీ మాస్టర్ పరారీలో ఉండగా.. ఈ నెల 19న సైబరాబాద్ పోలీసుల బృందం గోవాలో అరెస్టు చేసింది. ఆ తర్వాత హైదరాబాద్‌కు తరలించి.. విచారణ అనంతరం ఉప్పరపల్లి కోర్టులో హాజరుపరిచారు. ఈ మేరకు కోర్టు 14 రోజుల రిమాండ్‌ని విధించింది.

# హైదరాబాద్‌లో దంచికొట్టిన వాన

### ప్రధాన రహదారులన్నీ జలమయం



విశ్వంభర, హైదరాబాద్ : హైదరాబాద్‌లో సోమవారం సాయంత్రం భారీ వర్షం పడింది. తార్నాక, ఓయూ క్యాంపస్, లాలాపేట్, హబ్సిగూడ, నాచారం, మల్లాపూర్ తదితర ప్రాంతాల్లో వాన దంచి కొట్టింది. దీంతో రోడ్లపై వరద నీరు చేరడంతో ప్రధాన రహదారులు చిన్నపాటి చెరువులు, కాలువలను తలపించాయి. జీహెచ్ఎంసీ, డీఆర్ఎఫ్ బృందాలు రంగంలోకి దిగి వరద నీటిని నాలాల్లోకి మళ్లించాయి.

ఎల్‌బీనగర్, దిల్‌సుఖ్‌నగర్, మలక్‌పేట్, ముషీరాబాద్, చంపాపేట్, సైదాబాద్, సరూర్‌నగర్, కోఠి, సుల్తాన్‌బజార్, తదితర ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. ముసారాంబాగ్ వంతెనను వరద తాకుకుంటూ ఉప్పొంగి ప్రవహిస్తోంది. అప్రమత్తమైన అధికారులు వంతెనపై రాకపోకలు నిలిపేశారు. ఇరువైపులా భారీగా ట్రాఫిక్‌జాం అయ్యింది. బేగంబజార్, అబిడ్స్, చాంద్రాయ ణగుట్ట, ఫలక్‌నూమ, చార్మినార్, బహదూర్‌పుర, ఉప్పుగూడ, నాంపల్లి, బషీర్‌బాగ్, హిమాయత్‌నగర్, నారాయణగూడ, బోయిన్‌పల్లి, అల్వాల్, చిలకలగూడ, మేడ్చల్, దుండిగల్, గండిమైసమ్మ, మల్లంపేటలో వర్షం దంచి కొట్టింది. రోడ్లపై వాన నీరు చేరడంతో వాహనదారులు, బాటసారులు ఇబ్బందులు పడ్డారు.

**సీపీ ఆనంద్ అత్యవసర సమావేశం**

వాతావరణశాఖ హెచ్చరికల నేపథ్యంలో అన్ని శాఖల అధికారులతో హైదరబాద్ సీపీ సీవీ ఆనంద్ అత్యవసర సమీక్ష నిర్వహించారు. నగరంలో అధికార యంత్రాంగమంతా వేగంగా స్పందించి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆయన పేర్కొన్నారు. కీలకమైన కూడళ్లలో వరదనీరు, ట్రాఫిక్ క్రమబద్ధీకరణ చేపట్టాలని అధికారులకు స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జీహెచ్ఎంసీ కమిషనర్ అమ్రపాలి, మూడు కమిషనరేట్ల సీపీలు, మున్సిపల్‌శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి దానకిషోర్, హెచ్ఎండీఏ, హైడ్రా అధికారులు పాల్గొన్నారు.

**తెలంగాణలో మూడురోజులు భారీ వర్షా లు ఎల్లో అలర్ట్ జారీ చేసిన వాతావరణ శాఖ**

తెలంగాణలో మూడురోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. పశ్చిమ మధ్య బంగాళాఖాతంలోని అల్పపీడనం, దక్షిణ కోస్తా మయన్మార్‌లోని ఉపరితల ఆవర్తనం తూర్పు, పశ్చిమ ద్రోణితో కలిసిపోయి.. సగటు సముద్రమట్టానికి 5.8 కిలోమీటర్ల ఎత్తు వరకు విస్తరించి ఉందని.. ఎత్తుకు వెళ్లే కొలది నైరుతి దిశగా వంగి ఉంటుందని.. దీని ప్రభావంతో పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడేందుకు అవకాశం ఉందని వాతావరణ కేంద్రం పేర్కొంది. ఈ క్రమంలో మంగళవారం నిర్మల్, నిజామాబాద్, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, రంగారెడ్డి, వికారాబాద్, సంగారెడ్డి, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో అక్కడక్క భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది.

మంగళవారం కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, రంగారెడ్డి, వికారాబాద్, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో భారీ వర్షాలుపడే అవకాశం ఉందని హెచ్చరించింది. బుధవారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగామ, సిద్దిపేట, భువనగిరి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నారాయణపేట జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలుపడుతాయని వివరించింది. ఈ క్రమంలో ఆయన జిల్లాలకు వాతావరణశాఖ ఎల్లో అలర్ట్‌ను జారీ చేసింది.

## వరద బాధితులకు మహేశ్ బాబు విరాళం



**హైదరాబాద్ :** తెలంగాణలో ఇటీవల వచ్చిన భారీ వర్షాలు, వరదల వల్ల పలు ప్రాంతాలు తీవ్రంగా నష్టపోయాయి. వందలాది మంది నిరాశ్రయులయ్యారు. ఆ భారీ ఎత్తున నష్టం చేకూరింది. వేలాది ఎకరాల పంటలు నీటమునిగాయి. ఈ సమయంలో సహాయం అందించేందుకు పలువురు ప్రముఖులు, టాలీవుడ్ హీరోలు ముందుకొచ్చారు. ఈ క్రమంలో సూపర్ స్టార్ మహేష్ బాబు స్పందించారు. వరదల సమయంలో తెలుగు రాష్ట్రాలకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ సీఎం సహాయ నిధికి చెరొక 50 లక్షల చొప్పున సహాయం చేస్తానని అందిస్తానని మాట ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం.. సోమవారం మహేష్ బాబు తన సతీమణి నమ్రత శిరోద్కర్ తో కలిసి జూబ్లీహిల్స్ లోని ముఖ్యమంత్రి నివాసం చేరుకున్నారు. ఈ ప్రత్యేక భేటీలో సీఎం రేవంత్ రెడ్డి ని కలిసి రూ.50 లక్షలతో పాటు, ఆయన నిర్వహిస్తున్న ఏఎంబి సినిమాస్ తరపున కూడా మరో రూ.10 లక్షల విరాళం సంబంధించిన చెక్ అందజేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మహేష్ బాబు దంపతులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. "ఇలాంటి సమయంలో సినీ నటులు కూడా తమ వంతు సహాయాన్ని అందించడంలో ముందుండటం గర్వకారమని.. మహేష్ బాబు దంపతులను అభినందించారు.' సీఎం రేవంత్ రెడ్డి. అయితే.. సీఎం రేవంత్ రెడ్డితో మహేశ్ బాబు భేటీ గానీ, ఆయన విరాళం ఎంత ఇచ్చాడనే విషయం కానీ వైరల్ అవ్వడం కావడం లేదు. సీఎం రేవంత్ రెడ్డికి విరాళం అందజేసిన సమయంలో మహేశ్,నమ్రతతో కలసి ఫోటోలు దిగారు. ప్రస్తుతం ఆ ఫోటోలు సోషల్ మీడియాను తెగ వైరల్ అవుతున్నాయి. ఈ ఫోటో మహేష్ లాంగ్ హెయిర్,గడ్డంతో కనిపిస్తున్నారు. మహేష్ బాబు లుక్ చూసి అంతా ఫిదా అవుతున్నారు. అచ్చు హాలీవుడ్ హీరో కీన్ రీవ్స్ లా ఉన్నాడంటూ.. కామెంట్స్ చేస్తున్నారు. నిజంగా మహేష్ బాబు హాలీవుడ్ కట్ అవుట్ అంటూ.. కామెంట్స్ చేస్తున్నారు.

## అబద్ధం ఆడితే అతికేటట్టు ఉండాలి

### మంత్రి శ్రీధర్ బాబుకు హరీశ్ రావు కౌంటర్



**విశ్వంభర, హైదరాబాద్:** అబద్ధం ఆడితే అతికేటట్టు ఉండాలని శాసన సభా వ్యవహారాల శాఖ మంత్రి శ్రీధర్ బాబును ఉద్దేశించి మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. మీటింగ్ అరికెపూడి గాంధీ ముఖ్యమంత్రిని కలిసిన విషయంలో శ్రీధర్ బాబు వివరణను ఆయన తప్పుబట్టారు. తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడారు.

' సీఎల్పీ సమావేశానికి అరికెపూడి గాంధీ వచ్చారు. ఇకనైనా ఫిరాయింపులపై బుకాయింపులు మానండి.. అని నేను ట్వీట్ చేశాను. దాని మీద తన చాకచక్యాన్ని, తెలివితేటలను ఉపయోగించి... సీఎల్పీ మీటింగ్ గాంధీ నియోజకవర్గంలో జరిగింది..ముఖ్యమంత్రిని మర్యాదపూర్వకంగా కలిసేందుకు వచ్చారని శ్రీధర్ బాబు అన్నారు. అధికారిక మీటింగ్‌కు సీఎం వస్తే.. మర్యాదపూర్వకంగా కలిసేందుకు వస్తారు తప్ప.. పార్టీ మీటింగ్‌కు రారు అనే విషయాన్ని శ్రీధర్ బాబు గ్రహించాలి. మరి ప్రకాశ్ గౌడ్ ఎందుకు వచ్చారు..? శ్రీహరి ఎందుకు వచ్చారు..? దానికి సమాధానం చెబుతారా..? అబద్ధం ఆడితే అతికేటట్టు అయినా ఉండాలా.?? జనం ఛీఛీ అంటున్నరు. మీరు ఎన్ని అబద్ధాలు మాట్లాడుతారు? ఆయన బీఆర్ఎస్‌లోనే ఉన్నానని చెబుతాడు. మళ్లీ వీరంతా మీటింగ్‌కు పోతారు. ఇది ఇద్దరు బీఆర్ఎస్ ఎమ్మెల్యేల కొట్లాట అని శ్రీధర్ బాబు అంటారు. ఇవాళ్నేమో కలవడానికి వచ్చారంటారు అదే శ్రీధర్ బాబు. కానీ నగ్నంగా బయటపడింది. ప్రజాస్వామ్య విలువలను ఖూనీ చేస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం నగ్నంగా బయటపడింది. ఇంకా దాన్ని

# అమృత్ టెండర్లలో అవినీతి..

**○ బీజేపీ మౌనంపై కేటీఆర్ ఆశ్చర్యం..**



**విశ్వంభర, హైదరాబాద్:** అమృత్ టెండర్లలో అవినీతి విషయంలో బీజేపీ మౌనం ఆశ్చర్యపరుస్తోందని

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. అమృత్ టెండర్ల కుంభకోణంలో సీఎం రేవంత్ రెడ్డి భారీ అవినీతిని బయటపెట్టినందుకు కొందరు సీనియర్ కాంగ్రెస్ నేతల నుంచి అభినందనలు వస్తున్నాయి కానీ తెలంగాణ బీజేపీ నేతలు తమకు ఏమి తెలియనట్లు, వినబడనట్లు వ్యవహరిస్తున్నారన్నారు. రేవంత్ రెడ్డి, బీజేపీ నేతల మధ్య అద్భుతమైన ప్రేమకథనే నడుస్తోందని కేటీఆర్ ఎద్దేవా చేస్తూ ట్వీట్ చేశారు.

### పండు ముసలవ్వలను మోసం చేసిన రేవంత్‌రెడ్డి..కేటీఆర్

ఆరు గ్యారంటీల పేరుతో అధికారంలోకి వచ్చిన రేవంత్ రెడ్డి.. ఏ ఒక్కటీ అమలు చేయకుండా అన్ని వర్గాల ప్రజలను మోసం చేశారని కేటీఆర్ ఆరోపించారు. వృద్ధులకు ఇచ్చే పెన్షన్లు పెంచుతానని మాయమాటలు చెప్పి.. చివరకు పండు ముసలవ్వలను కూడా మోసం చేసిన నీచుడు రేవంత్ రెడ్డి అని మండిపడ్డారు. ఆసరా పెన్షన్లు సకాలంలో రాక.. వృద్ధులు కూడా రోడ్లెక్కి ధర్నా చేయాల్సిన పరిస్థితి ఈ రాష్ట్రంలో దాపురించిందని కాంగ్రెస్ సర్కార్‌పై కేటీఆర్ నిప్పులు చెరిగారు.

## కాంగ్రెస్ దళితులకు వ్యతిరేకం

### కుమారి షెల్జాను అవమానించింది : అమిత్ షా

**ఫతేహాబాద్:** కాంగ్రెస్ పార్టీ దళిత వ్యతిరేక పార్టీ అని, ఆ పార్టీ దళిత నాయకురాలు కుమారి షెల్జాను అవమానించిందని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా దుయ్యబట్టారు. హర్యానా అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా అమిత్ షా సోమవారం హర్యానాలోని ఫతేహాబాద్‌లో జరిగిన సభలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ర్యాలీలో ప్రసంగించిన ఆయన కాంగ్రెస్‌ని తీవ్రంగా విమర్శించారు. దళిత నేతలను అగౌరవపరిచిన కాంగ్రెస్ పార్టీ దళిత వ్యతిరేక పార్టీ అన్నారు. రాహుల్ గాంధీ ఇటీవల అమెరికాలో 'దేశం అభివృద్ధి జరిగిన తర్వాత రిజర్వేషన్లు అవసరం లేదు. వాటిని తొలగిస్తాం' అని అన్నారని, రిజర్వేషన్లకు కాంగ్రెస్ వ్యతిరేకమని ఆయన మాటలే చెబుతున్నాయని షా అన్నారు. కేవలం మోదీ మాత్రమే ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలకు చెందిన రిజర్వేషన్లను కాపాడగలరని అమిత్ షా చెప్పుకొచ్చారు. జమ్మూకాశ్మీర్ ఎన్నికల సందర్భంగా రాహుల్ గాంధీతో పాటు నేషనల్ కాన్ఫరెన్స్ నేతలు కూడా ఆర్టికల్ 370ని పునరుద్ధరిస్తామని, ఉగ్రవాదులందరినీ విడుదల చేస్తామని చెప్పారని తెలిపారు.

'రాహుల్‌కి నేను చెప్పదలచుకున్నది ఒక్కటే.. 'రాహుల్ బాబా మీకే కాదు.. మీ మూడోతరం వచ్చినా ఆర్టికల్ 370 తిరిగి రాదు' అని చెప్పాలనుకుంటున్నా. ఆర్టికల్ 370 ఇప్పుడు చరిత్రగా మారింది. మీ తాత కాలంలో ఆర్టికల్ 370 అనేది ఓ పెద్ద క్వశ్చన్ మార్క్‌గా ఉంది. ఆ క్వశ్చన్‌మార్క్‌ను నరేంద్ర మోదీ తొలగించేశారు. అదిక తిరిగిరాదు' అని షా వ్యాఖ్యానించారు. హర్యానా ఎన్నికలకు సంబంధించి మాట్లాడుతూ.. 'బీజేపీ పాలన ఎలా ఉంటుందో చెప్పడానికి హర్యానానే ఉదాహరణ అని అన్నారు.

గతంలో హర్యానాలో రెండు వేర్వేరు పార్టీలు అధికారంలోకి వస్తూ పోతుండేవి. ఒక పార్టీ అధికారంలోకి రాగానే అవినీతి పెరిగిపోయింది. మరో పార్టీ అధికారంలోకి రాగానే గూండాయిజం పెరిగింది. రెండు పార్టీల్లోనూ ఆశ్రిత పక్షపాతం, కులతత్వం తారాస్థాయికి చేరుకున్నాయి. ఇలాంటి సమయంలోనే హర్యానాలో బీజేపీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. ఇక్కడ బీజేపీ అధికారంలోకి రాకముందు ఉద్యోగం పొందాలంటే కచ్చితంగా ముడుపులు ముట్టజెప్పాల్సిందే. కానీ ఇప్పుడు ఆ పరిస్థితి లేదు' అని రాహుల్‌గాంధీ అన్నారు.

## భగత్ సింగ్ జయంతిని జయప్రదం చెయ్యండి



**విశ్వంభర, కుత్బుల్లాపూర్:** మేడ్చల్ జిల్లా కుత్బుల్లాపూర్ నియోజక వర్గం 126 డివిజన్ జగద్గిరి గుట్ట సీపీఐ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించడం జరుగుతుందని సీపీఐ పార్టీ నియోజకవర్గ కార్యదర్శి ఉమా మహేష్ తెలిపారు. వారు మాట్లాడుతూ స్వంతంత్ర సమరయోధుడు విప్లవ వీరకిషోరం భగత్ సింగ్ 117వ జయంతి సందర్భంగా సీపీఐ ఉద్యమకారులు, మేధావులు ముఖ్యంగా విద్యార్థులు, యువజనులు పాల్గొని జయప్రదం చెయ్యాల్సిందిగా సోమవారం జగత్ గిరి గుట్ట కార్యాలయం లో తెలియజేశారు. 1904 సెప్టెంబర్ 28న లహోరు పట్టణంలో జన్మించిన భగత్ సింగ్ స్వాతంత్ర ఉద్యమంలో చిన్న వయసులోనే పాల్గొని చంద్రశేఖర్ అజాద్ తో కలిసి హిందూస్తాన్ సోషలిస్ట్ పార్టీని స్థాపించి యువకులను స్వతంత్ర ఉద్యమంలో పాల్గొనేలా చేసి బ్రిటిష్ వాడికి వణుకు పుట్టేలా చేసిన గొప్ప విప్లవకారుడు భగత్ సింగ్ అని అన్నారు. భగత్ సింగ్ పేరు చెబితేనే రోమాలు నిక్కబొడుస్తాయని, ఆయనలా ఉండాలని నాటి ప్రజలు వాళ్ళ పిల్లలకు భగత్ సింగ్ పేరు పెట్టుకున్నారని, అలాంటి మహానుభావుడి జయంతిని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అధికారికంగా నిర్వహించకపోవడం బాధాకరమని అన్నారు. భగత్ సింగ్ జయంతి, వర్ధంతులను నిర్వహిస్తే భగత్ సింగ్ కోరుకున్న సోషలిస్టు భావజాలం ప్రజలకు చేరితే తమ పప్పులు ఉడకవని నిర్వహించట్లేదని విమర్శించారు. నేడు బీజేపీ, ఆర్ ఎస్ ఎస్ లు జైలు శిక్షను తప్పించుకున్న సావర్కర్‌ను దేశ భక్తుడిగా ప్రచారం చేస్తుంటే, అవకాశం ఉండి కూడా తల్లితండ్రులు, ఆనాటి బ్రిటిష్ వారు కూడా క్షమాభిక్ష కోరమంటే కొరకుండా ఊరితాడును ముద్దాడుతూ, ఈ దేశ స్వంతంత్రం కోసం నా ప్రాణాలు ఇవ్వడం గొప్పేమి కాదు అన్న భగత్ సింగ్ ని, ఎవరు దేశ భక్తులో తెల్సుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. తను రాసిన ఎన్నో పుస్తకాలు, లేఖలలో తాను ఈ దేశంలో సోషలిస్టు రాజ్యం వస్తేనే ప్రజలకు సమన్యాయం వస్తుందని, దేవుడే ఉంటే ప్రజలు ఇంతగా హింసకు గురవుతుంటే స్పందించడా అని ప్రశ్నించి, నేను నాస్తికుడిని ఎందుకు అయ్యాను అని పుస్తకం రాశాడని అన్నారు. తనను మీ చివరి కోరిక ఏంటని జైలర్ అడిగితే కామ్రేడ్ లెనిన్ రాసిన పుస్తకం చదవడం మధ్యలో ఉందని దాన్ని పూర్తిచేస్తానని చెప్పి తన సిద్ధాంతాన్ని ప్రకటించాడని అన్నారు. ఈ దేశ యువత, విద్యార్థులు భగత్ సింగ్ ఏ లక్ష్యం కోసమైతే పోరాడిండో ఆ లక్ష్యాల వైపు నడవాలని, ఆ విధంగా ప్రచారం చెయ్యడానికి సీపీఐ కార్యకర్తలు పూనుకొని జయంతి, వర్ధంతి కార్యక్రమాలను ఘనంగా నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ కార్యవర్గ సభ్యులు హరినాథ్, శ్రీనివాస్, సహదేవ్ రెడ్డి, రాములు కౌన్సిల్ సభ్యులు సామెల్, రవి లు పాల్గొన్నారు.

# రెండు రోజుల సదస్సు... బాల సాహిత్యానికి ఉషస్సు

○ సారస్వత పరిషత్తు ఆధ్వర్యంలో విస్తృత చర్చ

> 1943 లో స్థాపితమైన నాటి ఆంధ్ర సారస్వత పరిషత్తు ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రం నుండి మొదలుకొని తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం అనంతరం గొప్ప సాహితీ సంస్థగా ఎదిగి అవిరళంగా సాహితీ రంగాన కృషి చేస్తోంది. బాల సాహిత్యంలోనే కాకుండా ప్రౌఢ సాహిత్యంలో కూడా తెలంగాణ సారస్వత పరిషత్తు విశేషమైన కృషి కొనసాగిస్తూ వస్తోంది. మాడపాటి హనుమంతరావు, సురవరం ప్రతాపరెడ్డి, దేవులపల్లి రామానుజ రావు, డాక్టర్ సింగిరెడ్డి నారాయణరెడ్డి దగ్గర నుండి ఈనాటి ఆచార్య ఎల్లూరి శివారెడ్డి వరకు అనేకమంది సాహితీ దిగ్గజాలు పరిషత్తు వికాసంలో కొనసాగించిన సేవలు అనిర్వచనీయం. సారస్వత పరిషత్తు లేకపోతే తెలుగు భాషా వికాసం జరిగేది కాదు. ఆనాటి ఉర్దూ భాష ధాటికి రెపరెపలాడుతున్న తెలుగు భాషా జ్యోతిని సముజ్వలంగా వెలిగించింది సారస్వత పరిషత్తు. ఆనాటి పెద్దలు నిర్ణయించిన పద్ధతిని ఈనాడు కూడా అనుసరిస్తూ కాలానుగుణంగా విలువలను కాపాడుకుంటూ ఎంతోమంది మిత్రుల సహకారంతో భాషా సాహిత్య వైభవానికి ప్రణాళికా బద్ధంగా అనేక కార్యక్రమాలను నిర్వహిస్తూ వస్తోంది.




సమాజ వికాసానికి సహాయ పడే సాహిత్యాన్ని అందిస్తోంది. అందులో భాగంగానే బాలల వికాసం కోసం, సాహిత్యాభిలాషను వికసింప చేయడం కోసం అనేక పోటీలు నిర్వహిస్తూ బహుమతులను అందజేస్తూ నేటి బాలలను ఎంతగానో ప్రోత్సహిస్తుంది. పిల్లలు రాసిన , పిల్లల కోసం పెద్దలు రాసిన బాల సాహిత్యానికి సంబంధించి అనేక పుస్తకాలను ప్రచురించింది. పాఠశాలల్లో విద్యార్థి దశలో భాష పట్ల ఆసక్తి, అనురక్తి కలిగిన వారిని గుర్తించి ప్రోత్సహించే ఉపాధ్యాయులను, బాలసాహితీవేత్తలను ఒక వేదిక మీదకు తీసుకొచ్చి బాల సాహిత్య సమ్మేళనం నాభూతో నా భవిష్యత్తు అన్నంతగా ఎంతో వైభవంగా రెండు రోజులపాటు గత సంవత్సరం నిర్వహించిన దానికంటే ఎంతో ఘనంగా సారస్వత పరిషత్తు నిర్వహించింది. తెలంగాణ సారస్వత పరిషత్తు ఆధ్వర్యంలో డాక్టర్ వరప్రసాద్ రెడ్డి సౌజన్యంతో మాతృమూర్తి శ్రీమతి కోడూరు శాంతమ్మ స్మారక బాల సాహిత్య సమ్మేళనం ఈ సంవతసరం మే 29,30 తేదీల్లో హైదరాబాదులో కన్నుల పండుగగా జరిగింది. రెండు తెలుగు ప్రాంతాలతో పాటు, ఇతర రాష్ట్రాల్లో నివసిస్తున్న బాల సాహితీ వేత్తలు, రచయితలు, సాహిత్య అభిమానులు పాల్గొన్నారు. వక్తలు విభిన్న అంశాలపై విస్తృత స్థాయిలో చర్చించారు. సారస్వత పరిషత్తు అధ్యక్షులు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా శాంతా వసంతా ట్రస్ట్ అధ్యక్షులు, పద్మభూషణ్ గౌరవ డాక్టర్ వరప్రసాద రెడ్డి రెండు రోజుల సమావేశాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్తులో బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదిగేందుకు బాల సాహిత్యం బాలలకు ఎంతో కీలకమని అన్నారు. బాల సాహిత్యం బాలలకు చేరువ అయినప్పుడే ఈ కార్యక్రమానికి సార్థకత చేకూరుతుందని అభిప్రాయపడ్డారు.

**నాలుగు కాలాల పాటు నిలచి ఉండే బాల సాహిత్యం రావాలి**

విశిష్ట అతిథిగా పాల్గొన్న పూర్వ తెలంగాణ ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కె.వి.రమణాచారి మాట్లాడుతూ సమాజంలోని మంచి చెడులను చెప్పేది కవులు, రచయితలేనని వారు తమ కలాలకు పదును పెట్టి అక్షర బాణాలను ఎక్కుపెట్టాలని అన్నారు. నాణ్యమైన, నాలుగు కాలాలపాటు నిలిచి ఉండే బాల సాహిత్యాన్ని అందించే విధంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, నేటి బాలలకు మన సంస్కృతిని సాంప్రదాయాలను, ఆచార వ్యవహారాలను తెలియజేసే విభిన్న ప్రక్రియలకు బాల సాహిత్యంలో చోటు కల్పించాలని, బాల సాహిత్యం యొక్క ప్రయోజనాలను విడమర్చి సమాజానికి తెలియజేయాలని అందుకు ప్రభుత్వ బడులే తావులుగా, ఉపాధ్యాయులే మార్గదర్శకులుగా మారాలని సూచించారు. ఇప్పటికే బాల సాహిత్యం రాశిలోనూ పెరిగిందని, నాణ్యత లోను మరింతగా పెరగాలని, అందుకోసం బాలసాహిత్యం రాస్తున్న బాల సాహితీవేత్తలను, రచయితలను మరింతగా ప్రభుత్వం ప్రోత్సహించాలని అభిప్రాయపడ్డారు. గౌరవ అతిథిగా పాల్గొన్న గరిపెల్లి అశోక్ రెండు రోజుల బాల సాహిత్య వర్క్ షాప్ సమావేశాన్ని తగిన సమన్వయంతో నిర్వహించడంలో కీలక పాత్ర వహించారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలోనే బాలల కోసం సారస్వత పరిషత్ రూపొందించిన "భాషా సాహిత్య వైభవం", "ఆరోగ్యం విజ్ఞానం", "పిల్లల కథలు" (1,2,3,45) ఐదు భాగాలు గల పుస్తకాల ఆవిష్కరణ జరిగింది. ఈ సమావేశంలో పరిషత్తు కార్యదర్శి డాక్టర్ జుర్రు చెన్నయ్య, పైడిమరి రామకృష్ణ, చొక్కాపు వెంకటరమణ, దాసరి వెంకటరమణ, గరిపెల్లి అశోక్, అమరవాది నీరజ పాల్గొన్నారు.

**మాతృ భాషను కాపాడుకోవాలి**

మొదటి రోజు మొదటి సదస్సులో "బడిలో తెలుగు భాష " అనే అంశంపై ప్రముఖ బాలసాహితీవేత్త డాక్టర్ వి. ఆర్.శర్మ అధ్యక్షతన చర్చా గోష్టి జరిగింది. కేంద్ర సాహిత్య అకాడమీ బాల సాహిత్య పురస్కార గ్రహీత డాక్టర్ దాసరి వెంకటరమణ విశిష్ట అతిథిగా పాల్గొని అనతి కాలంలోనే మాతృభాష అయిన తెలుగు మృత భాష అవుతుందని ఐక్యరాజ్యసమితి పేర్కొన్నదని అందుకుగాను భాషాభిమానులు మేల్కొని మాతృభాషను కాపాడుకోవాలని తెలిపారు. ఈ సదస్సులో పాల్గొన్న ప్రముఖులు బడిలో తెలుగు భాష ఎదుర్కొంటున్న సవాళ్లను తెలియజేస్తూ తమ తమ అభిప్రాయాలను సవివరంగా చర్చించారు. డాక్టర్ ఉప్పల పద్మ సమన్వయకర్తగా వ్యవహరించిన ఈ సదస్సులో కూకట్ల తిరుపతి, గోపగాని రవీందర్, పుల్లా రామాంజనేయులు, గోపగాని రవీందర్, సయ్యద్ షఫీ, బాల బోయిన రమాదేవి, గుళ్ళపల్లి తిరుమల కాంతి కృష్ణ, బద్రి కుర్మారావు, కొండూరు పోతన, అక్షరం ప్రభాకర్, చక్రవర్తుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

**పత్రికల కృషి ప్రశంసనీయం**

అనంతరం రెండవ సదస్సు నేటి నిజం పత్రిక సంపాదకులు బైస దేవదాస్ అధ్యక్షతన "పత్రికలు బాల సాహిత్యం " అనే అంశంపై చర్చా గోష్టి జరిగింది . ఈ సందర్భంగా దేవదాసు మాట్లాడుతూ అనేక సంవత్సరాలుగా నేటి నిజం పత్రిక పూర్తి పేజీని బాల సాహిత్యం కోసం ప్రతి బుధవారం కేటాయించిందని తెలియజేశారు. విశిష్ట అతిథిగా పాల్గొన్న బాల చెలిమి సంపాదకులు మణికొండ వేద కుమార్ మాట్లాడుతూ నేటి సమాజంలో పత్రికలు బాల సాహిత్యానికి చేస్తున్న కృషిని కొనియాడారు. పత్రికలు కొంతవరకు నష్టపోతున్నప్పటికీ పిల్లల మీద ఉన్న ప్రేమతో సమాజ మార్పు కోసం పనిచేస్తున్నాయని, బాల సాహిత్యంలో వివిధ ప్రక్రియలు రాస్తున్న కవులను, రచయితలను ప్రోత్సహిస్తూ బాల సాహిత్యాన్ని ముందుకు నడిపిస్తూ బాలలకు చేరువయ్యేలా తపనతో పత్రికలు చేస్తున్నాయని తెలిపారు. బాల సాహిత్య పత్రికలను ప్రభుత్వం మరింతగా ప్రోత్సహించాలని ఆర్థిక సహకారం అందించాలని వక్తలు అభిప్రాయపడ్డారు. ప్రముఖ బాలసాహితీవేత్త కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి సమన్వయకర్తగా వ్యవహరించిన ఈ సమావేశంలో విపుల, చతుర పూర్వ సంపాదకులు కంతేటి చంద్ర ప్రతాప్, మొలక సంపాదకులు వేదాంత సూరి, చెకుముకి నిర్వాహకులు రాజా, సాహితీ కిరణం బాధ్యులు పొత్తూరి సుబ్బారావు, బాలల నేస్తం సంపాదకులు డాక్టర్ నెమిలేటి కిట్టన్న, గడుగ్గాయి పత్రికా నిర్వాహకులు కృష్ణ చైతన్య తదితరులు పాల్గొన్నారు.

**ఆకట్టుకునేలా కథలు చెప్పాలి**

మూడవ సదస్సు డాక్టర్ చొక్కాపు వెంకటరమణ అధ్యక్షతన "కథ చెప్పే కళ " అనే అంశంపై చర్చ గోష్టి జరిగింది. ఈ సందర్భంగా వెంకటరమణ మాట్లాడుతూ కథలు ఏ విధంగా చెప్పాలో , కథలు చెప్పేటప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తల గురించి, కథను ఎలా చెబితే పిల్లలు వింటారో అనే అంశాలపై అనేక మెలకువలు అందించారు. ఇందులో పాల్గొన్న డాక్టర్ ఎం హరి కిషన్ ఒక కథను ఉదాహరణకు తీసుకుని ఎంతో సృజనాత్మకంగా చెప్పారు. కథ చెప్పే విధానం అందరినీ ఆలోచింపజేసింది. అనంతరం ఎన్నవెల్లి రాజమౌళి మరో కథను కూడా ఉదాహరించారు. కథలు చెప్పడంలో మొదటగా మనలో ఆసక్తి ఉండాలని, కథలు చెప్పేటప్పుడు హావభావాలను ప్రదర్శించాలని సన్నివేశాలకు తగ్గట్టుగా కథలు బోధించాలని , పిల్లలను కథల వైపు దృష్టి పడేలా చూడాలని అన్నారు. ఈ సదస్సులో సమ్మెట ఉమాదేవి, మనోజ, దివ్య, పద్మ, ప్రమీల, కృష్ణచైతన్య, సుబ్రహ్మణ్యం, తదితరులు కథలు చెప్పే విధానం పై మాట్లాడారు. శ్రీమతి రమాదేవి కులకర్ణి సమన్వయ కర్తగా వ్యవహరించారు.

**లలిత కళలతో బాలల్లో వికాసం**

రెండవ రోజున నాలుగో సదస్సులో " లలిత కళా పరిచయం " అంశంపై బాల వికాస కారులు శాంతారావు అధ్యక్షతన జరిగింది. శాంతారావు మాట్లాడుతూ పిల్లల సర్వతో ముఖాభివృద్ధికి లలిత కళలు కూడా ఎంతో దోహదపడతాయని అన్నారు. విశిష్ట అతిథిగా పాల్గొన్న ప్రముఖ విద్యావేత్త, రచయిత్రి డాక్టర్ జి. అమృతలత పిల్లల సంపూర్ణ మూర్తిమత్వానికి చతుష్షష్టి కళలు ఎంతో ఉపయోగమని , కానీ తల్లిదండ్రులలో కళల పట్ల పెద్దగా శ్రద్ధ లేదని అందుకుగాను తల్లిదండ్రులు, సమాజం ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని సూచించారు. ఈ సమావేశంలో ప్రముఖ సంగీత విద్వాంసురాలు మాడభూషిణి రాజ్యలక్ష్మి , ప్రముఖ నర్తకి కోకా విజయలక్ష్మి, ప్రముఖ రంగస్థలం నటులు, దర్శకులు బీచ రాజు శ్రీధర్, ప్రముఖ చిత్రకారులు జె. వెంకటేశ్వర్లు, జానపద కళాకారులు గజవెల్లి ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి సమన్వయకర్తగా అధ్యాపకులు, కళాకారులు కోకిల నాగరాజు వ్యవహరించారు.

**బాలలకు చేరితేనే సార్థకత**

ఐదవ సదస్సులో " బాల సాహిత్యం ప్రమాణాలు " అనే అంశంపై చర్చా గోష్టి ప్రముఖ బాలసాహితీవేత్త శ్రీమతి ముంజలూరి కృష్ణకుమారి అధ్యక్షతన జరిగింది. విశిష్ట అతిథిగా పాల్గొన్న శ్రీమతి మాడభూషి లలితా దేవి మాట్లాడుతూ బాల సాహిత్యం అంటే ఏమిటి? బాల సాహిత్యానికి ఉండవలసిన ప్రమాణాలు ఏమిటి? వంటి అంశాలపై మాట్లాడారు.. ఇందులో పాల్గొన్న ప్రముఖ వక్తలు మాట్లాడుతూ బాల సాహిత్యంలో పాటించవలసిన నియమాలు, వస్తువు, విషయం , రాశి వాసి, ఎలా ఉండాలి అనే అంశంపై విస్తృతంగా చర్చించారు. ఏది బాల సాహిత్యం అనడానికి బాలలకు ఏది చేరువవుతుందో అదే బాల సాహిత్యంగా పరిగణించాలని, అదే ప్రమాణంగా పాటించాలన్నారు. మెరిసేదంతా బంగారం కానట్లు రాసేదంతా బాల సాధ్యం కాదని, కొంతమంది రచయితలు పేరు కోసం ఏదో రాస్తున్నట్లు ఉన్నారని, ఇది సరైన విధానం కాదని పేర్కొన్నారు. ఈ సదస్సులో గంగిశెట్టి శివకుమార్, పుప్పాల కృష్ణమూర్తి, పైడిమర్రి రామకృష్ణ , ఉండ్రాల రాజేశం, టి.వి. రామకృష్ణ, ఆర్ సి కృష్ణస్వామి రాజు, డాక్టర్ సాగర్ల సత్తయ్య, బి వి ఎస్ స్వామి, సురేష్ తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి డాక్టర్ అమరవాది నీరజ సమన్వయకర్తగా వ్యవహరించారు. అనంతరం జరిగిన ఆరో సదస్సులో "బాల సాహిత్యం గ్రంథాలయాలు " అనే అంశంపై సి.ఏ ప్రసాద్ అధ్యక్షతన చర్చా గోష్టి జరిగింది. విశిష్ట అతిథిగా స్వచ్ఛంద గ్రంథాలయ నిర్వాహకులు శీల అవిలేను పాల్గొని మాట్లాడుతూ బాల సాహిత్యానికి గ్రంథాలయాలు ఈ విధంగా ఉపయోగపడుతున్నాయో, భవిష్యత్తులో బాలలకు ఇంకా ఎట్లా ఉపయోగపడాలో తెలిపారు. గ్రంథాలయంలోని పుస్తకాలను బాలలకు ఎట్లా అందించాలో, ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలో మొదలైన అంశాలను అందించారు. డాక్టర్ కాసర్ల నరేష్ రావు సమన్వయకర్తగా వ్యవహరించిన ఈ సదస్సులో కూచిమంచి నాగేంద్ర, పరుశరాములు, ప్రవీణ్ శర్మ, కందుకూరి భాస్కర్, రమేష్ వెంకటనారాయణ, సుమిత్ర దేవి, పోరెడ్డి అశోక్, మహేశ్వర్, కిరణ్ కుమారి, దుర్గం బైతి తదితరులు పాల్గొన్నారు.

**సాహిత్యం ద్వారానే బాలల్లో మార్పు**

ముగింపు సమావేశం ఆచార్య ఎల్లూరి శివారెడ్డి గారి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో విశిష్ట అతిథిగా తెలంగాణ రాష్ట్ర విద్యా పరిశోధన మండలి డైరెక్టర్ శ్రీమతి ఎం. రాధారెడ్డి పాల్గొని మాట్లాడారు. బాల సాహిత్యం పై రెండు రోజులపాటు సారస్వత పరిషత్తు కొనసాగించిన కృషిని కొనియాడారు. బాలసాహిత్యానికి బడులలో పెద్దపీట వేయగలమని హామీ ఇచ్చారు. బాల ఈ కార్యక్రమంలో విశిష్ట అతిథిగా పాల్గొన్న మోడల్ స్కూల్ సంయుక్త సంచాలకులు , రచయిత్రి పాలడుగు సరోజినీ దేవి మాట్లాడుతూ పిల్లల కోసం మంచి బాల సాహిత్యం రాస్తున్న రచయితలను అభినందించారు. బాల సాహిత్యం ద్వారానే పిల్లల్లో మార్పు వస్తుందని అందుకుగాను పాఠశాల స్థాయి నుండే బాల సాహిత్యం పట్ల మక్కువ పెరిగేలా ఉపాధ్యాయ రచయితలు తగినంత శ్రద్ధ వహించాలని కోరారు. అనంతరం సారస్వత పరిషత్తు కార్యదర్శి డాక్టర్ చెన్నయ్య మాట్లాడుతూ పిల్లల కోసం రూపొందించిన పుస్తకాలు ప్రభుత్వ పాఠశాలలకు అందేలా చూడాలని రాష్ట్ర విద్యా పరిశోధన మండలి డైరెక్టర్ రాధారెడ్డిని కోరారు. అందుకు తగిన చర్యలు తీసుకుంటామని రాధారెడ్డి ఇచ్చిన హామీ కార్యశాలలో భరోసా లభించినట్లు అయింది. ఈ బాల సాహిత్య సమ్మేళనానికి రామానుజ చారి, సత్యనారాయణ మూర్తి, సంగనభట్ల చిన రామకిష్టయ్య, షేక్ అబ్దుల్ హకీం జాని, లక్ష్మణరావు, వడ్డేపల్లి వెంకటేష్, జానకిరామ్ తదితరులు కూడా హాజరయ్యారు.

రెండు రోజుల పాటు సుదీర్ఘంగా జరిగిన బాల సాహిత్యం కార్యశాలలో నిర్వహించిన ఆరు సదస్సులలో అనేక మంది ప్రముఖులు పాల్గొని బాల సాహిత్యం పై విస్తృతంగా చర్చించారు. ప్రతి సదస్సులో జరిగిన చర్చలు ఆలోచింపచేసినవి. తెలంగాణ సారస్వత పరిషత్ రూపొందించిన పుస్తకాలనే కాకుండా బాల సాహితీ వేత్తలు, రాసిన చందమామలో మేనమామ, బహుమతి, పిల్లల జాబిల్లి, బాల రత్నాలు, పసిడి మొగ్గలు , చిగురింతలు, ఆనందలహరి , శ్రీకృష్ణ శతకం , పిల్లల మనసు, బుడుగో... బుడుగో వంటివే కాకుండా పత్రిక ఎడిటర్లు రూపొందించిన బాల చెలిమి, మొలక , చెకుముకి , బాలల నేస్తం,మొదలగు అనేక పుస్తకాలను వివిధ సదస్సులలో ప్రముఖుల చేతుల మీదుగా ఆవిష్కరించబడినవి. రచయితలు రాసిన ఉత్తమ కథలకు ఏడుగురికి నగదు పురస్కారం సారస్వత పరిషత్ వారు అందించడం మరింత ప్రోత్సహించే విధంగా అనిపించింది. బాల సాహిత్యకారులకు ఈ వర్క్ షాప్ దిశ నిర్దేశం చేస్తూ సరైన తోవలో పయనించేలా చేసిందని చెప్పవచ్చు. ఇందులో బాలసాహిత్య రచయితలు, తమ అభిప్రాయాలను ఒకరికి ఒకరు పంచుకున్నారు . తగిన మెలకువలు తెలుసుకున్నారు. రాబోయే రోజులలో కూడా తెలంగాణ సారస్వత పరిషత్ ఇటువంటి సమావేశాలు ప్రతి ఏటా నిర్వహించాలని కోరుకుందాం.



- కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి
బాల సాహితీవేత్త
ఫోన్ : 9441561655

# తెలంగాణ మట్టి కథల మాగాణం.. గూడూరి సీతారాం

> గూడూరి కాళోజీ "నా గొడవ" రచన మొదటి ముద్రణకు ప్రూఫులు చూసిన అక్షరాల కొలిమి అతడు. సినారే పీహెచ్ డీ గ్రంథానికి (ఆధునికాంధ్ర కవి త్వము సంప్రదాయములు ప్రయోగాలు) శుద్ధ ప్రతిని తయారు చేసిన సాహితీ శ్రామికుడు అతడు. నెల్లూరు కేశవస్వామి ఉత్తమ కథలు పుస్తకానికి, సంపాదకత్వం వహించి, ముందుమాటను లిఖించిన కథా ప్రేమికుడతడు. తెలంగాణ తొలితరం సాహిత్య మాగాణంలో విరబూసిన కథల పుష్ప గుచ్ఛం అతడు. మట్టి మనుషుల కన్నీళ్లను, కష్టా లను, బాధలను, గాథలను, జీవితాల్ని, సంస్కృతిని, కథలు గా అక్షరబద్ధం చేసిన నిఖార్సైన తెలంగాణ కథానాయకుడు అతడు. మనం మరిచిన ఆ మట్టి కథకుడి పేరే గూడూరి సీతారాం.

**ఆయన వర్ధంతి రేపు**

గూడూరి సీతారాం 1936 జూలై 18న వెంకట లక్ష్మి, లక్ష్మయ్య దంపతులకు సిరిసిల్ల జిల్లా హను మాజీపేటలో జన్మించాడు. యాదృచ్ఛికమే అయినప్పటికీ డాక్టర్ సి.నారాయణరెడ్డి గారి జన్మస్థలం కూడా ఇదే గ్రామం. ఆ విధంగానైనా సరే సాహితీలోకం సీతారాం గారిని గుర్తుంచుకోలేదు. సీతారాం సిరిసి ల్లలో ప్రాథమిక పాఠశాల విద్యాభ్యాసం పూర్తిచేసి, కళాశాల విద్య కోసం హైదరాబాద్ నిజాం కాలేజీలో చేరాడు. చదువుకుంటున్న రోజుల్లోనే తన తొలి కథ 'స్త్రీ స్వాతంత్ర్యం' "నినాదం" అనే పత్రికలో ప్రచురితమైంది. స్త్రీకి స్వాతంత్ర్యం కావాలని వేదికలపై ఉపన్యాసాలు ఇచ్చే వాళ్ళందరూ, వాళ్ళ ఇంట్లో భార్యను ప్రశ్నించనివ్వరు. కూతురు ప్రేమ వివాహం చేసుకున్నా అంగీకరించరు. వితంతు వివాహం తన ఇంట్లో జరగనివ్వరనే విషయాల్ని పాత్రోచితంగా కళ్ళకు కట్టారు గూడూరి. 1956లో హెచ్ఎస్సీలో ఉండగానే తరంగిణి అనే పత్రికను నడిపారు. తెలుగు స్వతంత్ర, తెలుగు దేశం, సుజాత, ఆంధ్రప్రభ వారపత్రిక, ఎన్నో పత్రిక లలో ఆయన కథలు ప్రచురితమయ్యాయి. దురదృష్టవశాత్తు చాలా కథలు అలభ్యమే. జీవిత చరమాంకం వరకు భద్రపరచుకోలేదు. చివరి వరకు కథా సాహిత్యంలో లేకపోవడం ఒక కారణం కావచ్చు.

దాశరథి కష్ణమాచార్యులు, రంగాచార్యులు, పల్లా దుర్గయ్య, వట్టికోట, బిరుదురాజు రామరాజు, డి .రామలింగం, నెల్లూరు కేశవ స్వామి, సురమౌళి మొదలగువారు నారాయణగూడలో తరచుగా కలుసుకొని సాహిత్య చర్చలు జరుపుతూ ఉండేవారు. అందరూ కవిత్వం రాస్తుంటే దాశరథి రంగాచార్య, నెల్లూరి కేశవస్వామి డి. రామ లింగం, జి సురమౌళి, గూడూరి సీతారాం కథలు రాస్తూ ఉండేవారు. వీరి కథలు ఎక్కువగా పల్లెటూరు, ప్రజా మత వార పత్రిక, స్రవంతి మాస పత్రికలో అచ్చవుతూ ఉండేవి. అప్పటి కథల అచ్చుప్రతులను కాపాడుకోలేకపోయామని, అప్పుడు ఆ ధ్యాస కూడా ఉండేది కాదని చెప్తుండేవారు. 1902 నుండి తెలంగాణ కథ సామాజిక పరిణామాలను చిత్రిస్తూ వస్తున్నది. బండారు అచ్చమాంబ తొలి కథకురాలు అని చరిత్ర స్పష్టం చేస్తుంది. అప్పటి తెలంగాణ కథ పుట్టుక నుండి సామాజిక చైతన్యంతోనే కొనసాగుతూ వచ్చింది. సమాజ పరిశీలన, విశ్లేషణ పరిణామాలు, ఫ్యూడల్ సమాజం, ప్రజాస్వామిక స్వేచ్ఛా వాయువులు, తెలంగాణ పలుకుబడులు, గ్రామీణ కులవృత్తులు, సంస్కృతి, గ్రామీణ జీవితం, ప్రజాస్వామిక ఉద్యమాలు మొదలగునవి తెలంగాణ కథలో పలు కోణాల్లో చిత్రించబడ్డాయి. అవి గూడూరి సీతారాం కథల్లో ప్రస్ఫుటం అవుతాయి.

'రాజమ్మ రాజీర్కం'లో అందంగా, ఫ్యాషన్గా తయారవ్వాలని పల్లె పడుచుల కోరికలను వ్యాపారస్తులు, సౌందర్యం ముసుగులో ఎలా లోబరుచు కుంటారో తెలియజేస్తుంది. భిక్షాటన చేసే బతుకుల్లో ఉండే కష్టాలు, కుటుంబ పరిస్థితులు, రోడ్డు ప్రమాదంలో, భర్తను కోల్పోయి, పట్నం నుండి మళ్ళీ తమ పల్లెకు వచ్చి ఎలా జీవిస్తుందో చెప్పే కథ "లచ్చి". పేదరికంతో తండ్రి చనిపోతే కుటుంబ పోషణ కోసం బొంబాయి వెళ్లి దొంగల చేత మోసగించబడి ఇంటికి చేరిన యువకుడి కథ "మా రాజు". గ్రామీణులు పట్నానికి, అలవాటుపడలేక రైలు ఎక్కడానికి కూడా నానా అవస్థలు పడే ఒక కథ "పిచ్చోడు". చిన్నప్పుడే బిలాన్కి బతుకుతెరు వు కోసం వెళ్ళిన రంగడు ఊరు గుర్తుకొచ్చి మారిన పల్లెను చూసి ఆశ్చర్యపోతాడు. తనని రక్షించిన దొర సాని చనిపోయిందని తట్టుకోలేక మళ్ళీ దుఃఖంతో వెళ్తాడు అదే 'రంగడి కథ'.

'దెబ్బతిన్న అహంభావం'లో పురుషుడు అహంకారంతో భార్యను అనుమానిస్తే పుట్టింటికివెళ్లి కొంత కాలం తర్వాత వచ్చిన భార్యకు వేరే స్త్రీతో సంబంధం పెట్టుకుని కనిపించిన భర్త కథ. కనిపించిన ప్రతి యువతికి ఏదో ఒక మాయమాటలు చెప్పి లోబరుచుకుని, అనుభవించి చివరకు ఏకాంతంకావాలని కోరుకున్నా దొరకని పరిస్థితుల్లో ఉన్న ఒక యువకుడి కథ "ఏకాంతం". పైకి విద్యార్థి నాయకుడిగా ఉండి, ఎవరికీ తెలియకుండా ఒక అమ్మాయిని గర్భవతి చేసిన యువకుడి కథ "మేడిపండు". ప్రేమించి పెళ్లి చేసుకొని ఎవరికీ చెప్పకుండా ఊరెళ్ళి పోయిన మిత్రుని కథ "బస్సు కదిలింది". ఇద్దరు ప్రేమికులు వేరువేరు పెళ్లి చేసుకున్నప్పుడు ఆమె ప్రేమ విషయం తెలిసి భర్త పెట్టిన గృహహింస 'చీకటి గొడుగులు'. ఈ విధంగా కథలను ప్రథమ పురుష, ఉత్తమ పురుషల తో పాటుగా నేపథ్య కథనాలతో కూడా అద్భుతమైన కథా శిల్పంతో, మట్టి మనుషుల రోజువారి జీవితాల్ని అక్షరీకరించిన కథకుడు గూడూరి. ఈ కథలు సగటు తెలంగాణ మనిషికి తెలిసిన పదబంధాలు, పలుకుబడులు, జాతీయాలు, చల్ల నుండి వెన్న తీసినట్టుగా మనకు తారసపడతాయి. సీతారాం కథలు మన చుట్టూ ఉన్న వాళ్ళవిగా, కొన్ని సార్లు మనవిగా సంభాషణలు, పాత్రలు కనిపిస్తాయి.

తెలంగాణ వచ్చిన తరువాత గూడూరి సీతా రాం సంపాదకత్వం వహించిన "నెల్లూరు కేశవ స్వామి ఉత్తమ కథలు" పేరుతో ఉన్న పుస్తకం గురించి 'భూమిక' అనే పాఠ్యాంశం పదవ తరగతి తెలుగు వాచకం సిలబస్ లో పెట్టి, మనం మరిచి పోతున్న కథకుడిని తెలంగాణ సాహితీ లోకానికి పరిచయం చేయడం ఆనందదాయకమైన విషయం. విశిష్టమైన వస్తువు, శిల్ప నైపుణ్యంతో, సాహితీలోకం మరువలేని కథల్ని అందించి తెలంగాణ కథా ప్రపంచంలో, మాసిపోని కథారచయితగా, చిరస్మర ణీయుడిగా, వెలుగొంది మనకాలపు మట్టి కథల మాంత్రికుడుగా కీర్తించబడ్డ గూడూరి సెప్టెంబర్ 25, 2011న ఈ లోకాన్ని వీడారు. గూడూరి సీతారాం కథలను, సాహిత్య కృషిని స్మరించుకోవడమే ఆయనకు నిజమైన నివాళి.





- డా.మెంతబోయిన సైదులు
ఫోన్ : 9010910956


# ఇస్త్రీపెట్టె

ముడత బట్టలకు మేకప్ వేసినట్లు
పాత గోడలకు మంచి గంధం రాసినట్లు
చిరిగిపోయే చొక్కాలకు
ఇస్త్రీ యే గొప్ప సత్కారం
పాడవుతున్న దుస్తులకు
ఇస్త్రీ పెట్టె స్పర్శే పుష్కర స్నానం

ఇస్త్రీ పెట్టె తన తనువుతో దుస్తులను
ఆప్యాయంగా తడిమే కల్పవల్లి
నాగరితలు మారుతున్నా
కనుమరుగు కానీ గల్లీ మల్లి
ఇస్త్రీపెట్టె దోస్తీ నే కదా
శిశిర దుస్తులకు వసంతాన్ని తెచ్చేదీ
పూర్వ వైభవాన్ని ఇచ్చేది

పరధ్యానంగా చేసే ఇస్త్రీ
గోడకు కొట్టిన మేకులాంటిదే
జీవితాంతం చెరగని గుర్తులు
ఇస్త్రీ కై చల్లే నీళ్లు జీవన
కంటక మార్గంలో రాల్చే అశ్రువులు
ఎందరెందరికో పరిమళాలు ఇచ్చే పూలు

జీవితాలకు భరోసా లేని ఆర్థిక యుగంలో
ఎందరికో బతుకు తెరువు చూపించి
శ్రమించే శతకోటి శ్రామికుల దీప్తి
గ్లోబలీకరణ యుగంలో
బతుకు భారమగు స్త్రీలెందరెందరి
చేతిలోనో పాశుపతం
శ్రమను నమ్ముకునే వారికీ
ఇస్త్రీపెట్టెయే దేవుని గల్ల గురిగి



- ఐ.చిదానందం

## గర్భిణీ మహిళలకి ఇబ్బంది కలగకూడదు ఎమ్మెల్యే బత్తుల



**విశ్వంభర,మిర్యాలగూడ:** మిర్యాలగూడ పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిని స్థానిక శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఏరియా హాస్పటల్ సందర్శించిన క్రమంలో రోగులతో మాట్లాడారు. సిబ్బందిని కలిసి ఉదయాన్నే ఓపి ఉండటం వలన పేసెంట్స్ దూరప్రాంతాల నుంచి వచ్చి నిరీక్షణ చేస్తుంటారు. కావున సిబ్బంది సమయ పాలన పాటించాలి 10 గంటల వరకు ప్రతి ఒక్కరూ అందుబాటులో ఉంటూ వారికి త్వరగా వైద్యం అందేలా చూడాలి అని అన్నారు. ముఖ్యంగా హాస్పిటల్స్‌కి వచ్చిన గర్భిణీ మహిళలకు ఎలాంటి ఇబ్బంది రాకుండా చూసుకోవాలన్నారు. వారిని ఎక్కువ సమయం నిరీక్షణ చేయించకూడదు అని సూచించారు. కాంగ్రెస్ నాయకులు మరియు బీఎల్ఆర్ బ్రదర్స్ పాల్గొన్నారు.



నూతనంగా నియమితులైన తెలంగాణ డైరి చైర్మన్ గుత్తా అమిత్ రెడ్డిని సోమవారం జూబ్లిహిల్స్ లోని ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసిన బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నీళ్ల లింగస్వామి గౌడ్ మరియు రంగారెడ్డి జిల్లా డీసీసీ అధికార ప్రతినిధి బొంగు వెంకటేష్ గౌడ్. (విశ్వంభర, హైదరాబాద్)

## టికెట్ లేకుండా ప్రయాణం చేస్తున్న వారిపై ఫోకస్ పెట్టిన రైల్వే శాఖ



**విశ్వంభర, మహబూబాబాద్:** టికెట్ లేకుండా ప్రయాణం చేస్తున్న వారిలో ఎక్కువ పోలీసులే కావడం గమనార్హం. వారిపై ప్రత్యేక దృష్టి పెట్టింది రైల్వే శాఖ. వారి కోసం రైల్వే యాక్ట్ 1989 ప్రకారం రైల్వే శాఖ ఇందుకోసం వచ్చేనెల 1నుంచి 15 వరకు, 25 నుంచి నవంబర్ 10వ తేదీ వరకు తనిఖీలు నిర్వహించి చర్యలకు ఉపక్రమించనుంది. ఎవరైనా టికెట్ తీసుకోకుండా రైళ్ల జనరల్ కోచ్ లలో ప్రయాణిస్తూ పట్టుబడితే భారతీయ రైల్వే నిబంధనల ప్రకారం రూ.250లు జరిమానా విధిస్తారు. అంతే కాకుండా, వారు ప్రయాణించిన దూరానికి ఛార్జీ చెల్లించాల్సి ఉంటుంది. డబ్బు కట్టకపోతే రైల్వే చట్టంలోని సెక్షన్ 137 ప్రకారం చట్టపరమైన చర్యలు తీసుకునేందుకు వారిని రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్‌కి అప్పగిస్తారు. మళ్లీ మళ్లీ ఇదే తప్పు చేసే వారికి తీవ్రమైన జరిమానాలు ఉంటాయి.

## క్రీడలు విద్యార్థులకు ఆత్మస్థైర్యాన్ని పెంపొందిస్తాయి




**విశ్వంభర, మహబూబాబాద్:** హైదరాబాద్‌లో కోట్ల విజయ భాస్కర్ రెడ్డి ఇండోర్ స్టేడియం యూసుఫ్ గూడలో రాష్ట్రస్థాయిలో జరిగిన రాష్ట్ర స్థాయి కరాటే ఛాంపియన్ షిప్ పోటీలలో మహబూబాబాద్ జిల్లా కేంద్రం నుండి శ్లోక కిడ్జ్ ప్లే స్కూల్ విద్యార్థులు అత్యంత ప్రతిభ కనబరిచి 9 గోల్డ్ మెడల్స్ 10 సిల్వర్ మెడల్స్ సాధించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ అండ్ డైరెక్టర్ జాస్తి ఉమాదేవి మాట్లాడుతూ విద్యార్థులలో ఆత్మస్థైర్యాన్ని పెంపొందించడానికి క్రీడలు ఎంతగానో ఉపయోగపడతాయని, అమ్మాయిలు క్లిష్ట పరిస్థితులలో తమను తాము రక్షించుకోవడానికి కరాటే ఎంతగానో ఉపయోగపడుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ రమణ పేర్ల మరియు కరాటే మాస్టర్ మహమ్మద్ అమీర్ పాల్గొన్నారు. గోల్డ్ మెడల్ సాధించిన విద్యార్థిని విద్యార్థులు హస్వికా శ్రీ, ఐశ్వన్, రోహిత్, సాయి హర్షిత్, సాత్విక్, సృహతి రాజ్, మహేష్, హేతాక్ష నాయక్, సుసన్న, సాక్షిత లకు పాఠశాల యాజమాన్యం ఉపాధ్యాయ బృందం ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.

## పోలీసులపై ఎమ్మెల్యే జీఎంఆర్ ఫైర్

### జిల్లాస్థాయి క్రీడోత్సవాలకు భద్రత కల్పించమంటే చేతులెత్తేశారు

### స్థానిక పోలీసులపై డీజీపీకి ఫిర్యాదు చేస్తాం



**విశ్వంభర, సంగారెడ్డి:** పటాన్ చేరు కేంద్రంగా నిర్వహిస్తున్న జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడోత్సవాలకు భద్రత కల్పించాలని పోలీసులను కోరితే.. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ కానిస్టేబుల్‌ను సైతం పంపించలేదని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి స్థానిక పోలీసులపై ఫైర్ అయ్యారు. సోమవారం పటాన్ చేరు పట్టణంలోని మైత్రి మైదానంలో ఏర్పాటు చేసిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా స్థాయి క్రీడోత్సవాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వారం రోజుల క్రితమే సంబంధిత శాఖ అధికారులు భద్రత కల్పించాలని పోలీసులకు రాతపూర్వకంగా దరఖాస్తు చేసుకున్నారని, సోమవారం ఉదయం సైతం భద్రతపై పోలీసులను స్పందించకపోవడం వారి నిర్లక్ష్య ధోరణికి పరాకాష్ట అన్నారు. సంగారెడ్డి జిల్లా పరిధిలోని 26 మండలాల నుండి 500 మంది బాలికలు, 500 మంది బాలురు క్రీడోత్సవాలకు హాజరవుతున్న సమయంలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాల్సిన బాధ్యత పోలీసులపై లేదా అని ప్రశ్నించారు. వారం రోజులపాటు జరగనున్న క్రీడోత్సవాల్లో ఎటువంటి సంఘటన జరిగిన స్థానిక డిఎస్పి, సీఐలదే బాధ్యత అన్నారు. ఈ అంశంపై రాష్ట్ర డిజిపికి ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

## సీఎం రేవంత్ రెడ్డిని కలిసిన వినయ్ కుమార్ రెడ్డి



**విశ్వంభర,హైదరాబాద్:** తన పుట్టినరోజు సందర్భంగా ఆర్మూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ప్రొద్దుటూరి వినయ్ కుమార్ రెడ్డి ఈరోజు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ని జూబ్లీహిల్స్ లోని వారి నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. సీఎం రేవంత్‌రెడ్డి వారికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. నిత్యం ప్రజాసేవలో నిమగ్న మవుతూ ఆర్మూర్ అభివృద్ధికి పాటుపడటంలో భగవంతుడు వారికి సంపూర్ణ ఆయురారోగ్యాలు ప్రసాదించాలని ఆకాంక్షించారు.

## ఎమ్మెల్యే డా. సంజయ్ హైదరాబాదులో హౌస్ అరెస్ట్



**విశ్వంభర, హైదరాబాదు:** గాంధీ ఆసుపత్రిలో జరుగు తున్న మరణాల విషయంలో అధ్యయనం చేయడానికి ఆసు పత్రికి బయల్దేరక ముందే వైద్య కమిటీ సభ్యులని పోలీ సులు హౌజ్ అరెస్ట్ చేశారు. రాష్ట్రంలోని వైద్య ఆరోగ్య సేవల విషయంలో అధ్యయ నం చేసి ప్రభుత్వానికి ఒక నివేదిక ఇచ్చేందుకు భారత రాష్ట్ర సమితి ఏర్పాటు చేసిన ముగ్గురు డాక్టర్లతో కూడిన బృందాన్ని రాష్ట్ర ప్రభుత్వం అడ్డుకున్నది. ఇప్పటికే కమిటీ అధ్యక్షులు మాజీ ఉప ముఖ్యమంత్రి డాక్టర్ తాటికొండ రాజయ్య, ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ ఇండ్ల వద్దకు చేరుకున్న పోలీసులు. ముగ్గురు నాయకులను అరెస్టు చేసేందుకు పోలీసుల ప్రయత్నం చేశారు. ఆసుపత్రుల సందర్శనకు వెళ్లి పరిస్థితులను పరిశీలిస్తామంటే ప్రభుత్వం ఎందుకు భయపడుతుందిని బీఆర్ఎస్ నాయకులు అన్నారు. రాజకీయాల కోసం కాకుండా ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందేలా ప్రభుత్వానికి సూచనలు ఇచ్చేందుకు నిపుణులైన డాక్టర్లుగా తాము గాంధీ ఆసుపత్రికి వెళ్తామంటే ప్రభుత్వం ఎందుకు భయపడుతుందని కమిటీలోని నాయకులు ప్రశ్నించారు. గాంధీ ఆసుపత్రిలో మా పార్టీ ప్రస్తావించిన మాతా శిశు మరణాల విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వం దాచిపెడుతుందా, లేదా తమ పరిపాలన వైఫల్యం బయటకు వస్తుందని భయపడుతుందని నాయకులు అన్నారు. పోలీసులు తమ ఇండ్ల నుంచి వెంటనే వెళ్లిపోవాలని నాయకులు కోరారు. ప్రభుత్వం ఇప్పటికైనా ఇలాంటి పిరికిపంద చర్యలను ఆపాలని బీఆర్ఎస్ నాయకులు హెచ్చరించారు.




జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థులకు ప్లాస్టిక్ నిర్మూలన గురించి మరియు వర్మి కంపోస్టు ఎరువుల తయారీ గురించి అవగాహన కలిగించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ ఉద్యోగస్తులతో పాటు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాఠశాల విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు. (విశ్వంభర, కాటారం)

## ఎంపీ వద్దిరాజుకు సన్మానం



**విశ్వంభర, హైదరాబాద్:** రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్రను హైదరాబాద్ కొంపల్లి లోని వెల్ నెస్ ఆస్పత్రి యాజమాన్యం ఘనంగా సన్మానించింది. ఎంపీ రవిచంద్ర తమ ఆహ్వానం మేరకు సోమవారం విచ్చేసిన సందర్భంగా ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్స్ తాళ్ల సుమన్, వివేకానంద రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ జీఎస్ రెడ్డి, మెడికల్ డైరెక్టర్ జేఎన్ వెంకట్ తదితరులు శాలువాలతో సత్కరించారు. అలాగే, ఎంపీ రవిచంద్ర పెద్దన్న వద్దిరాజు కిషన్, సన్నిహిత మిత్రుడు మరికల్ పోత సుధీర్ కుమార్ లను ఆస్పత్రి యాజమాన్యం శాలువాలు కప్పి సన్మానించింది.

## ఏపీ మాజీ సీఎం జగన్, ఈవో పై కేసు నమోదు చేయాలి



**విశ్వంభర, మహబూబాబాద్:** మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం కలియుగ ప్రత్యక్ష దైవము వెంకటేశ్వరస్వామి భక్తుల, పవిత్ర క్షేత్రం తిరుమల తిరుపతి శ్రీ వెంకటేశ్వర స్వామీ శ్రీవారికి ఎంతో ఇష్టమైన లడ్డును నైవేద్యంగా పెట్టడమే కాదు భక్తులకు ప్రసాదంగా అందిస్తుంటుంది. తిరుమల తిరుపతి దేవస్థానం ట్రస్ట్, శ్రీవారిని దర్శించుకునే భక్తులు తప్పకుండా లడ్డును ప్రసాదము రుచిస్తుంటారు. ఇంటికి పట్టుకెళ్లి బంధువులకు,స్నేహితులకు అందిస్తుంటారు. ఎంతో పవిత్రంగా భావించే లడ్డు ప్రసాదాన్ని అనాదిగా ఎంతో నిష్టతో చేస్తున్నారు. ఈ లడ్డూ తయారీకి ప్రపంచ వ్యాప్తంగా పేటెంట్ హక్కులు కూడా ఉన్నాయి. అలాంటి పరమ పవిత్రత, ప్రత్యేకత కల్గిన తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదంను అప్పటి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వై ఎస్ జగన్ మోహన్ రెడ్డి, టీటీడీ మాజీ చైర్మెన్ వై వి సుబ్బారెడ్డిలు కుట్రపురితముగా తమ అధికారాన్ని అడుపెట్టుకొని టీటీడీ లాంటి పుణ్యక్షేత్రంలో లడ్డూ ప్రసాదంలో స్వచ్ఛమైన నెయ్యికి బదులుగా జంతువుల కొవ్వుతో తయారు చేసిన నూనెని వినియోగించి ఆహార కల్తీకి పాల్పడి భక్తులకు విక్రయించి, కోట్ల మంది భక్తులను మోసం చేసి, భక్తుల యొక్క మనోభావాలను దెబ్బతిసి, మరియు భక్తులఆరోగ్యంతో చెలగాటం ఆడారు. తిరుమల తిరుపతి శ్రీ వెంకటేశ్వర స్వామీ వారి పుణ్య క్షేత్రాన్ని అపవిత్రం చేసి, ప్రపంచ వ్యాప్తంగా ఉన్న స్వామీ వారి ఖ్యాతిని, అపఖ్యాతిపాలు చేయాలనే దురుద్దేశంతో చేసనట్లుగా ఉన్నది. కావున మాజీ ముఖ్యమంత్రి వై ఎస్ జగన్ మోహన్ రెడ్డి, టీటీడీ మాజీ చైర్మెన్ వై వి సుబ్బారెడ్డిపై కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని లాయర్ తుంపిల శ్రీనివాస్, ఓలం శ్రీనివాస్ బృందం కేసముద్రం పోలీస్ స్టేషన్ ఎస్ఐ కి వినతిపత్రం అందజేశారు.

## చాకలి ఐలమ్మ జయంతి వేడుకలు అధికారికంగా జరపాలి



**విశ్వంభర, రామన్నపేట:** యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో రాష్ట్ర రజక వృత్తిదారుల కార్యదర్శి పైళ్ళ ఆశయ్య మాట్లాడుతూ వీరనారి చాకలి ఐలమ్మ 129వ జయంతి వేడుకలు ప్రతి గ్రామ పంచాయతీ కార్యదర్శి అధికారికంగా గ్రామ పంచాయతీలో జయంతి వేడుకలు జరపాలని సూచించారు. అలాగే రాష్ట్రంలోని కోటి ఉమెన్స్, మెడికల్ కాలేజీకి చాకలి ఐలమ్మ పేరుగా నామకరణం చేస్తానని, వారి కుటుంబంలో ఒకరికి మహిళా కమిషన్లో సభ్యురాలిగా అవకాశం ఇస్తానని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించడంపై రాష్ట్ర రజక సంఘాలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రజకుల తరపున వారికి కృతజ్ఞతలు తెలిపారు. అలాగే ప్రభుత్వ పాఠశాలలలో ఐలమ్మ చరిత్రను పాఠ్యంగా చేర్చాలని సూచించారు. యాదాద్రి జిల్లా నాయకులు జిల్లా కన్వీనర్ బొడ్డుపల్లి లింగయ్య, రామన్నపేట మండల రజక సంఘం అధ్యక్షులు కొండూరు శంకర్, బొడ్డుపల్లి వెంకటేష్, నడికోటి రమేష్, రామన్నపేట పట్టణ రజకులు దామెర నరసింహ, పొట్లచెరువు నాగయ్య, పాల్గొన్నారు.

## లాభాలకు ఏఐటీయూసీ వ్యతిరేకం కాదు

### కార్మికుల కొనుగోలు శక్తి పెంచకుండా ఆర్థిక పురోగతి సాధించలేం: మాజీ ఎమ్మెల్సీ ప్రొఫెసర్ నాగేశ్వర్




**విశ్వంభర, మహేశ్వరం:** తుక్కుగూడ ఏఐటీయూసీ కార్మిక సంఘంగా పెట్టుబడిదారీ లాభాలను వ్యతిరేకించడం లేదని, ఆర్థిక అభివృద్ధి సాధించాలి అంటే కార్మికుల కొను గోలు శక్తి పెంచాలని మాజీ ఎమ్మెల్సీ ప్రొఫెసర్ నాగేశ్వర్ ప్రభుత్వాలను కోరారు. ఏఐటీయూసీ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాల నేపథ్యంలో తుక్కుగూడలో దత్తు నాయక్ ఆధ్వర్యంలో 'మన ఆర్థిక లాభాల కోసమా ప్రజల కోసమా' అనే అంశంపై నిర్వహించిన రాష్ట్ర స్థాయి సెమినారులో ప్రొఫెసర్ నాగేశ్వర్ ప్రసంగించారు. భారత ఆర్థిక వ్యవస్థ అభివృద్ధి చెందాలంటే ఉత్పత్తి శక్తులకు ఆదాయాన్ని పెంచాలని అది కాకుండా ఉత్పత్తులను పెంచడం ద్వారా ఆర్థిక అభివృద్ధి సాధించలేము అని ప్రజల దగ్గర కార్మికుల దగ్గర కొనుగోలు శక్తి లేకపోతే పారిశ్రామిక ఉత్పత్తులను ఎవరు కొనుక్కోవాలని ఆయన అన్నారు. ఏఐటీయూసీ ప్రారంభించిన నాటి నుండి నేటి వరకుకార్మికుల హక్కుల కోసం కష్టజీవుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం ఆర్థిక పోరాటాలు వర్గ పోరాటాలు నిర్వహిస్తున్నదని కానీ ప్రభుత్వాలు వాటిని పెడచెవిన పెట్టి పెట్టుబడుదారులకు లాభాలు చేకూర్చే విధంగా తమ యొక్కఆర్థిక విధానాలను మార్చుకుంటున్నా యని ఆయన విమర్శించారు. ప్రభుత్వాల ఆర్థిక విధానాలలో మార్పు రాకుండా దేశ ఆర్థిక వ్యవస్థ ఎంత మాత్రం అభివృద్ధి కాలేదని ఆయన తెలిపారు. పెట్టుబడిదారులకు రాయితీలు ఇచ్చే ప్రభుత్వాలు పేదలకు కష్టజీవులకు కార్మికులకు ఎందుకు రాయితీలు ఇవ్వడం లేదని ఆయన అన్నారు. నరేంద్ర మోడీ తీసుకొచ్చిన కార్మిక కర్షక వ్యతిరేక చట్టాలు భారతదేశ ఆర్థిక విధానానికి కూడా గొడ్డలి పెట్టు లాంటివని ఆయన అన్నారు. కార్పొరేట్లకు మాత్రమే ఉపయోగపడే చట్టాలను తేవడం ద్వారా భారత ఆర్థిక వ్యవస్థ మరింత దిగజారుతుందని ఆయన అన్నారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పానుగంటి పర్వతాలు అధ్యక్షతన ఈ సెమినార్ కార్యక్రమం జరిగింది. ఈ సెమినారులో ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ బాలరాజు, రాష్ట్ర అధ్యక్షుడు ఎండి యూసుఫ్, సిపిఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆందోజు రవీంద్ర చారి, ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాసన ప్రధాన కార్యదర్శి ఎం నరసింహ, గౌరవ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య, ఏఐటీయూసీ రాష్ట్ర నాయకులు రత్నాకర్ రావు, ప్రేమ, పావని, పల్లా దేవేందర్ రెడ్డి, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు కే రామస్వామి, జిల్లా కార్యదర్శులు వనంపల్లి జైపాల్ రెడ్డి, వడ్ల సత్యనారాయణ, కే చంద్ర యాదవ్, సామెడి శేఖర్ రెడ్డి, హరి సింగ్ నాయక్, ఎస్ మల్లేష్, టి నరసింహారెడ్డి, వెంకన్న, ఎం శ్రీను, రంగారెడ్డి, మహేశ్వరం మండల అధ్యక్ష కార్యదర్శులు దేవేందర్ గౌడ్, రాజు పాల్గొన్నారు.

## మున్సిపాలిటీలో హర్షగూడ విలీనం



**విశ్వంభర, మహేశ్వరం:** రాష్ట్ర ప్రభుత్వం ఆదేశానుసారం తుక్కుగూడ మున్సిపాలిటీలో హర్షగూడ గ్రామం విలీనం చేయడం జరిగింది. తెలంగాణ రాష్ట్ర కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ నెంబర్ 720450 /2024 ఎఫ్ వన్ . 09 సెప్టెంబర్ 2024 ప్రకారం హర్షగూడ గ్రామపంచాయతీని తుక్కు గూడ పురపాలక సంఘంలో విలీనం చేయడం జరిగింది. ఇట్టి గ్రామపంచాయతీని తుక్కుగూడ పురపాలక సంఘంలో విలీనం చేసిన హర్షగూడ గ్రామపంచాయతీ యొక్క రికార్డుల ను ఈనెల 23 సోమవారం జాయింట్ డైరెక్టర్ శ్రీధర్ ఆధ్వర్యంలో స్వాధీనం చేసుకున్నారు. తుక్కుగూడ మున్సిపల్ చైర్మన్ మధుమోహన్ మాట్లాడుతూ హర్షగూడ గ్రామంలో ప్రతి ఒక్కరు సమస్యలు ఏమి ఉన్నా నాదృష్టికి తీసుకువచ్చి సమయపాలనలో పనులు చేసుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కాంటేకార్ మధుమోహన్, వైస్ చైర్ పర్సన్ భవాని వెంకటరెడ్డి, ఎంపీడీవో శైలజ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ వెంకట్ రామ్, మేనేజర్ పర్వతాలు, సీనియర్ అసిస్టెంట్ వెంకటేష్, ఆర్ఐ మల్లేష్, కౌన్సిలర్ సభ్యులు కొప్పుల పద్మ శివయ్య, జాపాల భవాని సుధాకర్, హర్షగూడ పంచాయతీ కార్యదర్శి మనిషా రెడ్డి, మాజీ సర్పంచ్ పాండు నాయక్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు గ్రామ యువకులు పాల్గొన్నారు.

## ప్రమాణ స్వీకార మహోత్సవ ఆహ్వానం



విశ్వంభర,కోరుట్ల: జగిత్యాల జిల్లా ఆర్యవైశ్య మహా సంఘం అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నికైన మైలారపులింబాద్రి, మెట్‌పల్లి ఆర్యవైశ్య సంఘ సభ్యులు వెల్లుల్ల రోడ్డులో గల జువ్వడి భవన్లో కోరుట్ల కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ జువ్వాడి నరసింహారావును శాలువాతో సన్మానించి మర్యాద పూర్వకంగా కలిసి ఈనెల 29 సెప్టెంబర్ 24 తేదీన జరగబోవు జగిత్యాల జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు మైలారపు లింబాద్రిప్రమాణ స్వీకార మహోత్సవా ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ కార్యక్రమంలో మెట్‌పల్లి ఆర్యవైశ్య పట్టణ అధ్యక్షుడు మైలారపు రాంబాబు ఆర్యవైశ్య సంఘ సభ్యులు, కిరాణం వర్తకపు సంఘ సభ్యులు పాల్గొన్నారు.

## విశ్వకర్మ పథకానికి దరఖాస్తులు ఆహ్వానం



**విశ్వంభర, భూపాలపల్లి:** విశ్వకర్మ పథకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ సిద్ధార్థ రెడ్డి తెలిపారు. 2023 నుండి 2028 వరకు ఈ పథకానికి దరఖాస్తు చేయడానికి కేంద్ర ప్రభుత్వం అవకాశం కల్పించినట్లు ఆయన తెలిపారు. చేతి వృత్తులపై ఆధారపడి జీవిస్తున్న కుటుంబాలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రారంభించినట్లు జీఎం తెలిపారు. ఆసక్తి ఉన్న చేతి వృత్తులపై ఆధారపడిన కుటుంబాల వ్యక్తులు కామన్ సర్వీస్ కేంద్రాల నుండి ఆన్లైన్ ద్వారా దరఖాస్తులు చేయడానికి అవకాశం ఉన్నట్లు తెలిపారు. ఎంచుకున్న పథకానికి శిక్షణ ఇప్పిస్తామని, తదుపరి 15 వేల రూపాయల విలువ గల టూల్ కిట్లు అందచేస్తామని తెలిపారు. పీఎం విశ్వకర్మ యోజన పథకంలో 18 రకాల వ్యాపారాలకు రుణ సదుపాయం పొందే వీలున్నట్లు ఆయన తెలిపారు. ప్రధానంగా కమ్మరి, వడ్రంగి, స్వర్ణకార, శిల్పి, కుండలు, దుస్తులు, చీపుర్ల తయారు, బార్బర్, చెప్పులు కుట్టేవారు, బొమ్మల తయారీ, చేపల వల, దండలు చేసేవారు, తాపీ పని లాంటి వృత్తులు చేసే వారిని ప్రోత్సహిస్తారన్నారు. లబ్ధిదారు లను ఎంపిక చేసి వృత్తి నైపుణ్య శిక్షణనిస్తారని అన్నారు. అధునాతన వృత్తి పరికరాల కొనుగోలు కోసం రూ.15 వేల ఆర్థిక సాయంతో పాటు మరో రూ. లక్ష వరకు రుణం మంజూరు చేస్తారని జీఎం తెలిపారు.

## మహిళల సంక్షేమమే మా ప్రభుత్వ లక్ష్యం




**విశ్వంభర, కొత్తూర్:** కొత్తూర్ పాత మున్సిపాలిటీ కార్యాలయం ప్రాంగణంలో మహాలక్ష్మి పథకంలో భాగంగా సబ్సిడీ ద్వారా రూ.500 లకు వంట గ్యాస్ పథకానికి సంబంధించిన ప్రొసీడింగ్ కాపీలను ఎమ్మెల్యే వీర్ల పల్లి శంకర్ లబ్దిదారులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# స్వచ్ఛత హి సేవలో స్టీల్ బ్యాంక్



**విశ్వంభర, భూపాలపల్లి:** స్వచత హి సేవ 2024 కార్యక్రమం లో భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం కాళేశ్వరం గ్రామ పంచాయతీ లో ప్లాస్టిక్ నిర్మూలనలో భాగంగా స్టీల్ బ్యాంకు ఏర్పాటు చేయడం జరిగింది. ప్లాస్టిక్ వాడకం వలన వచ్చే అనారోగ్య సమస్యలపై మహిళా సంఘ సభ్యులకు అవగాహనా కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది. గ్రామ కార్యదర్శి సత్యనారాయణ, మహిళలు,ఐకెపి సిబ్బంది మరియు గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.



ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ను విధాన సభలో కలిసిన తెలంగాణ రాష్ట్ర గ్రేటర్ హైద్రాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ గద్వాల విజయలక్ష్మి వారితో పాటు కార్పొరేటర్లు ఊరవెల్లి శ్రవణ్, ధర్పల్లి రాజ్ శేఖర్ రెడ్డి, నవ జీవన్ రెడ్డి, కొప్పుల నర్సింహా రెడ్డి, గంగాధర్ రెడ్డి పలువురు కార్పొరేటర్లు, బీజేపీ నాయకులు, మహిళలు పాల్గొన్నారు. ఉత్తరప్రదేశ్ - లక్నో - విశ్వంభర.

## మద్యం దుకాణాల అక్రమాల పై చర్యలు తీసుకోవాలి



**విశ్వంభర, భూపాలపల్లి:** జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని కాటారం డివిజన్ పరిధిలోని పలు మండలాలలో మద్యం దుకాణాలు సిండికేట్‌గా మారి అధిక ధరలకు మద్యాన్ని విక్రయిస్తూ, బెల్టు షాపులకు మద్యాన్ని సరఫరా చేస్తూ సామాన్య ప్రజలకు తమకు నచ్చిన మద్యం దొరకకుండా చేస్తున్నాయని కాటారం మండలానికి చెందిన సామాజిక కార్యకర్త రామిల్ల రాజబాబు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన సోమవారం భూపాలపల్లి కలెక్టరేట్ లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ కు వినతి పత్రం సమర్పించారు. తాజాగా కాళేశ్వరం లోని ఒక మద్యం దుకాణంలో గ్రామానికి వచ్చిన భక్తులు మద్యాన్ని కొనుగోలు చేయగా బీరు బాటిల్లో ఫంగస్ బయటపడింది. దీనిపై మద్యం దుకాణ యజమానులను ప్రశ్నించగా నిర్లక్ష్యంగా మాట్లాడుతూ ఎవరికి ఫిర్యాదు చేసుకుంటారో చేసుకోండి అని సమాధానమిచ్చారని మద్యం కొనుగోలు దారుడు ఆరోపించారు. దీంతో సదరు భక్తులు ఈ విషయాన్ని విలేకరుల దృష్టికి, అధికారుల దృష్టికి తీసుకువెళ్లగా అధికారులు స్పందించలేదు. దీన్నిబట్టి మద్యం దుకాణ యజమానులు అధికారులకు మామూళ్ళు ముట్ట చెబుతున్నారని ప్రజలు బహిరంగంగా చర్చించుకుంటున్నారు. కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి సత్వరమే మద్యం దుకాణ యజమా నులపై చర్యలు తీసుకోవాలని, బెల్టు షాపులను నియంత్రించాలని ఆయన కోరారు. బెల్ట్ షాపులు పుట్టగొడుగుల్లా విస్తరిస్తున్నప్పటికి ఎక్సైజ్ శాఖ సిబ్బంది పట్టించుకోవట్లేదని ఆయన కలెక్టర్ కు ఫిర్యాదుచేశారు. కలెక్టర్ఎక్సైజ్ అధికారులను విచారణ జరిపి చర్యలు తీసుకోమని ఆదేశించినట్లు తెలిపారు.

## ప్లాస్టిక్ వాడకు.. ప్రాణాలు తీయకు..




**విశ్వంభర, భూపాలపల్లి:** స్వచ్ఛత హి సేవ పక్షోత్సవాలలో భాగంగా జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండల కేంద్రంలో కాటారం గ్రామపంచాయతీ వినూత్న రీతిలో ప్రచారాన్ని నిర్వహిస్తోంది. 17 సెప్టెంబర్ నుంచి అక్టోబర్ రెండు వరకు నిర్వహిస్తున్న స్వచ్ఛత హీ సేవా కార్యక్రమాల తీరు అందరినీ ఆకట్టుకుంటుంది. కాటారం మండల పంచాయతీ అధికారి వీరస్వామి, కాటారం గ్రామపంచాయతీ కార్యదర్శి షఫీర్ ఖాన్‌లు ఇరువురు కలిసి నిత్యం నూతన ఒరవడికి శ్రీకారం చుడుతున్నారు. దీంతో కాటారం గ్రామ పంచాయతీలో స్వచ్ఛత హి సేవా కార్యక్రమాలు ప్రజలను విశేషంగా ఆకర్షిస్తున్నాయి. సోమవారం గారేపల్లి పట్టణ ప్రధాన కూడలిలలో ఒక భూతం అవతారంలో నిలువెల్లా ప్లాస్టిక్ బాటిల్లను మెడలో వేసుకొని పురవీధుల గుండా ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్లాస్టిక్ వాడకు.. ప్రాణాలు తీయకు... అంటూ నినాదాలు చేస్తూ ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ వద్దు, చేతి సంచులు ముద్దు అనే ప్లకార్డులను చేత బూని ప్రచారాన్ని నిర్వహించారు. ఇంతకు ముందు పలు దుకాణాలలో, చికెన్ సెంటర్లలో పాలిథిన్ కవర్ల ను నిషేధం విధిస్తూ నోటీసు బోర్డులను ప్రదర్శన చేశారు. నిబంధనలను అతిక్రమించిన ఎడల రూ. 500ల నుంచి రూ. 2000ల రూపాయల వరకు జరిమానా విధిస్తామని హెచ్చరికలు జారీ చేయడంతో, ఇప్పటికే కాటారం మండలంలో ప్లాస్టిక్ వాడకం తగ్గిపోయింది. కాటారం గ్రామ పంచాయతీ నిర్వహిస్తున్న విస్తృత అవగాహన కార్యక్రమాలు ఇటు ప్రజలను, అటు అధికార యంత్రాంగాన్ని ఆకర్షిస్తున్నాయి. ప్రజల కోసం పాటుపడే అధికారులు ఇలాగే కలకాలం ఉండాలని గారేపల్లి ప్రజలు కోరుకుంటున్నారు.

## గోదాం, సీఎస్సీ సెంటర్‌ని ప్రారంభించిన టేస్కాబ్ చైర్మెన్



**విశ్వంభర, వరంగల్:** గ్రేటర్ వరంగల్ 2 వ డివిజన్ వంగపహాడ్ గ్రామంలోని పాక్స్ ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన గోదాం మరియు సీఎస్సీ (కామన్ సర్వీస్ సెంటర్) నీ వర్ధన్నపేట నియోజక వర్గ ఎంఎల్ఏ కేఆర్ నాగరాజుతో కలిసి తెలంగాణ రాష్ట్ర కో ఆపరేటివ్ అపెక్స్ బ్యాంక్ చైర్మన్ మార్నేనీ రవీందర్ రావు ప్రారంభించారు. పాక్స్ చైర్మన్ మెరుగు రాజేష్ గౌడ్, వైస్ చైర్మన్ రాజ్ కుమార్ గౌడ్, స్థానిక కార్పొరేటర్ రవి నాయక్, డిసిఓ నీరజ, పాక్స్ చైర్మన్లు హరికృష్ణ, గోపాల్ రెడ్డి, రాజేష్ ఖన్నా, డిసిబి డైరెక్టర్ జగన్ మోహన్ రావు, జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షులు వెంకట్రాం రెడ్డి, మాజీ కార్పొరేటర్ బానోత్ కల్పన, మాజీ గ్రంథాలయ సంస్థ డైరెక్టర్ సముద్రాల మధు, మాజీ పాక్స్ చైర్మన్ అనిల్ రెడ్డి, పాక్స్ డైరెక్టర్లు రాజు, రేణుకా, అశోక్ యాదవ్, జైపాల్ రెడ్డి, రవీందర్, కల్యాణి, రాజకోటి, గణేష్, శారదా, జనార్ధన్ నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

# ఇండ్ల పట్టాలు అప్పగించిన వారికి డబుల్ బెడ్ రూమ్‌లు ఇవ్వాలి



### డబల్ బెడ్ రూమ్ ఇండ్ల మంజూరిలో జరిగిన అక్రమాలపై సమగ్ర విచారణ జరపాలి

### దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలి: టీపీజేఏసీ, టీయప్టీయూ డిమాండ్

**విశ్వంభర, మహబూబ్ నగర్:** మహబూబ్ నగర్ అర్బన్ మండల తహసీల్దార్ శ్రీ వి గాన్సీరాం నాయక్‌కి వారి కార్యాలయంలో సోమవారం టీపీజేఏసీ, టీయప్టీయూ ఆధ్వర్యంలో వినతిపత్రం ఇచ్చారు. నాయకులు మాట్లడుతూ 523 సర్వే నంబర్ లో ఇంటి పట్టా సర్టిఫికెట్ కలిగిన వారి నుండి 2018 సంవత్సరంలో మహబూబ్ నగర్ అర్బన్ మండల తహసిల్దార్ కార్యాలయం వారు ఇంటి పట్టా సర్టిఫికెట్లను స్వాధీనం చేసుకున్నారని, విచారణ జరిపి డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు మంజూరు చేస్తామని అధికారులు హామీ ఇచ్చారని తెలిపారు. ప్రభుత్వ అధికారుల హామీని నమ్మి పట్టా దారులు తమ పట్టా సర్టిఫికెట్లను తాసిల్దార్ కార్యాలయంలో సమర్పించారన్నారు. ప్రభుత్వ అధికారులు విచారణ జరిపి 887 మంది డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు పొందుటకు అర్హులుగా నిర్ధారిస్తూ జిల్లా కలెక్టర్ గా రోనాల్డ్ రోస్ ఉన్నప్పుడు జాబితాను రూపొందించారని తెలిపారు. వాస్తవానికి డబుల్ బెడ్ రూములు పొందుటకు వీరు అర్హులు. కానీ వీరికి ఇవ్వకుండా గత ప్రభుత్వం లో తీవ్ర అవినీతికి, అక్రమాలకు పాల్పడ్డారని టీపీజేఏసీ, టీయప్టీయూ నాయకులు ఆరోపించారు. డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల అక్రమాలలో గతంలో అధికారంలో ఉన్న ప్రజాప్రతినిధులు, ప్రతిపక్ష, విపక్షా, వామపక్ష, పార్టీల నాయకులు, మీడియా, ప్రజాసంఘాలలో పలుకుబడి ఉన్న వాళ్లు కుమ్మక్కై సొంత ఆస్తి పంచుకున్నట్టు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను పంచుకున్నారని వారు ఆరోపించారు. తమ ఇంటి పట్టా సర్టిఫికెట్లను ప్రభుత్వానికి స్వాధీనపరిచి డబుల్ బెడ్ రూమ్ వస్తాయని ఆశతో పేదలు ఆరు సంవత్సరాలుగా నిరీక్షిస్తున్నారని వారు తెలిపారు. వీరిలో వితంతువులు, వికలాంగులు, అనారోగ్య పీడితులు, రోజువారి కూలీ చేసుకునే వాళ్ళు ఉన్నారని తెలిపారు. అర్హులైన పేదలకు దక్కాల్సిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు అర్హులు కాని వారికి, కార్లలో తిరిగే ఆస్తిపరులకు, మహబూబ్నగర్ నియోజకవర్గంతో సంబంధం లేని ఇతర ప్రాంతాలకు చెందిన వారికి, వ్యవసాయ భూములు, ఆస్తులు ఉన్నవారికి డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు కేటాయించడం అత్యంత హేయమైనా చర్యగా వారు పేర్కొన్నారు. గత పది ఏళ్ల పాలన ముగిసింది. నూతన ప్రభుత్వం ఏర్పడినందుకు పేదల ఆశలు చిగురించాయని వారు తెలిపారు. గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర కేంద్రంలో నిరంకుశత్వానికి చిహ్నంగా ఉన్న ప్రగతి భవన్ ను ప్రజా భవన్ గా మార్చి వారానికి రెండుసార్లు ప్రజల విన్నపాలు స్వీకరిస్తున్నారని వారు తెలిపారు. అదే స్ఫూర్తితో మహబూబ్ నగర్ లో జరిగిన డబుల్ బెడ్ రూమ్ల అక్రమాలపై కూడా విచారణ జరపాలని కోరారు. పట్టాలు స్వాధీనపరిచిన పేదలందరికీ తక్షణం డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. మహబూబ్నగర్ అర్బన్ మండల పరిధిలో ఉన్న ప్రభుత్వ భూములు అన్నింటిని అక్రమార్కుల నుండి స్వాధీనపరచుకొని పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చి, కనీస సౌకర్యాలు కల్పించి,ఇల్లు కట్టివ్వాలని వారు కోరారు. వినతి పత్రాన్ని తీసుకున్న తాసిల్దార్ డిమాండ్స్ పై విచారణ జరిపి న్యాయం చేస్తానని హామీ ఇచ్చినట్టు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీ ఎఫ్ టీ యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మొహమ్మద్ ఖలీల్, టీపీజేఏసీ జిల్లా కోకన్వీనర్ పి యాదగిరి, జి గట్టన్న, టీ ఎఫ్ టీ యూ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు పివిజయకుమార్, మహబూబ్నగర్ పట్టణ కార్యదర్శి జలాల్ పాషా తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల హామీలను చిత్తశుద్ధితో అమలు చేయాలి

### ఇచ్చిన హామీలను నెరవేర్చకుంటే ఆందోళనలకు పూనుకుంటాం

### సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రాము



**విశ్వంభర, భద్రాద్రి కొత్తగూడెం:** రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను చిత్తశుద్ధితో అమలు చేయాలని, ఆలా నెరవేర్చకుంటే ఆందోళనలకు పూనుకుంటాం అని సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అమర్లపూడి రాము, గోకినపల్లి ప్రభా కర్‌లు ప్రభుత్వాని డిమాండ్ చేశారు. సోమవారం దమ్మపేట మండల కేంద్రంలో స్థానిక మార్కెట్ యార్డులో మండల కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సులో పాల్గొని వారు మాట్లాడుతూ ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని, అర్హులైన అందరికీ కొత్త రేషన్ కార్డులు ఇవ్వాలని, ఇండ్ల స్థలాలు లేని వారికి ఇళ్ల స్థలాలుఇ వ్వాలని, ఇల్లు లేని వారికీ ఇంటి నిర్మాణానికి 10 లక్షల రూపాయలు ఇవ్వాలని, మండలంలో అన్ని గ్రామ పంచాయతీలలో వైద్య క్యాంపులు నిర్వహించాలని, ప్రజలందరికీ నాణ్యమైన వైద్యం అందించాలని, గ్రామాలలో భారీ వర్షాల వల్ల దెబ్బతిన్న అంతర్గత రోడ్లు నిర్మాణం చేపట్టాలని, గ్రామాల్లో బ్లీచింగ్, దోమల మందు పిచికారి చేయాలని, ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం భారీ ప్రదర్శనగా మార్కెట్ యార్డ్ నుండి తాసిల్దార్ కార్యాలయం వరకు నిర్వహించి తహసిల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి, తదనంతరం తహసిల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి ఎన్నో వాగ్దానాలు చేసింది. ఆర్ గ్యారంటీలు, ఇంకా ఎన్నో హామీలు మేనిఫెస్టోలో ఇచ్చింది, రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి 9 నెలలు పూర్తిగా కావస్తుంది. కాంగ్రెస్ ప్రభుత్వం 6 గ్యారంటీలను అమలు చేయాలని, డిమాండ్ల పరిష్కారం కోసం తక్షణమే పూనుకోవాలని అరులైన వారందరికీ ప్రభుత్వం వాగ్దానం ప్రకారం పెన్షన్లు ఇవ్వాలని, గృహజ్యోతి పథకాన్ని అమలు చేయాలని, వ్యవసాయ కార్మికుల ప్రకటించిన రూ.12,000ల జీవన భృతి వెంటనే అమలు చేయాలని, భవన నిర్మాణ కార్మికులకు ఇతర అసంఘటిత కాంట్రాక్టు కార్మికులకు సెలవులతో కూడిన కనీస వేతనాలు అమలు చేయాలని, ఆయన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ డివిజన్, మండల నాయకులు ఊకే అప్పారావు, కుర్సం ముత్యాలరావు, కిసరి వెంకటేష్, బండి ఆదినారాయణ, కాకా వెంకటేష్, తామా రాముడు, కుంజా కాంతారావు, కొండ్రు లక్ష్మి, కాకా రమేష్, ఏఐపీకేఎస్ మండల కార్యదర్శి పండూరి వీరబాబు, వాడే గిరి, సోయం శ్రీను, కారం నాగేష్, సోయం సీతారములు, ఐ.ఎఫ్.టీ.యూ నాయకులు కిసర్ వెంకటేష్, జుజునూరి నాగరాజు, రొక్కోలా అనిల్ కుమార్, పీఓడబ్ల్యూ నాయకులు సున్నం లక్ష్మి, వాడే జయ, వరలక్ష్మి, మహాలక్ష్మి, జుంజునూరి ముక్తేశ్వరి, గంగాధర నాగమణి, సంధ్య, తదితరులు పాల్గొన్నారు.

## టీయూడబ్ల్యూజే (ఐజేయూ) సభ్యత్వ నమోదు



విశ్వంభర, భూపాలపల్లి: జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని కాకతీయ ప్రెస్ క్లబ్ కార్యాలయంలో సోమవారం టీయూడబ్ల్యూజే (ఐజేయూ) సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు క్యాతం సతీష్, ప్రధానకార్యదర్శి సామంతుల శ్యామ్, రాష్ట్ర హెల్త్ కమిటీ సభ్యులు సామల శ్రీనివాస్‌లు కు రిపోర్టర్లు తడుక సుధాకర్, సారేశ్వర్‌లకు సభ్యత్వాన్ని అందజేసి ప్రారంభించారు. సతీష్, శ్యామ్, శ్రీనివాస్‌లు మాట్లాడుతూ టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జర్నలిస్టు మిత్రులు సభ్యత్వం రెన్యూవల్ చేసుకోవాలని, మిగతా జర్నలిస్టులు కూడా సభ్యత్వాన్ని తీసుకుని సహకరించాలని కోరారు. తొందరలోనే అన్నిమండలాల్లో పర్యటిస్తామని, ప్రతిఒక్కరూ సభ్యత్వం తీసుకోవాలని వారు కోరారు.




తెలుగు విశ్వవిద్యాలయానికి పొట్టిశ్రీరాములు పేరునే యదావిధిగా కొనసాగించాలని తెలంగాణ ఆర్యవైశ్య మహాసభ ఆద్వర్యంలో రంగారెడ్డి జిల్లా ఆర్యవైశ్య మహాసభ సభ్యులు సోమవారం తమ నిరసనను వ్యక్తం చేశారు. (విశ్వంభర, రంగారెడ్డి)

### తనిఖీ చేసిన షాద్ నగర్ ఏసీపీ

**విశ్వంభర, ఆమనగల్లు:** షాద్ నగర్ ఏసీపీ ఎన్ సిహెచ్ రంగస్వామి సోమవారం తనిఖీల్లో భాగంగా అమంగల్ పోలీస్ స్టేషన్ కు వచ్చి పోలీస్ స్టేషన్ యొక్క రికార్డ్స్, పోలీస్ స్టేషన్ యొక్క క్రైమ్ రేట్ తెలుసుకొని పోలీస్ స్టేషన్ పరిసరాలను తనిఖీ చేశారు. అందరూ ఉపాధ్యాయుతంగా పనిచేయాలని ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉండాలని శాంతి భద్రత విషయంలో కఠినంగా ఉండాలని అన్నారు. అనంతరం పోలీస్ స్టేషన్ సిబ్బందితో మాట్లాడి వారి బాగోగుల గురించి విచారించారు. డ్యూటీ విషయంలో పలు సూచనలు చేశారని సీఐ ప్రమోద్ కుమార్, ఎస్ఐ వెంకటేష్‌లు తెలిపారు.

## అభివృద్ధిని చూసి ఓర్వలేక బీఆర్ఎస్ నాయకుల ఆరోపణలు



**విశ్వంభర, కడ్తాల్:** రీజినల్ రింగ్ రోడ్, రేడియల్, గ్రీన్ ఫీల్డ్ రోడ్ల విషయంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు రాష్ట్ర ముఖ్యమత్రి రేవంత్ రెడ్డి పై, కల్వకుర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి లపై అనుచిత వ్యాఖ్యలు చేసిన సందర్భంగా కడ్తాల్ మండల కేంద్రంలోని మండల పార్టీ అధ్యక్షుడు బీచ్యా నాయక్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు కేటీఆర్, వేముల ప్రశాంత్ రెడ్డిల దిష్టి బొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి మరియు నాయకులు మాట్లాడుతూ దక్షిణ తెలంగాణలో జరగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ నాయకుల అసత్య ఆరోపణలు చేస్తున్నారన్నారు. ఈ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. రీజినల్ రింగు రోడ్డు దక్షిణ భాగం అలైన్‌మెంట్ తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాలను పరి రక్షించే విధంగా ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోరుకుంటున్నారని అన్నారు. నూతనంగా ఏర్పడనున్న ఫోర్త్ సిటీలో నెలకొల్పనున్న పరిశ్రమలకు, వాటిలో పనిచేసే అధికారులు, సిబ్బందికి వారి కుటుంబాలకు విద్యా, వైద్య, ఇతర వసతులు అందుబాటులో ఉండేలా అలైన్‌మెంట్ ఉండేలా చూస్తున్నారని అన్నారు. న్యూ సిటీ ఫోర్త్ సిటీ కోసం కొన్ని మార్పులు చేర్పులు జరగవచ్చని అంత మాత్రాన ప్రభుత్వంపై బురద చల్లడం సిగ్గుచేటని అన్నారు. భవిష్యత్ తరాలను దృష్టిలో ఉంచుకొని దక్షిణ అలైన్‌మెంట్‌లో మార్పులు జరుగుతున్నాయని అన్నారు. తెలంగాణ సమగ్రాభివృద్ధి ధ్యేయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పనిచేస్తున్నారని కొనియాడారు. భవిష్యత్తులో దక్షిణ తెలంగాణ మరింత అభివృద్ధి అవుతుందని హర్షం వ్యక్తం చేశారు. గత ముఖ్యమంత్రి కేసీఆర్ పదేళ్ల కాలంలో దక్షిణ తెలంగాణను మర్చిపోయి కేవలం సిద్దిపేట, గజ్వేల్, సిరిసిల్ల నియోజక వర్గాలను మాత్రమే అభివృద్ధి చేసి ఇటు దక్షిణ తెలంగాణను వదిలేసారని విమర్శించారు. గతంలో ఏ ముఖ్యమంత్రి దక్షిణ తెలంగాణను అభివృద్ధి చేయని నేపథ్యంలో ప్రస్తుత ప్రజాపాలన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేస్తుండడంతో బీఆర్ఎస్ నాయకులు ఓర్వలేకపోతున్నారని విమర్శించారు. భవిష్యత్తులో ఇలాంటి అనుచిత వాక్యాలు చేస్తే ఊరుకునేది లేదని బీఆర్ఎస్ నాయకులను హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో డైరెక్టర్ వెంకటేష్, సేవాదళ్ అధ్యక్షులు లక్ష్మయ్య, జిల్లా నాయకులు భాస్కర్ రెడ్డి, హన్మా నాయక్, జాంగిర్ అలి, సేవాదళ్ అధ్యక్షులు లక్ష్మయ్య, ఎస్సీ సెల్ అధ్యక్షులు రామకృష్ణ, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

## దారి దోపిడి దొంగలను పట్టుకున్న పోలీసులు




**విశ్వంభర,ఆర్మూరు** వైపు నుండి మొక్కల లోడుతో ఉన్న ఐచర్ వ్యాన్ డ్రైవర్ బండలింగాపూర్ ఎక్స్ రోడ్ వద్ద ఆపుకొని కాలకృత్యాలు చేస్తుండగా ముగ్గురు వ్యక్తులు ఆయన వద్దకు వచ్చి అగ్గిపెట్టి ఉన్నదా అన్న అని మాట కలుపుతూ ఇద్దరు వ్యక్తులు వ్యాన్ డ్రైవర్ గంగాధర్ గౌడ్ ను పట్టుకోగా మరొక వ్యక్తి కొట్టుతూ డ్రైవర్ వద్ద డీజీలు కొరకు ఉంచబడిన 5,000 రూపాయలు మరియు ఒక సెల్ ఫోన్ లాక్కొని బైక్ పై అక్కడ నుండి పారిపోయారు. బాధితుడు ఇబ్రహీంపట్నం పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని పారిపోయిన దొంగల గురించి మెట్ పల్లి సీఐ నిరంజన్ రెడ్డిని మరియు మల్లాపూర్ ఎస్సై అనిల్ కిరణ్ కుమార్ లను మూడు బృందాలుగా ఏర్పాటు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఈ క్రమంలో ఇబ్రహీంపట్నం ఎక్స్ రోడ్ వద్ద ఒక బైక్ పై ముగ్గురు వ్యక్తులు ఉండగా గమనించిన పోలీసులు వారిని పట్టుకుని విచారించగా డ్రైవర్ను కొట్టి డబ్బులు మరియు ఫోను తీసుకొని పారిపోయామని అంగీకరించారు. దుండగులు మేడిపల్లికి చెందిన ఏనుగు వంశీ, మఠం వాడ మెట్పల్లికి చెందిన బైండ్ల వేణు, బండాలింగాపూర్ గ్రామానికి చెందిన కైరా వెంకటేష్ లని తెలిపారు. వారి వద్ద ఉన్న సెల్ ఫోన్లను డబ్బులను మరియు బైకు స్వాధీనం చేసుకొని తనిఖీ చేయగా పల్సర్ బైక్ కవర్లో 200 గ్రాములు గంజాయి ఉన్న ప్యాకెట్ లభించిందని పోలీసులు తెలిపారు. పంచుల సమక్షంలో బైకు డబ్బులను సెల్ఫోన్ మరియు గంజాయి తీసుకొని నేరస్తులను రిమాండ్ కు తరలించారు. కేవలం 48 గంటల్లోనే నేరస్తులను పట్టుకున్న సీఐ నిరంజన్ రెడ్డి, ఎస్ఐ అనిల్, కిరణ్ కుమార్ లను డి.ఎస్.పి ఉమామహేశ్వరరావు అభినందించారు. ఈ సందర్భంగా డీఎస్పీ ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ గంజాయి అమ్మిన తాగిన దోపిడీకి పాల్పడిన చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు.

## క్రీడల శాఖ అధికారిగా జైపాల్ నాయక్



**విశ్వంభర,భూపాలపల్లి:** జయశంకర్ భూపాలపల్లి జిల్లా యువజన మరియు క్రీడల శాఖ అధికారిగా రేగొండ మండలం రంగయ్య పల్లె జిల్లా పరిషత్ హై స్కూల్ కు చెందిన లావుడ్య జైపాల్ నాయక్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన జిల్లా కలెక్టర్‌ను కలిసి ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు. జిల్లా ఎస్ జి ఎఫ్ సెక్రటరీ రమేష్, సాంబమూర్తి, ప్రసాద్, ఇతర ఫిజికల్ డైరెక్టర్‌లు పాల్గొన్నారు.

# హైద్రాబాద్‌లో నేషనల్ బడ్డింగ్ ప్రొఫెషనల్ చెఫ్ కాంపిటీషన్స్ 2024



**విశ్వంభర, హైద్రాబాద్ :** అంబర్ పేట్ లోని డిడి కాలనీ లోని సెంట్రల్ గవర్నమెంట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్ –హైదరాబాద్ ప్రతిష్టాత్మకమైన నేషనల్ బడ్డింగ్ ప్రొఫెషనల్ , చెఫ్ కాంపిటీషన్స్, 2024ను అట్టహాసంగా ప్రారంభించారు. ప్రపంచ పర్యాటక దినోత్స వం సందర్భంగా, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్ (ఐహెచ్ ఎం) హైదరాబాద్, ఈ సంవత్సరంలో అత్యంత ఉత్తేజకరమైన ఈవెంట్‌లలో ఒకటి- IIIవ జాతీయ బడ్డింగ్ ప్రొఫెషనల్ పోటీ మరియు IIవ జాతీయ బడ్డింగ్ చెఫ్ పోటీని 23వ తేదీ నుండి 25 సెప్టెంబర్ 2024 వరకు కొనసాగుతుందని అన్నారు. ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఈ ఈవెంట్ భారతదేశం నలుమూలల నుండి 21 హాస్పిటాలిటీ మరియు క్యులినరీ ఇన్‌స్టిట్యూట్‌లను ఒకచోట చేర్చుతుంది అని తెలిపారు. తరువాతి తరం హాస్పిటాలిటీ నిపుణులు, చెఫ్‌ల సృజనాత్మకత, నైపుణ్యం ఆవిష్కరణలను హైలైట్ చేస్తూ, యువ ప్రతిభకు శక్తివంతమైన ప్రదర్శనకు పోటీలు ఉత్తేజాన్ని ఇస్తున్నాయి అని అన్నారు. దేశవ్యాప్తంగా ఉన్న విద్యార్థుల భాగస్వామ్యంతో, ఈ ప్లాట్‌ఫామ్ పై ట్రావెల్ , టూరిజం పరిశ్రమల యొక్క భవిష్యత్తు తరాలను చూసేందుకు ఒక ప్రత్యేకమైన అవకాశాన్ని అందిస్తుంది అని అన్నారు. ఎందుకంటే వారు అనుభవజ్ఞుల బృందంచే తయారు చేయబడతారని తెలిపారు. .ఈ మూడు–రోజుల ఈవెంట్ కేవలం పోటీ మాత్రమే కాదని , ప్రయాణ , పర్యాటక రంగంలో పాక నైపుణ్యాలు, సుస్థిరత , వృత్తి నైపుణ్యాల సరిహద్దులను ముందుకు తెస్తూ సృజనాత్మకత , శ్రేష్ఠతకు సంబంధించిన వేడుక అని పేర్కొన్నారు. పాక నైపుణ్యులు తీర్పులు ఇవ్వడం , మార్గదర్శకత్వం చేయడంతో పాటు అమూల్యమైన అనుభవాన్ని పొందడంలో ముందుంటారని తెలిపారు. ఆహారం, ఆవిష్కరణలు లేదా ఆతిథ్యం పట్ల మక్కువ కలిగి ఉన్నా, పరిశ్రమ భవిష్యత్తును రూపొందించే ప్రతిభను మరియు ఆలోచనలను చూసేందుకు ఈ ఈవెంట్ ఒక వదులుకోలేని అవకాశం అని చెప్పారు. ఈ కార్యక్రమంలో వివిధ రాష్ట్రాల కు చెందిన హోటల్ మేనేజ్మెంట్ కళాశాల నిర్వాహకులు , విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎయిడ్స్ కంట్రోల్ ఎంప్లాయిస్ యూనియన్ ఇన్చార్జిగా గాదే రమేష్



**విశ్వంభర, భూపాలపల్లి:** తెలంగాణ స్టేట్ ఎయిడ్స్ కంట్రోల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ యూనియన్ కాళేశ్వరం జోనల్ ఇన్చార్జిగా గాదె రమేష్ నియమితులయ్యారు. ఈ మేరకు జాయింట్ యాక్షన్ కమిటీ సమన్వయంతో తెలంగాణ స్టేట్ ఎయిడ్స్ కంట్రోల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులుగా టీ.శివ ప్రసాద్, కార్యనిర్వాహక అధ్యక్షులుగా ఏ. రంజిత్ కుమార్, ప్రధాన కార్యదర్శి గా సీ శ్రీదేవి రెడ్డి, కోశాధికారిగా ఈ రవి ఎన్నికయ్యారు. కాళేశ్వరం జోనల్ పరిధిలో జయశంకర్ భూపాలపల్లి జిల్లా, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా, మంచిర్యాల జిల్లా, పెద్దపెల్లి జిల్లా, ములుగు జిల్లాలు ఉన్నాయి. జిల్లాల పరిధిలో యూనియన్ కార్యకలాపాలను విస్తృతంగా నిర్వహించుటకు జోనల్ ఇన్చార్జిలను నియమించారు. 2005 నుంచి జాతీయ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న సమీకృత సలహా పరీక్ష కేంద్రం (ఐ సి టి సి) లో కౌన్సిలర్ గా గాదె రమేష్ ప్రస్తుత జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ సామాజిక ఆరోగ్య కేంద్రంలో విధులు నిర్వహిస్తున్నారు. కాళేశ్వరం జోనల్ ఇన్చార్జిగా నియమితులైన సందర్భంగా గాదె రమేష్ మాట్లాడుతూ తనపై ఉంచిన నమ్మకంతో తాను యూనియన్ పటిష్టతకు, సభ్యుల సంక్షేమానికై పాటుపడతానని అన్నారు.

## టోల్ ఫ్రీ నెంబర్ 1097ను సద్వినియోగం చేసుకోండి



**విశ్వంభర, భూపాలపల్లి:** ఆరోగ్య సమస్యల పరిష్కారానికి టోల్ ఫ్రీ నెంబర్ 1097ను సద్వినియోగం చేసుకోవాలని భూపాలపల్లి జిల్లా కాటారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ మంతెన మౌనిక, మహాదేవపూర్ ఐసిటిసి కౌన్సిలర్ గాదె రమేష్ పిలుపునిచ్చారు. సోమవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని మద్దులపల్లి, కాటారం, గంట గూడెం గ్రామాల్లో ఉచిత వైద్య ఆరోగ్య శిబిరాలతో పాటు హెచ్ఐవి, ఎయిడ్స్ పట్ల అవగాహన కార్యక్రమాలను కాటారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ మంతెన మౌనిక ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రజలకు రోగాల పట్ల అవగాహన పెంచడంతోపాటు వారికి కావలసిన వైద్య సదుపాయాలను చికిత్సలను అందిస్తున్నామని కాటారం ప్రాథమిక వైద్యాధికారిణి డాక్టర్ మంతెన మౌనిక అన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఆరోగ్య శిబిరాలలో సుమారు 250 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, మందు గుళికలు అందించారు. డ్రై డే కార్యక్రమాలను నిర్వహించారు. ఇంటి పరిసరాలలో నీరు నిల్వ ఉండకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. చిన్న పిల్లలకు, సీజనల్ వ్యాధులకు సంబంధించిన విషయాలను సోదాహరణంగా వివరించారు. గర్భిణీలకు, బాలింతలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. హెచ్ఐవి ఎయిడ్స్ వ్యాధి లక్షణాలు వ్యాప్తి నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలను ఐసిటిసి కౌన్సిలర్ గాదే రమేష్ వివరించారు. ఈ శిబిరాలలో ఎం ఎల్ హెచ్ పి డాక్టర్లు ప్రియాంక, గీత, సిహెచ్ఓ నిర్మల, పీహెచ్ఎన్ అన్నపూర్ణ, ఏఎన్ఎంలు నాగరాణి, సునీత, శ్యామల, హెల్త్ అసిస్టెంట్ లు కాపర్తి రాజు, సమ్మయ్య, ఆశా కార్యకర్తలు పార్వతి, కవిత, సునీత, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

## పారిశుద్ధ్య కార్మికురాలికి అండగా నిలిచిన ఎంపీ కావ్య

### వరంగల్ ప్రజారోగ్య విభాగం అధికారులపై ఆగ్రహం



**విశ్వంభర, వరంగల్:** రోడ్డు ప్రమాదంలో రెండు కాళ్లు విరిగిపోయి ఎంజీఎం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పారిశుద్ధ్య కార్మికురాలిని పరామర్శించిన ఎంపి డా. కడియం కావ్య. పూర్తిగా కోలుకునే వరకు మెరుగైన వైద్య అందించాలంటూ ఎంజీఎం సూపరిడెంట్‌ను ఎంపీ ఆదేశించారు. రామంచ సమ్మక్కకి భరోసా కల్పించి ఎంపి ఆర్థిక సాయం అందజేశారు. ఇటీవల విధుల్లో భాగంగా రోడ్లు శుభ్రం చేస్తున్న బల్దియా పారిశుద్ధ్య కార్మికురాలు రామంచ సమ్మక్క హన్మకొండ ఎన్జీవోస్ కాలనీలో కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తన రెండు కాళ్లు విరిగిపోయాయి. రామంచ సమ్మక్క ప్రస్తుత దీనస్థితిని తెలుసుకున్న వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య నేడు ఎంజీఎం ఆస్పత్రికి చేరుకొని ఆమెను పరామర్శించారు. ప్రస్తుతం ఆరోగ్య పరిస్థితిని, అందించిన చికిత్స వివరాలను వైద్యులను అడిగి తెలుసుకున్నారు. స్వయంగా వరంగల్ ఎంపీ వైద్యురాలు కావడంతో ఎంపీ కడియం కావ్య పేషెంట్ రిపోర్టులను పరిశీలించారు. తను పూర్తిగా కోలకునే వరకు మెరుగైన వైద్య చికిత్స అందించాలంటూ ఆసుపత్రి అధికారులను ఆదేశించారు. వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య ఆసుపత్రికి చేరుకుంటున్న సమాచారం తెలుసుకునిఅక్కడికి చేరుకున్న ప్రజా ఆరోగ్య విభాగ అధికారులపై ఎంపీ ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండు వారాలు గడుస్తున్నా పేషెంట్ కనీస పరిస్థితిపైని పట్టించుకోకుండా ఉన్న సిబ్బంది పై మండిపడ్డారు. చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డా. రాజేష్ తో మాట్లాడిన ఎంపీ డా.కడియం బాధితురాలిక అందాల్సిన బెనిఫిట్స్ ను సకాలంలో అందేలా చూడాలని ఆదేశించారు. అనంతరం పలువురి పేషెంట్లను ఎంపీ పరామర్శించారు. వైద్య అధికారులతో సమీక్ష నిర్వహించిన ఎంపీ గతంలో నిర్వహించిన ఫార్మసీ తనిఖీల తరువాత ఎలాంటి మార్పులు చేశారనే విషయం పై ఆరా తీశారు. ప్రస్తుతం మందులు అందుబాటులో ఉన్నాయా లేదా విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రిలో ఇతర మౌలిక సదుపాయాల గురించి అడిగి తెలుసుకున్న ఎంపీ డాక్టర్ కడియం కావ్య అవసమైన వాటి మంజూరుకు కృషి చేస్తానని స్పష్టం చేశారు.

## విశ్వకర్మ పథకాన్ని అమలు చేయాలి

### ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షులు పైండ్ల శ్రీనివాస్



**విశ్వంభర,మహబూబాబాద్:** చేతి కులవృత్తుల జీవనోపాధి కోసం ప్రవేశపెట్టిన విశ్వకర్మ యోజన పథకాన్ని తక్షణమే అమలుపరచాలని కోరుతూ నేడు మహబూబాబాద్ జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో ఓబీసీ జిల్లా అధ్యక్షులు పైండ్ల శ్రీనివాస్ వినపత్రం సమర్పించారు. పైండ్ల శ్రీనివాస్ మాట్లాడుతూ బీసీ కులాల చేతివృత్తుల అభివృద్ధికై మన భారత ప్రధాని నరేంద్ర మోడీ ప్రవేశపెట్టిన విశ్వకర్మ యోజన పథకాన్ని మహబూబాబాద్ జిల్లాలో తక్షణమే అమలు చేయాలని ఎంఎస్ఎంఈ నిధులను పూర్తిగా చేతి కుల వృత్తుదారులకు ఖర్చు చేసే విధంగా చొరవ చూపాలని కోరారు. ఇట్టి కార్యక్రమంలో విశ్వకర్మ యోజన మహబూబాబాద్ జిల్లా కన్వీనర్ అక్కడ సంపత్, పార్లమెంట్ కో కన్వీనర్ సింగారపు సతీష్, పట్టణ ఉపాధ్యక్షులు చుక్కల నరేష్, తదితరులు పాల్గొన్నారు.

## సిబ్బంది జీతాలు, నిధుల అవకతవకలపై కలెక్టర్లకు ఫిర్యాదు



**విశ్వంభర, త్రిపురారం:** నల్గొండ జిల్లా పెద్దదేవులపల్లి గ్రామపంచాయతీ సిబ్బంది జీతాలు, 15 ఆర్థిక సంఘం నిధుల అవకతవకలపై గ్రామ యువకులు, గ్రామపంచాయతీ సిబ్బంది కలెక్టర్లకు ఫిర్యాదు చేశారు. సోమవారం నల్గొండ జిల్లా కలెక్టరేట్లో జరిగిన గ్రీవెన్స్ డే కార్యక్రమానికి పెద్దదేవులపల్లి గ్రామం నుండి గ్రామపంచాయతీ సిబ్బంది, గ్రామ యువకులు కలిసి పాల్గొన్నారు. ఆగస్టు నెలలో15వ ఆర్థిక సంఘం నుండి నిధులు మా గ్రామ పంచాయతీకి నాలుగు లక్షల 50 వేల రూపాయలు జమ అయ్యాయి. గ్రామ పంచాయతీ కార్యదర్శి, స్పెషల్ ఆఫీసర్ సిబ్బందికి మూడు నెలల నుండి జీతాలు ఇవ్వడంలేదన్నారు. ఇదే విషయం ఈరోజు గ్రీవెన్స్ డే లోఅదనపు కలెక్టర్ టి పూర్ణచంద్ర (స్థానిక సంస్థలు)ని కలిసి క్రింది విషయం నివేదించడం జరిగిందని తెలిపారు. సిబ్బందికీ మూడు నెలల నుండి జీతాలు ఇవ్వడం లేదని, 15వ ఆర్థిక సంఘం నుండి విడుదల చేసిన 4 లక్షల 50 వేల రూపాయలు నిధుల దుర్వినియోగం గురించీ కలెక్టర్ కి వినతి పత్రం ఇచ్చమని తెలిపారు. ఈ రెండు అంశాల మీద కలెక్టర్ మాట్లాడుతూ సిబ్బందికి జీతాలు స్పెషల్ గ్రాండ్ నుండి విడుదల చేపిస్తానని చెప్పడం జరిగినది. అలాగే 15వ ఆర్థిక సంఘం నిధులు ఎలా డ్రా చేశారు, ఏమి ఏమి వస్తువులు కొన్నారు, దానిమీద జిల్లా పంచాయతీ అధికారికి ఎంక్వయిరీ చేయమని ఆదేశాలు జారీ చేశారు. కలెక్టరు కూడా ఏదో ఒక రోజు పెద్దదేవులపల్లి గ్రామపంచాయతీకి వచ్చి తనిఖీలు చెస్తామన్నారని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో పెద్దదేవులపల్లి గ్రామపంచాయతీ సిబ్బంది సురేష్ శ్రీకాంత్, నాగరాజు, ఆండాలు సొమ్ము వెంకన్న, గ్రామ యువకులు ఇరిగి క్రాంతికుమార్, ఠాకూర్ నరసింహన్ సింగ్, రమేష్ సింగ్, యనక బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## బీసీలకి అన్ని రంగాలలో అన్యాయమే

### రిజర్వేషన్స్ ధ్యేయంగా ముందుకు సాగుదాం: ఎంపీ వద్దిరాజు రవిచంద్ర



**విశ్వంభర, సికింద్రాబాద్:** దేశజనాభాలో సగానికి భాగానికిపైగా ఉన్న మనకు అన్ని రంగాలలో తీవ్ర అన్యాయం జరుగుతున్నదని బీసీ ప్రముఖులు ఆవేదన వ్యక్తంచేశారు. విద్యా, ఉద్యోగ, రాజకీయ రంగాలలో మన న్యాయమైన వాటా, హక్కుల సాధనకు మరింత ఐకమత్యంతో ముందుకు సాగాల్సిన అవసరం ఉందన్నారు. బీసీల సంక్షే మం, సముద్ధరణ, ఆయా రంగాలలో రిజర్వేషన్స్ అమలు తదితర అంశాలపై అధ్యయనానికి పలు రాష్ట్రాలలో పర్య టించాలని నిర్ణయించిన నేపథ్యంలో బీఆర్ఎస్ అధ్యక్షులు కే.చంద్రశేఖర రావు మార్గనిర్దేశనం, వర్కింగ్ ప్రెసిడెం ట్ కే.టీ. రామారావు సూచన మేరకు ఆ పార్టీకి చెందిన అందుబాటులో ఉన్న బీసీ నాయకులు సమావేశమయ్యారు. సికింద్రాబాద్ ప్యారడైజ్ లోని జాతీయ బీసీ కమిషన్ మాజీ ఛైర్మన్ జస్టిస్ ఈశ్వరయ్య నివాసంలో సోమవారం మధ్యాహ్నం జరిగిన సమావేశంలో శాసనమండలిలో బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్ వద్దిరాజు రవిచంద్ర, బీఆర్ఎస్ పక్ష నాయకులు సిరికొండ మధుసూదనాచారి, మాజీ మంత్రి వీ.శ్రీనివాస్ గౌడ్, ఎమ్మెల్సీ ఎల్.రమణ తదితర ప్రముఖులు భేటీ అయ్యారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం కేసీఆర్ నాయకత్వాన జరిగిన మహోద్యమంలో బీసీలు అగ్రభాగాన నిలిచిన విష యాలను గుర్తు చేసుకున్నారు. న్యాయమైన, ధర్మమైన మన హక్కుల్ని, వాటాను దక్కించుకునేందుకు తెలంగాణ ఉద్యమం స్ఫూర్తితో "మేమెంతో మాకంతా","మా వాటా మాకే" అనే నినాదాలతో పోరాటాన్ని మరింత ముందుకు తీసుకుపోవాలని నిర్ణయించారు. రాష్ట్ర మంత్రిమండలిలో కేవలం ఇద్దరికి మాత్రమే అవకాశమివ్వడం, స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న సమయాన మన హక్కుల కోసం పోరుబాట పట్టడం ఇది సరైన సమయమని అభిప్రాయపడ్డారు. చట్టసభలలో 33%, స్థానిక సంస్థల ఎన్నికలలో 42% రిజర్వేషన్స్ అమలు చేయాల్సిందిగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను వారు డిమాండ్ చేశారు. ఈ సమావేశానికి బీఆర్ఎస్ నాయకులు గంగాధర్ గౌడ్, బూడిద భిక్షమయ్య గౌడ్, డాక్టర్ చెరుకు సుధాకర్, నోముల భగత్, చిరుమళ్ల రాకేష్, ఆంజనేయులు గౌడ్, మరికల్ పోత సుధీర్ కుమార్, ఉపేంద్రాచారి, కిశోర్ గౌడ్, శుభప్రద పటేల్, బాలరాజ్ యాదవ్, ఆలకుంట హరి తదితరులు హాజరయ్యారు. అనంతరం ప్యారడైజ్ హోటల్ లో ఎంపీ రవిచంద్ర బీసీ ప్రముఖులకు ఆత్మీయ విందునిచ్చారు.

## ప్రజావాణి ద్వారా దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి: జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్



**విశ్వంభర, వికారాబాద్:** వికారాబాద్ జిల్లాలో ప్రజావాణి ద్వార వచ్చే దరకాస్తులను పెండింగ్ ఉంచకుండా ఎప్పటికప్పుడు సత్వరమే పరిష్కారించడానికి అధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ తెలిపారు.సోమవారం కలెక్టరేట్ కార్యాలయం లోని సమావేశము హాలు నందు నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమం సందర్భంగా అదనపు కలెక్టర్ సుధీర్, ఆర్డిఓ వాసు చంద్ర లతో కలిసి ప్రజల నుండి 179 ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి సమస్యల పరిష్కార దిశగా అధికారులు పనిచేయాలన్నారు. రైతు రుణమాఫీ, భూమి సమస్యలు అధికంగా వస్తున్న క్రమంలో మండల స్థాయిలో పరిష్కరించే దిశగా అధికారులు కృషి చేయాలని తెలిపారు. రుణ మాఫీపై వస్తున్న ఫిర్యాదుల పట్ల వ్యవసాయ అధికారులు పరిశీలించి రుణ మాఫీ కాక పోవడానికి గల కారణాలను తెలుసుకొని సమస్య పరిష్కార దిశగా పని చేయాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ సుదీర్, ఆర్ డి ఓ వాసుచంద్ర, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## గ్రీవెన్స్ దరఖాస్తులను పరిష్కరించాలి



**విశ్వంభర, మహబూబాబాద్:** అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టోప్పో గ్రీవెన్స్‌లో వచ్చిన ప్రతి దరఖాస్తును పరిశీలించి అధికారులు త్వరగా వాటి సమస్యను పరిష్కరించాలని అన్నారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ లోని ప్రధాన సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పో ప్రజల నుండి దరఖాస్తులు స్వీకరించారు. అదనపు కలెక్టర్ ప్రజావాణిలో రెవెన్యూ 32, వ్యవసాయ శాఖ 09, మహబూబాబాద్ మునిసిపాలిటీ 11, గ్రామీనాభివృద్ధి 04లతో పాటు వివిధ శాఖలకు సంబంధించి వచ్చిన మొత్తం 133 దరఖాస్తులను ఆయా శాఖ అధికారులు పరిష్కారం దిశగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ ప్రజావాణీ కార్యక్రమంలో ముఖ్య ప్రణాళిక అధికారి సుబ్బారావు, అడిషనల్ డి.ఆర్.డి.ఎ జయశ్రీ, సూపరిండెంట్ మదన్ మోహన్, మండల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మహిళా హక్కులకు భంగం కలగకుండా చూడాలి



**విశ్వంభర, భూపాలపల్లి:** స్త్రీలను హింసించకుండా, స్త్రీలకు సమాజంలో స్వేచ్ఛనిస్తూ వారి హక్కులకు భంగం కలగకుండా ప్రతి ఒక్కరు చూసుకుంటూ ఆనందంగా కుటుంబంతో జీవించాలని సఖీ సెంటర్ సోషల్ కౌన్సిలర్ పోత మాధవి అన్నారు. జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, డిస్టిక్ వెల్ఫేర్ ఆఫీసర్ చిన్నయ్య ఆదేశాల మేరకు భూపాలపల్లి మండలం రూరల్ మండల సమాఖ్య కార్యక్రమంలో పాల్గొని సమాజంలో మహిళలు, బాలికలు ఎదుర్కొంటున్న సమస్యలు, వారిపై జరిగే వేదింపులపై మాట్లాడటం జరిగిందని సఖి సెంటర్ సోషల్ కౌన్సిలర్ మాధవి తెలిపారు. స్త్రీలపై జరిగే హింసను నివారించడం కోసం, స్త్రీలపై హింస జరిగినప్పుడు ప్రతి ఒక్కరు స్పందించి, హింసించబడిన మహిళలకు చేయూతనిస్తూ మానవత్వం చాటుకోవాలని, సమాజంలోని పురుషులు స్త్రీలను హింసించకుండా చూసుకొని వారితో కలిసి సంతోషంగా జీవిస్తూ, వారి స్వేచ్ఛకు, హక్కులకు భంగం కలగకుండా కాపాడుకోంటూ, స్త్రీ లను అన్ని రంగాల్లో రానించే విదంగా కుటుంబ సభ్యులు సపోర్ట్ చేయాలని కోరారు. ఎక్కడైనా స్త్రీ హింసకు గురైతే వెంటనే 181 టోల్ ఫ్రీ నెంబర్ కానీ 100 కానీ ఫోన్ చేయాలని, విద్యార్థినులు అయితే 1098 కి కాల్ చేయాలని కోరారు. బాధిత మహిళకి సఖి కేంద్రం ఎల్లవేళలా ఒక తల్లిలా అందుబాటులో ఉంటు హక్కున చేర్చుకుని బాదిత మహిళకు సపోర్ట్ చేస్తూ ఐదు రకాల సేవలు అందిస్తు కౌన్సిలింగ్, న్యాయ సహాయం, వైద్య సహాయం, పోలీస్ సహాయం, తాత్కాలిక వసతితో పాటు బాధిత మహిళకి సఖీ కిట్టుని ఉచితంగా అందిస్తుందని తెలిపారు. ఆపదలో ఉన్న మహిళ వెంటనే సఖీ టోల్ ఫ్రీ నెంబర్ 8500009433 కి కాల్ చేస్తే మా సిబ్బంది వెంటనే స్పందిస్తారని, మహిళా సఖీ సెంటర్ కి రాలేని పరిస్థితిలో మా టీం వెళ్లి మహిళని రక్షించి సఖీ సెంటర్ కు తీసుకువచ్చి అమే సమస్య పరిష్కరిస్తుందని తెలిపారు. అడిషనల్ డీ.ఆర్.డీ.ఓ గోవింద్, డీపీఎం సోమయ్య, ఏపీఎం శ్రీనివాస్ మండల సమైఖ్య సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజల ఫిర్యాదుల పట్ల తక్షణమే స్పందించాలి



**విశ్వంభర, భూపాలపల్లి:** ప్రజల ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలని, నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే పేర్కొన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజాదివాస్ కార్యక్రమంలో ఎస్పీ 21 మంది బాధితుల నుంచి పిర్యాదులు స్వీకరించారు. ఎస్పీ బాధితుల సమస్యలపై చట్టపరంగా విచారణ జరిపి వేగవంతంగా పరిష్కరించాలని సంబధిత సీ ఐ, ఎస్ఐలను ఆదేశించారు.

# ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారంపై ప్రతివారం సమీక్ష నిర్వహిస్తాం



విశ్వంభర, భూపాలపల్లి: ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులు పరిష్కార స్వభావంపై ప్రతి వారం సమీక్ష నిర్వహిస్తామని భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. సోమవారం ఐడిఓసి కార్యాలయపు సమావేశపు హాలులో ప్రజావాణి నిర్వహించి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి దరఖాస్తులు స్వీకరించి పరిష్కరించేందుకు ఆయా శాఖల అధికారులకు ఎండార్స్మెంట్ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సమస్యలతో వచ్చిన ప్రజల పట్ల జవాబుదారీగా ఉండాలని అన్నారు. ప్రజావాణి, హైదరాబాద్ ప్రజాభవన్ నుండి వచ్చిన 49 దరఖాస్తులపై ప్రతి సోమవారం అన్ని శాఖల అధికారులతో సమీక్ష నిర్వహిస్తామని స్పష్టం చేశారు. మండల ప్రత్యేక అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి అభివృద్ధి కార్యక్రమాలు పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. మండల పర్యటనలో గుర్తించిన సమస్యలు పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రజావాణి దరఖాస్తులు పరిష్కారానికి అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. మన పరిధిలో పరిష్కరించడానికి అవకాశం ఉన్న దరఖాస్తుల పరిష్కారానికి కాలయాపన చేయొద్దని పేర్కొన్నారు. జిల్లా నలుమూల నుండి ధరణి సమస్యలు, రుణమాఫీ సమస్యలతో పాటు ఇతర సమస్యలపై 70 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. కాటారం మండలానికి చెందిన రామిళ్ళ రాజబాబు అనే యువకుడు బ్రాందీ షాపులలో కొన్ని రకాల బీర్లు, బ్రాందీ క్వార్టర్లు లభించకుండా బెల్టు షాపులను తరలిస్తూ అధిక ధరలకు విక్రయిస్తున్నారని పిర్యాదు చేయగా రెండు రోజులలో విచారణ చేపట్టి నివేదిక ఇవ్వాలని ఎక్సైజ్ సూపరిన్ టెండెంట్ ను ఆదేశించారు. మహాముత్తారం మండలం, స్థంభంపల్లి గ్రామానికి చెందిన జాడి రాజయ్య అనే దివ్యాంగుడు రెండు కాళ్ళు పోలియో వ్యాధి వల్ల పనిచేయడం లేదని తనకు చార్జింగ్ త్రి చక్ర వాహనం మంజూరు చేయాలని చేసిన దరఖాస్తును పరిశీలించిన జిల్లా కలెక్టర్ తగు చర్యలు నిమిత్తం జిల్లా సంక్షేమ అధికారికి ఎండార్స్మెంట్ చేశారు. భూపాలపల్లి శాంతి నగర్ గ్రామానికి చెందిన కొంతమంది ప్రజలు సింగరేణి ఉపరితల ఘని నుండి బొగ్గు తీసేందుకు జరుగుతున్న పేలుళ్ల వల్ల తమ ఇండ్లు పాడవుతున్నాయని, పగుళ్లు వస్తున్నాయని, పేలుళ్ల వల్ల భయాందోళనలు చెందుతున్నామని చేసిన దరఖాస్తును పరిశీలించిన కలెక్టర్ తగు చర్యలు నిమిత్తం సింగరేణి అధికారులను ఆదేశించారు. భూపాలపల్లి మండలం కొంపల్లి గ్రామానికి చెందిన ప్రజలు తమ ఓటు హక్కు మున్సిపాలిటీల్లో ఉండటంతో రెండు వందలకు పైగా బోగస్ ఓట్లు గుర్తించడం జరిగిందని, వాటిని తొలగించాలని దరఖాస్తు చేయగా పరిశీలించిన జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ వెంటనే బోగస్ ఓట్లు తొలగించి నివేదిక అందించాలని ఆర్డీఓను ఆదేశించారు. భూపాలపల్లి మున్సిపాల్టీ పరిధిలోని 10 వ వార్డు పుల్లూరు రామయ్య పల్లి వాసులు కొంతమంది గుడిసెల్లో నివసిస్తూ జీవనం సాగిస్తున్నామని తమకు మిషన్ భగీరథ మంచినీరు సరఫరా చేయాలని దరఖాస్తు చేయగా మిషన్ భగీరథ మంచినీరు అందించాలని, మౌలిక వసతులు కల్పించాలని మున్సిపల్ కమిషనర్ ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయ లక్ష్మీ, పలు శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## విజ్ఞప్తుల సత్వర పరిష్కారం పై దృష్టి

### అధికారులకు కమిషనర్ ఆమ్రపాలి కాట ఆదేశం

### జీహెచ్ఎంసీ పరిధిలో ప్రజావాణికి 164 అర్జీలు



**విశ్వంభర,హైదరాబాద్:** ప్రజావాణిలో వచ్చిన విజ్ఞప్తులను ఎప్పటికప్పుడు పరిష్కరించడం పై ఆయా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి కాట అధికారులను ఆదేశించారు. జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి నగరం నలుమూలల నుంచి ప్రజలు తరలి వచ్చారు. కమిషనర్ ఆమ్రపాలి కాట ఒక్కొక్కరి సమస్యను అడిగి తెలుసుకుంటూ విజ్ఞప్తులను స్వీకరించారు. ఆయా ఆర్జీలను సంబంధిత అధికారులకు అందజేసి వెంటనే చర్యలు తీసుకొని పరిష్కరించాలని సూచించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ... జాప్యం లేకుండా ప్రజావాణిలో వచ్చిన విన్నపాలపై దృష్టి సారించి సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని ఆయా విభాగాల అధికారులకు సూచించారు. ఫోన్ ఇన్ ప్రోగ్రాం ద్వారా 7 విన్నపాలు రాగా సంబంధిత అధికారులకు పరిష్కారానికి పంపారు. జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో 72 విన్నపాలు రాగా అందులో టౌన్ ప్లానింగ్ 48, హౌసింగ్ 6, రెవెన్యూ 5, ఎఫ్.ఏ 4, హెల్త్ 3, ఎస్టేట్ 2, ఎల్.డబ్ల్యూ,ఎస్, ఎలక్ట్రికల్, సి.ఈ మెయింటెనెన్స్, వెటర్నరీ విభాగాలకు ఒకటి చొప్పున విన్నపాలు వచ్చాయని ఆమె తెలిపారు. జీహెచ్ఎంసీ పరిధిలోని ఆరు జోన్లలో మొత్తం 92 అర్జీలు వచ్చాయి. అందులో కూకట్ పల్లి జోన్ లో 54, ఎల్బీనగర్ జోన్ లో 14, సికింద్రాబాద్ జోన్ లో 11, శేరిలింగంపల్లి జోన్ లో 09, చార్మినార్ జోన్ లో 3, ఖైరతాబాద్ జోన్ లో ఒక అర్జీలు వచ్చాయని తెలిపారు. అడిషనల్ కమీషనర్లు నళిని పద్మావతి, వేణుగోపాల్ రెడ్డి, సత్యనారాయణ, యాదగిరి రావు, పంకజ, సిసిపి శ్రీనివాస్, అడిషనల్ సిసిపి ప్రదీప్ కుమార్, జాయింట్ కమిషనర్ మహేష్ కులకర్ణి, ఆయా విభాగాల అధికారులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

## లడ్డు తయారిలో జంతువుల

## కొవ్వు వాడకాన్ని ఖండించిన న్యాయవాధులు



**విశ్వంభర, రంగారెడ్డి:** తిరుపతి శ్రీవారి లడ్డు తయారిలో జంతువుల కొవ్వు వాడకాన్ని రంగా రెడ్డి జిల్లా న్యాయవాధులు తీవ్రంగా కండించారు. ఈసందర్భంగా ఉమ్మడి తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తులు ఈ వ్యవవారాన్ని సుమోటోగా స్వీకరించి తగు చర్యలు తీసుకోవాలని కోరారు. తిరుపతి లడ్డు ప్రసాధ పవిత్రతను కాపాడానికి చర్యలు తిసుకోవాలని సుచించారు. విధి ప్రకోస్ట లీగల్ సెల్ ఆధ్వర్యంలో జరిగిన నిరసన కార్యక్రమంలో రంగారెడ్డిజిల్లా న్యాయవాద సంఘం ప్రధాన కార్యదర్శి గులగారి కృష్ణా, వీహెచ్‌పీ తెలంగాణ ప్రాంత కో కన్వీనర్ వనం శ్రీకాంత్, వట్టికూటి అంజయ్య గౌడ్, రంగాప్రవీణ్ కుమార్, జక్కరాజు రంజ్జిత్ కుమార్, శ్రీకర్, పరమేష్, చిరంజీవి, గురువయ్య, సంగిశెట్టి నరసింహా, ఉప్పల సుధాకర్, ప్రసాద్, వినోద్ కుమార్, కృష్ణమూర్తి, నాగేశ్వర్, కె.అంజయ్య, అరవింద రెడ్డి, సన్నీ పాల్గొన్నారు.

## ప్రజావాణి వినతులను వెంటనే పరిష్కరించాలి: కలెక్టర్ ప్రావీణ్య



**విశ్వంభర, హనుమకొండ:** ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు వివిధ సమస్యలపై అందించిన వినతులను వెంటనే పరిష్కరించే విధంగా సంబంధిత శాఖల అధికారులు చర్యలు చేపట్టాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య అన్నారు. సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో ప్రజావాణి కార్యక్రమాన్ని వివిధ శాఖల ఉన్నతాధికారులతో నిర్వహించారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు వివిధ సమస్యలపై వినతి పత్రాలను జిల్లా కలెక్టర్ కు అందజేశారు. ప్రజల నుండి వినతి పత్రాలను స్వీకరించిన జిల్లా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ ఆయా శాఖల ఉన్నతాధికారులు ప్రజావాణిలో వచ్చిన వినతులను వెంటనే పరిష్కరించే విధంగా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి 139 వినతులు వచ్చాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో వై.వి. గణేష్, హనుమకొండ, పరకాల ఆర్డీవోలు వెంకటేష్, డాక్టర్ కె. నారాయణ, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## రామన్నపేటను మరో కాలుష్యపు మేళ్ళచెరువుగా చెయ్యొద్దు

**విశ్వంభర, రామన్నపేట:** మేళ్లచెరువు తెలంగాణ రాష్ట్రంలోని ఉమ్మడి నల్గొండ జిల్లాలోని ఒక గ్రామం. ఈ ప్రాంతంలో సిమెంట్ ఫ్యాక్టరీల కారణంగా తీవ్రమైన పర్యావరణ సమస్యలను ఎదుర్కొంటోంది. జనజీవనం తీవ్ర ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటోంది. రామన్నపేట లో కొత్తగా ప్రారంబించబోయే సిమెంట్ ఫ్యాక్టరీ వల్ల మన రామన్నపేట ఇక ముందు పాపం రామన్నపేట కావద్దని రామన్నపేట పట్టణ, మరియు మండలంలోని వివిధ గ్రామాల ప్రజలు కోరుతున్నారు. రామన్నపేట పట్టణం కానీ, మండలం కానీ ఎంతో ప్రశాంతంగా ఉంటుందని. మూసీ నది, మానవులు వదిలిపెట్టిన వ్యర్థ కాలుష్యాలు మినహాఎలాంటి కాలుష్యం లేకుండా ఉన్నదని. ఇప్పటికే మూసీ నది కాలుష్యం వల్ల పరిసర గ్రామాలు ఇబ్బంది ఎదుర్కొంటున్న మాట వాస్తవమేనని. అయినా అది ఎంతోమందికి జీవనోపాధిని కలిగిస్తుందని తెలిపారు. అలాంటి రామన్నపేటలో రాబోవు రోజుల్లో సిమెంట్ ఫ్యాక్టరీ కనుక వస్తే, ఏర్పడే వాయు, జల, భూ, కాలుష్యం మూసీ నది కంటే ఎన్నో రెట్లు ఎక్కువగా ఉంటుందని సందేహం లేదన్నారు. అందుకే కాలుష్యకరకమైన ఆ సిమెంట్ ఫ్యాక్టరీని అడ్డుకుని రామన్నపేటను కాపాడుకుందామని, తద్వారా మండలంలోని పల్లెలను కాపాడుకుందామని.. ఉద్యమాలకు సిద్ధం కావాలని, కాలుష్యకరమైన ఆ ఫ్యాక్టరీని అడ్డుకోవాలి అని రామన్నపేట పట్టణ, మరియు మండలంలోని వివిధ గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

## నా భూమికి పట్టా యిప్పించగలరు



**విశ్వంభర, చివ్వేంల:** నా భూమికి పట్టా ఇప్పించాలని సోమవారం కలెక్టరేట్ కార్యాలయంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలోసూర్యాపేట జిల్లా చివ్వేంల మండలం బద్యతండా కు చెందిన ధరావత్ సక్రి జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్‌కు వినతి పత్రం ఇవ్వడం జరిగిందని తెలిపారు. అనంతరం బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం వట్టి ఖమ్మంపహాడ్ రెవెన్యూ శివారులో సర్వే నెంబర్ 455లో 1 ఎకరం 20 గుంటల భూమిని గత 25 సంవత్సరాల నుంచి సాగు చేసుకోవడం జరుగుతుంది. కానీ ఆ భూమి పట్టా కావడం లేదన్నారు. అదే సర్వే నెంబర్లో భూమి లేకున్నా కొంతమంది వ్యక్తులకి పట్టా ఉన్నందున నా భూమి పట్టా కావడం లేదని ఆవేదన వ్యక్తం చేసింది. గతంలో సర్వే చేయించినప్పటికీ అధికారులు పట్టించుకోవడంలేదని, భూమి లేకున్నా అదనంగా పట్టా చేయించుకున్న వ్యక్తుల పైన చర్యలు తీసుకోవాలని, వ్యక్తుల పట్టాలను క్యాన్సల్ చేసి తనకు పట్టా చేయించాలని కలెక్టర్‌కు మొరపెట్టుకున్నట్లు ఆమె తెలిపారు.

## బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం



**విశ్వంభర, ఆమనగల్లు:** ప్రధాని నరేంద్ర మోడీ సంకల్పించిన వికసిత్ భారత్ కల సాకారం కావాలంటే బీజేపీని మరింత బలోపేతం చేయాలని ప్రజలను పార్టీలోకి ఆహ్వానిస్తూ పార్టీ నాయకులతో, కార్యకర్తలతో కలిసి ఆమనగల్ మున్సిపాలిటీ 15వ వార్డు 179వ బూత్ లోని ఇంటింటికి తిరిగి సభ్యత్వ నమోదు కార్యక్రమంలో మున్సిపాలిటీ సభ్యత నమో దు కన్వీనర్ చెక్కల లక్ష్మన్ పాల్గొన్నారు. ఆమనగల్ మున్సిపాలిటీ పట్టణ ఇన్చార్జ్ దండు శీను, కల్వకుర్తి అసెంబ్లీ బీజేపీ పార్టీ కో కన్వీనర్ గోరటి నరసింహ, ఆమనగల్లు మున్సిపాలిటీ బీజేపీ పార్టీ సభ్యత నమోదు కో కన్వీనర్స్ రవి రాథోడ్, పద్మ ప్రశాంత్ బీజేపీ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## స్వర్ణోత్సవ సభను విజయవంతం చేయండి



**విశ్వంభర, మహేశ్వరం:** 30న ఉస్మానియా యూనివర్సిటీలో జరగనున్న పీ.డీ.ఎస్.యూ 50 వసంతాల స్వర్ణోత్సవ సభను విజయవంతం చేయాలని పి వై ఎల్ ప్రో గ్రేసివి యూత్ లింగ్ బాలాపూర్ మండల్ ప్రధాన కార్యదర్శి కొల్లూర్ భీమేష్ పిలుపునిచ్చారు. మీర్పేట్ కార్పొరేషన్ పరిధిలో బాలాపూర్ చౌరస్తాలో స్వర్ణోత్సవ సభ వాల్ పోస్టర్ ల ను పి వై ఎల్ సభ్యులు ఆవిష్కరించారు. నవ సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ పోరాడాలన్నారు. పీ.డీ.ఎస్.యూ కోట్లాది మంది విద్యార్థులు మార్గదర్శమైందన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు కారెమొల రాకేష్, సభ్యులు శంకర్, మహేష్, చాగంటిప్రవీణ్, నరేందర్, ప్రవీణ్, జగదీష్, వసంత్, అరుణ్, పాల్గొన్నారు.

## గణనాధుని దర్శించుకున్న గొంగిడి మహేందర్ రెడ్డి



**విశ్వంభర,ఆత్మకూరు(ఎం):** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు (ఎం)మండల కేంద్రంలోని పాత పట్టణంలో నెలకొల్పిన విఘ్నేశ్వరుని డీసీసీబీ మాజీ ఛైర్మన్ బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు గొంగిడి మహేందర్ రెడ్డి దర్శించుకున్నారు. గణేష్ కమిటీ గొంగిడి మహేందర్ రెడ్డిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో గణేష్ కమిటీ అధ్యక్షులు లోడి మహేష్, ప్రధాన కార్యదర్శి చేపురి సాయి, కమిటీ సభ్యులు రంగ శ్రీను, మల్ల క్రాంతి, తొండల అనిల్, కోరే మహేష్, పంజాల రాజు, పబ్బతి అశోక్, నాతి సాయి ప్రసాద్, లోడి ప్రదీప్, ప్రమోద్, పరుషరములు పాల్గొన్నారు.

## సీఎల్పీ సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే ఐలయ్య



**విశ్వంభర, ఆత్మకూరు(ఎం):** హైదరాబాద్ లోని హోటల్ ట్రిట్రెండ్‌లో ఆదివారం సాయంత్రం తెలంగాణ రాష్ట్ర ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి, తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ ఇతర మంత్రులతో కలసి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య సీఎల్పీ సమావే శంలో పాల్గొన్నారు. ఈ సమావేశంలో తెలంగాణ రాష్ట్రంలోని పలువురు మంత్రు లు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్‌లకి ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు.

## ప్రతి ఒక్కరు స్వచ్ఛత కార్యక్రమాన్ని పాటించాలి

### జిల్లా కన్వీనర్ తుమ్మల మురళీధర్ రెడ్డి



**విశ్వంభర, ఆత్మకూరు(ఎం):** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండల కేంద్రంలో భారతీయ జనతా పార్టీ మండల శాఖ ఆధ్వర్యంలో నరేంద్ర మోడీ జన్మదినం పురస్కరించుకొని సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 02 వరకు సేవా మహా యజ్ఞం కార్య క్రమంలో భాగంగా సోమవారం బొడ్రాయి దగ్గర స్వచ్ఛ భారత్ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సేవా మహా యజ్ఞం జిల్లా కన్వీనర్ తుమ్మల మురళీధర్ రెడ్డి విచ్చేసి మాట్లాడుతూ మన పరిసరాలను మన గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచుకుంటే మన దేశం మనం అందరం బాగుంటాం అని పిలుపునివ్వడం జరిగింది. ప్రతి ఒక్కరు తమ వంతుగా స్వచ్ఛత కార్యక్రమాన్ని పాటిస్తారని వారు ధీమా వ్యక్తం చేశారు. మండల పార్టీ అధ్యక్షులు గజరాజు కాశీనాథ్, జిల్లా అధికార ప్రతినిధి బొబ్బలి ఇంద్రారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి దయ్యాల కుమారస్వామి, కిసాన్ జిల్లా కార్యదర్శి బండారు సత్యనారాయణ, మండల ఉపాధ్యక్షులు నాగం సత్తిరెడ్డి, టౌన్ అధ్యక్షులు లోడి వెంకటయ్య, పరకాల రాంబాబు, బండారి సాయి, తదితరాలు పాల్గొన్నారు.

## సోమయ్య చిత్ర పటానికి నివాళులు



**విశ్వంభర, ఆత్మకూరు(ఎం):** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు (ఎం) మండలం పల్లెపాడు గ్రామంలో మాజీ ఉపసర్పంచ్ సుగురు సోమయ్య ఇటీవల గుండెపోటుతో మృతిచెందారు. మృతుని ఫోటోకి పూలమాలవేసి నివాళులర్పించిన ఆలేరు మాజీ డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్ రెడ్డి. అలాగే వారి కుటుంబ సభ్యుల్ని పరామర్శించారు. మండల ప్రధాన కార్యదర్శి గజ్జెల్లి శంకరయ్య, మాజీ గ్రామ శాఖ అధ్యక్షులు మిర్యాల బీరయ్య, బీఆర్ఎస్వీ సెక్రటరీ జనరల్ గజ్జెల్లి మహేష్, కొత్తపల్లి పెట్టయ్య, నరసయ్య, ఏనుగు వెంకట్ రెడ్డి, కుసుమని సత్యనారాయణా, మాజీ వార్డ్ నెంబర్లు వడ్డబోయిన సుధాకర్, గజ్జెల్లి పరశురాములు, ఆలంశెట్టి సురేష్, అలంశెట్టి పరశురాములు, కొత్తపెల్లి శంకరయ్య, ఆకుల వెంకయ్య, మిరియాల వెంకటేష్, గజ్జెల్లి జానీ, బోడపట్ల మోహన్‌రెడ్డి, కొత్తపెల్లి యాదగిరి, గజ్జెల్లి యాదగిరి, గజ్జెల్లి పరశురాములు, మండల నాయకులు,పార్టీనాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం



**విశ్వంభర, ఆత్మకూరు(ఎం):** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండలం రహీంఖాన్ పేట గ్రామానికి చెందిన ముత్యాల కుమార్ గౌడ్ గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతు అకాల మరణం చెందారు. విషయాన్ని తెలుసుకున్న బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు మాజీ ఎమ్మెల్యే బూడిద బిక్షమయ్య గౌడ్ 5,000/-ల రూపాయలు, కేహెచ్ఆర్ ఫౌండేషన్ అధినేత కొప్పుల హరిదీప్ రెడ్డి 5,000/-ల రూపాయలు ఆర్థికసాయం అందించారు. ఈ కార్యక్రమములో గ్రామ శాఖ అధ్యక్షులు సుదగాని లింగయ్య గౌడ్, ఉపాధ్యక్షులు ఆవుల మల్లయ్య యాదవ్, మండల యూత్ ప్రధాన కార్యదర్శి దుంప పరశురాములు, మాజీ గ్రామ శాఖ అధ్యక్షులు మేరుగు అంజయ్య గౌడ్, కర్రే ఐలయ్య, కప్పే వెంకన్న, గ్రామ నాయకులు ముత్యాల సత్తయ్య, సుధాగాని స్వామి, తాల్లపల్లి నర్సయ్య, దుంప శివయ్య, దుంప లక్ష్మయ్య, యూత్ నాయకులు వాళ్ళం దాసుమదు, బూడిద మహేష్ పాల్గొని వారి కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి మనోధైర్యాన్ని కల్పించి కుమార్ ఆత్మకు శాంతి చేకూరాలని ప్రగాఢ సానుభూతి తెలిపారు.

## రేషన్ డీలర్ల సభను విజయవతం చేయాలి: కళ్లెం శ్రీనివాస్ గౌడ్

**విశ్వంభర, ఆత్మకూరు(ఎం):** రేషన్ డీలర్ల సమస్య పరిష్కారానికై నేడు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో హైదరాబాద్‌లో జరిగే సభను విజయవతం చేయాలి అని మోటకొండూర్ మండల రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షులు కళ్లెం శ్రీనివాస్ గౌడ్ పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్ర రేషన్ డీలర్ల సమస్య పరిష్కారానికై ఈ రోజు హైదరాబాద్ కు రేషన్ డీలర్లు అందరూ భారీగా తరలి రావాలని కోరారు. నేడు సివిల్ సప్లై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిచే హైదరాబాదులోని పటాన్ చెరువు వద్ద జిఎంఆర్ ఫంక్షన్ హాల్ లో రేషన్ డీలర్లతో జరిగే సభకు మండలంలోని ప్రతి ఒక్క రేషన్ డీలర్ రావాలని మోటకొండూర్ మండల రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షులు కళ్లెం శ్రీనివాస్ గౌడ్ కోరారు. మంత్రి నేరుగా మాట్లాడి డీలర్ల సమస్యను పరిష్కరించాలని కోరుతూ కాంగ్రెస్ మేనిఫెస్టోలో పొందుపరిచిన విధంగా ప్రతి ఒక్క రేషన్ డీలర్‌కి 5,000 రూపాయల గౌరవ వేతనంతో పాటు క్వింటల్ కు 300 రూపాయల కమిషన్ పొందే విధంగాఅడుగులు వేయాలని, ఇతర సమస్యల పరిష్కారానికై, మండలంలోని రేషన్ డీలర్లు, అందరూ మన ఐక్యతను చాటుతూ మంత్రి దృష్టికి తీసుకు వెళ్లాల్సిందిగా కోరుతున్నానని మండలంలోని రేషన్ డీలర్లు అందరూ హాజరు కావాలని కోరారు.

## ఎమ్మెల్యే సంజయ్ అరెస్ట్‌ను ఖండించిన బీఆర్ఎస్ నేతలు

**విశ్వంభర,మెట్‌పల్లి:** ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశంలో పాల్గొన్న బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూజి మాజీ ఉపముఖ్యమంత్రి తాటికొండ రాజయ్య, మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్, కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ లను అక్రమంగా అరెస్టు చేయడం కాంగ్రెస్ పార్టీ ఒంటెద్దు పోకడకు నిదర్శనమని పేర్కొన్నారు. గాంధీ ఆసుపత్రిని బీఆర్ఎస్ డాక్టర్ల బృందం సందర్శించడానికి వెళ్తే ఎందుకు అరెస్టు చేయించారో వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ మార్ సాయి రెడ్డి మాట్లాడుతూ హౌస్ అరెస్టులకు బీఆర్ఎస్ కార్యకర్తలు ఎవరు కూడా భయపడరని ఎన్నో ఉద్యమాలు చేసి అరెస్టు లకు గురై తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్నామని తెలిపారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# తిరుమల లడ్డూ వ్యవహారంలో కీలక పరిణామాలు

**తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం వ్యవహారంలో సోమవారం కీలక పరిణామాలు చోటు చేసుకున్నాయి.సోమవారం మాజీ ఎంపీ సుబ్రహ్మణ్యస్వామి సుప్రీంకోర్టులో పిల్ దాఖలు చేశారు. తిరుమల లడ్డూ ప్రసాదం విషయంలో ఏపీ సీఎం చంద్రబాబు చేసిన ఆరోపణలపై విచారణ జరుపాలని కోరారు.తిరుమల వేంకటేశ్వరస్వామి ఆలయానికి నెయ్యి సరఫరా చేసిన ఓ కంపెనీకి కేంద్ర ఆరోగ్యమంత్రిత్వ శాఖ సోమవారం నోటీసులు జారీ చేసింది. ఆలయానికి సరఫరా చేసిన నెయ్యి నాణ్యత పరీక్షల్లో విఫలం కావడంతో షోకాజ్ నోటీసులు పంపింది. తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు మాజీ చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి సోమవారం తిరుమల శ్రీవారి సాక్షిగా ప్రమాణం చేశారు. తాను గానీ అపరాధం చేసి ఉంటే.. తనతో పాటు కుటుంబ సభ్యులు సైతం సర్వనాశనం అయిపోవాలన్నారు. తాను రాజకీయంగా ఒక్క మాట మాట్లాడడం లేదు గోవిందా.. గోవిందా అంటూ ఆయన ప్రమాణం చేశారు. తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదంపై జరుగుతున్న ప్రచారంపై వైసీపీ మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి స్పందించారు. దేవుడికి ఇచ్చే నైవేద్యంపై ఏపీ సీఎం చంద్రబాబు కామెంట్స్ చేశారని తెలిపారు. ముఖ్యమంత్రి స్థాయిలో చంద్రబాబు చేసిన మాటలు చాలా బాధ కలిగించాయని అన్నారు.కలియుగ దైవం శ్రీ వెంకటేశ్వర స్వామి లడ్డూ ప్రసాదంపై తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు కీలక ప్రకటన చేసింది.శ్రీవారి లడ్డూ పవిత్రతను పునరుద్ధరించామని టీటీడీ తెలిపింది.భక్తులు ఎలాంటి భయం,అనుమానం లేకుండా తినొచ్చన్నారు.తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనం అనంతరం తీసుకొచ్చిన లడ్డూలో పొగాకుతో కూడిన ప్యాకెట్ రావడంతో భక్తులు నివ్వెరపోయారు.**





**విశ్వంభర, అమరావతి:** 'సుప్రీం'లో బీజేపీ నేత సుబ్రహ్మణ్య స్వామి పిల్..తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం వ్యవహారంలో సోమవారం కీలక పరిణామం చోటు చేసుకున్నది. మాజీ ఎంపీ సుబ్రహ్మణ్యస్వామి సుప్రీంకోర్టులో పిల్ దాఖలు చేశారు. తిరుమల లడ్డూ ప్రసాదం విషయంలో ఏపీ సీఎం చంద్రబాబు చేసిన ఆరోపణలపై విచారణ జరుపాలని కోరారు. ఆరోపణలపై క్షుణ్ణంగా విచారించేందుకు సర్వోన్నత న్యాయస్థానంలో పర్యవేక్షణలో ఉండే కమిటీని నియమించేందుకు 'రిట్ ఆఫ్ మాండమస్'.. లేకపోతే అవసరమైన ఆదేశాలు జారీ చేయాలని పిటిషన్‌లో సుప్రీంకోర్టుకు సుబ్రహ్మణ్యస్వామి విజ్ఞప్తి చేశారు. ఇది ప్రజారోగ్యంతో పాటు వేంకటేశ్వరస్వామి వారికి సమర్పించే నైవేద్యాలకు సంబంధిన అంశమని చెప్పారు. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 142 ప్రకారం.. ప్రజా ప్రయోజనాలను సమర్థిస్తూ ఈ విషయంలో న్యాయం జరిగేలా చూసేందుకు కోర్టు జోక్యం చేసుకోవాలని పిటిషన్ కోరారు. లడ్డూల తయారీలో ఉపయోగించే నెయ్యి మూలం, నాణ్యతతో సహా ల్యాబ్ పరీక్షలపై దృష్టి సారించి.. సంబంధిత అధికారుల నుంచి వివరణాత్మక ఫోరెన్సిక్ నివేదిక పొందేందుకు మధ్యంతర ఆదేశాలు జారీ చేయాలని బీజేపీ నేత కోరారు. లడ్డూ వ్యవహారంలో చంద్రబాబు నిరాధార ఆరోపణలు చేస్తున్నారని.. అవి భక్తులను గందరగోళానికి గురి చేస్తున్నాయన్నారు. సమగ్ర విచారణ కోసం కమిటీ వేయాలని.. నిజానిజాలు బయటకు రావాలనే ఉద్దేశంతో అత్యున్నత న్యాయస్థానం దృష్టికి తీసుకువచ్చానన్నారు.

ఇదిలా ఉండగా.. తిరుమల లడ్డూ వ్యవహారంలో ఇప్పటికే సుప్రీంకోర్టులో రెండు పిటిషన్లు దాఖలయ్యాయి. తాజాగా బీజేపీ నేత సైతం ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు చేయడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. ఇదిలా ఉండగా.. తిరుమలలో ఇవాళ శాంతిహోమం నిర్వహించింది. లడ్డూ ప్రసాదాలు, ఇతర నైవేద్యాల పవిత్రత, దైవత్వాన్ని పునరుద్ధిపజేసేందుకు సోమవారం ఉదయం తిరుమల శ్రీవారి ఆలయంలోని బంగారు బావి చెంతగల యాగశాలలో వైఖానస ఆగమోక్తంగా శుద్ధి, శాంతి హోమాలను టీటీడీ నిర్వహించింది.

## తమిళనాడు కంపెనీకి షోకాజ్ నోటీసులు..!

కలియుగ ప్రత్యక్ష దైవం తిరుమల వేంకటేశ్వరస్వామి ఆలయానికి నెయ్యి సరఫరా చేసిన ఓ కంపెనీకి కేంద్ర ఆరోగ్యమంత్రిత్వ శాఖ సోమవారం నోటీసులు జారీ చేసింది. ఆలయానికి సరఫరా చేసిన నెయ్యి నాణ్యత పరీక్షల్లో విఫలం కావడంతో షోకాజ్ నోటీసులు పంపింది. నాలుగు కంపెనీల నుంచి నెయ్యి నమూనాలను కేంద్రం సేకరించి ల్యాబ్‌కు పంపింది. ఇందులో ఓ కంపెనీ నాణ్యత పరీక్షల్లో విఫలం కావడంతో నోటీసులు చేసింది. అయితే, తమిళనాడులో ఏఆర్ డెయిరీకి నోటీసులు జారీ చేసినట్లు సమాచారం. ఇందుకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉన్నది. ప్రస్తుతం తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యి వినియోగం అంశం ప్రస్తుతం దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది.గత ప్రభుత్వ హయాంలో వినియోగించిన నెయ్యిలో జంతువుల కొవ్వులు ఉన్నాయని ల్యాబ్ నివేదికలో తేలిందని సీఎం చంద్రబాబు నాయుడు వెల్లడించిన విషయం తెలిసిందే. లడ్డూల వ్యవహారంలో ఏపీలో అధికార కూటమి ప్రభుత్వం, ప్రతిపక్ష వైఎస్సార్ కాంగ్రెస్ మధ్య మాటల యుద్ధం కొనసాగుతున్నది. కల్తీ నెయ్యి అంశంపై దర్యాప్తు చేసేందుకు ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు సీఎం చంద్రబాబు ప్రకటించారు. ఐజీపీ, అత్యకంటే ఎక్కువ ర్యాంకు అధికారులతో సిట్‌ని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. సిట్ ప్రభుత్వానికి నివేదిక సమర్పిస్తుందని.. గతంలో జరిగిన తప్పులు పునరావృతం కాకుం డా నివేదిక ఆధారంగా చర్యలు తీసుకుంటామన్నారు.

## తిరుమలలో మాజీ చైర్మన్ భూమన ప్రమాణం



తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు మాజీ చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి సోమవారం తిరుమల శ్రీవారి సాక్షిగా ప్రమాణం చేశారు. తాను గానీ అపరాధం చేసి ఉంటే.. తనతో పాటు కుటుంబ సభ్యులు సైతం సర్వనాశనం అయిపోవాలన్నారు. తాను రాజకీయంగా ఒక్క మాట మాట్లాడడం లేదు గోవిందా.. గోవిందా అంటూ ఆయన ప్రమాణం చేశారు. తిరుమలలో గత ప్రభుత్వ హయాంలో తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదాన్ని కల్తీ నెయ్యితో తయారు చేశారని.. ఆ నెయ్యిలో జంతువుల కొవ్వులు ఉన్నట్లు ఇటీవల ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో అధికార పార్టీ, ప్రతిపక్ష వైఎస్సార్ సీపీ మధ్య మాటల యుద్ధం కొనసాగుతున్నది. ఈ క్రమంలో భూమన కరుణాకర్‌రెడ్డి తిరుమలలో తాము తప్పు చేయలేదని ప్రమాణం చేస్తానని ప్రకటించిన విషయం తెలిసిందే. అన్న మాట మేరకు ఆయన తిరుమల శ్రీవారి సాక్షిగా ప్రమాణం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత కొద్ది రోజులుగా తన మనసు కలత చెందుతోందన్నారు. కలుషిత రాజకీయ మనస్కులు దారుణంగా ప్రవర్తిస్తున్నారంటూ విమర్శించారు. ప్రమాణానికి ముందు ఆయన శ్రీవారి పుష్కరిణిలో స్నానం చేశారు. ఆ తర్వాత అఖిలాండం వద్ద చేతిలో కర్పూరం వెలిగించి ప్రమాణం చేశారు. అనంతరం శ్రీవారి ఆలయ మహాద్వారానికి మొక్కారు. ప్రమాణం అనంతరం భూమనను పోలీసులు అదుపులోకి తీసుకొని తిరుపతికి తరలించారు.

## వైసీపీ మాజీ ఎమ్మెల్యే కీలక వ్యాఖ్యలు

తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదంపై జరుగుతున్న ప్రచారంపై వైసీపీ మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి స్పందించారు. దేవుడికి ఇచ్చే నైవేద్యంపై ఏపీ సీఎం చంద్రబాబు కామెంట్స్ చేశారని తెలిపారు. ముఖ్యమంత్రి స్థాయిలో చంద్రబాబు చేసిన మాటలు చాలా బాధ కలిగించాయని అన్నారు. హైదరాబాద్ సోమాజిగూడలోని ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఆయన మాట్లాడుతూ.. తిరుమల లడ్డూపై రాజకీయం తప్పని ఆయన తెలుసుకోవాలని హితవు పలికారు. తిరుమల లడ్డూ ప్రసాదంపై చంద్రబాబు చేసిన వ్యాఖ్యలు ప్రజలను భయభ్రాంతులకు గురి చేశాయని గడికోట శ్రీకాంత్ రెడ్డి విమర్శించారు. ప్రతి ఆరు నెలలకు ఒకసారి టెండర్ల ద్వారా నెయ్యి సేకరణ జరుగుతుందని ఆయన తెలిపారు. ట్యాంకర్లలో వచ్చిన నెయ్యిని పరిశీలించిన తర్వాతే వినియోగిస్తారని అన్నారు. అయినా జూలైలో వచ్చిన రిపోర్టును సెప్టెంబర్‌లో బయటపెట్టారని చెప్పారు. జూన్‌లో కల్తీ నెయ్యి వస్తే ఇప్పటి ప్రభుత్వానిదే కదా బాధ్యత అని ప్రశ్నించారు.శ్రీవారిని అడ్డం పెట్టుకుని చంద్రబాబు పొలిటికల్ గేమ్స్ ఆడుతున్నారని గడికోట శ్రీకాంత్ రెడ్డి దుయ్యబట్టారు. పవిత్రమైన లడ్డూపై అపవిత్రమైన మాటలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. రాజకీయ లబ్ధి కోసం విమర్శలు చేయడం సమంజసమేనా అని నిలదీశారు. చంద్రబాబుకే కాదు మాకు కూడా వెంకటేశ్వరస్వామి ఇలవేల్పుఅని స్పష్టం చేశారు.

## దేవస్థానం బోర్డు కీలక ప్రకటన

కలియుగ దైవం శ్రీ వెంకటేశ్వర స్వామి లడ్డూ ప్రసాదంపై తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు కీలక ప్రకటన చేసింది. దోషాలు, దుష్ఫలితాలను తొలగించి శ్రీవారి లడ్డూ పవిత్రతను పునరుద్ధరించామని టీటీడీ తెలిపింది. భక్తులు తిరుమల లడ్డూను ఎలాంటి భయం, అనుమానం లేకుండా తినొచ్చన్నారు. లడ్డూ అపవిత్రం కావడంతో తిరుమలలో శాంతియాగం, సంప్రోక్షణ హోమాలు నిర్వహించామని తెలిపారు. తిరుపతి లడ్డూపై ఇప్పుడు ఎలాంటి సందేహాలు అక్కర్లేదని.. నాణ్యమైన నెయ్యితో లడ్డూ తయారీ చేస్తున్నామనితెలిపారు.

## లడ్డూలో పొగాకుతో కూడిన ప్యాకెట్..



ఖమ్మం రూరల్: దేవదేవుడు, కలియుగ ప్రత్యక్ష దైవమైన తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనం అనంతరం తీసుకొచ్చిన లడ్డూలో పొగాకుతో కూడిన ప్యాకెట్ రావడంతో భక్తులు నివ్వెరపోయిన ఘటన ఇది. ఖమ్మం రూరల్ మండలంలోని గొల్లగూడెం గ్రామపంచాయతీ శివారు కార్తికేయ టౌన్షిప్కు చెందిన దొంతు పద్మావతి బంధువులతో కలిసి ఈనెల 19న తిరమల వెళ్లారు.అక్కడ 20వ తేదీన సర్వదర్శనం ద్వారా స్వామిని దర్శించుకున్నాక లడ్డూలు కొనుగోలు చేయగా ఆదివారం తెల్లవారుజామున ఇంటికి చేరుకున్నారు. కాగా, ఉదయం లడ్డూ ప్రసాదాన్ని ఇంట్లో దేవుడి వద్ద ఉంచి బంధువులకు ఇచ్చేందుకు ముందు కొద్దిగా నోట్లో వేసుకోగా పొగాకు వాసన వచ్చింది.

# జాతీయ లోక్-అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి


**సైబర్ నేరగాళ్ల చేతిలో కోల్పోయిన డబ్బు బాధితులకు అందేలా చూడాలి- జిల్లా ఎస్పీ రూపేష్**



**విశ్వంభర, సంగారెడ్డి:** జాతీయ మెగా లోక్-అదాలత్, సైబర్ నేరాలు మరియు ఎన్.బి.డబ్ల్యూ ఎగ్జిక్యూషన్ గురించి సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో వీడియో కాన్ఫరెన్స్ ను జిల్లా ఎస్పీ రూపేష్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఈనెల 28న జాతీయ మెగా లోక్-అదాలత్ ను పురస్కరించుకొని వీలైనంత వరకు ఎక్కువ కేసులలో రాజీ కుదిర్చేవిధంగా చూడాలని అధికారులకు సూచించారు. రాజీ పడడానికి అవకాశం ఉన్న అన్ని కేసులలో ఇరువర్గాలు రాజీపడి చాలా కాలంగా పెండింగ్లో ఉన్న కేసులను క్లోజ్ చేసుకోవచ్చని ఎస్పీ సూచించారు. అదేవిధంగా సైబర్ నేరాలలో బాధితులు కోల్పోయిన డబ్బులు త్వరగా బాధితులకు అందేవిధంగా చూడాలని, 25 వేల రూపాయల కంటే తక్కువ డబ్బు కోల్పోయిన కేసులలో లోక్-అదాలత్ ద్వారా ఫిర్యాదు చేసుకొని, ఎఫ్ఐఆర్ లేకుండానే రీఫండ్ ప్రక్రియా చేసుకోవచ్చని అన్నారు. ఎన్.బి.డబ్ల్యూ ఎగ్జిక్యూషన్ విషయమై స్పెషల్ టీమ్ లను ఏర్పాటు చేసి, ఎన్.బి.డబ్ల్యూ ఎగ్జిక్యూషన్ అయ్యే విధంగా చూడాలని అధికారులకు సూచించారు.

# బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం

**పక్షం రోజులపాటు నిర్వహించనున్న స్వచ్ఛతా హి సేవ**



**విశ్వంభర,బోడుప్పల్:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన స్వచ్ఛత హి సేవ కార్యక్రమాన్ని 17 సెప్టెంబర్ నుండి 2 అక్టోబర్ వరకు నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా సోమవారం బోడుప్పల్ నగరపాలక సంస్థ మేయర్ తోటకూర అజయ్ యాదవ్, డిప్యూటీ మేయర్ కొత్త స్రవంతి కిషోర్ గౌడ్, కమీషనర్ జి. రామలింగం ఆధ్వర్యంలో 17వ మరియు 4వ డివిజన్ శ్రీ లక్ష్మీ నగర్ కాలనీ లలో పారిశుద్ధ్య కార్యక్రమాలను నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా మేయర్ తోటకూర అజయ్ యాదవ్ మాట్లాడుతూ స్వచ్ఛతా హి సేవ కార్యక్రమం పక్షం రోజుల పాటు నిర్వహించ బడుతుందని, రోడ్డు పక్కన పడి ఉన్న చెత్తను శుభ్రం చేయడం, అపరిశుభ్ర ప్రాంతాల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లటం, నీటి నిల్వ ఉన్న ప్రాంతాల్లో ఆయిల్ బాల్స్ లను వేయడం జరిగిందన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఉండాలంటే పరిసర ప్రాంతాల్లో పరిశుభ్రంగా ఉంచుకోవాలని, దోమలను నివారించాలని, చెత్తాచెదారం పడవేయకుండా స్వచ్ఛ ఆటో లకు మాత్రమే ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కొత్త స్రవంతి కిషోర్ గౌడ్ మాట్లాడుతూ ప్రజలకు పరిసరాలు పరిశుభ్రత గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. తదనంతరం రోడ్లపై పడి ఉన్న చెత్తను శుభ్రం చేశారు. స్వచ్ఛతాహి సేవ కార్యక్రమాలను కమిషనర్ జి.రామలింగం నిరంతరం పర్యవేక్షిస్తూ ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందనీ తెలిపారు. ఈ కార్యక్రమంలో 17వ డివిజన్ కార్పొరేటర్ పోగుల నరసింహారెడ్డి, 13వ వార్డు కార్పొరేటర్ దానగళ్ళ అనిత యాదగిరి, సానిటరీ ఇన్స్పెక్టర్ కమలాకర్, విశ్వం గుప్తా, శ్రీ లక్ష్మీ నగర్ కాలనీ అధ్యక్షులు ఆసర్ల బీరప్ప, సురేష్, వెంకటేశ్వర్లు, ప్రసాద్, రమణారెడ్డి, బిక్షపతి గౌడ్,అవినాష్, మహిళా సభ్యులు నిర్మల, సత్య శ్రీ, ఆచార్ల తేజస్విని, మునిసిపల్ సిబ్బంది, కాలనీవాసులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయం- ఎస్సై బి.యాదయ్య



**విశ్వంభర, చింతపల్లి:** చింతపల్లి ప్రెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అక్షర కంటి ఆసుపత్రి ఆప్టికల్స్ దేవరకొండ వారి సహకారంతో సోమవారం చింతపల్లి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ఉచిత మెగా కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ కంటి వైద్య శిబిరానికి స్థానిక ఎస్సై బి.యాదయ్య ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చింతపల్లి ప్రెస్ అసోసియేషన్ జర్నలిస్టులు ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయడమే కాకుండా, ప్రజలకు తన వంతు సహకారంగా ఇలాంటి సామాజిక కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయం అన్నారు. భవిష్యత్తులో ప్రజా సమస్యలను వెలిక్కి తీయడంతో పాటు ఇలాంటి సామాజిక కార్యక్రమాలు మరెన్నో నిర్వహించి ప్రజల మన్ననలు పొందాలన్నారు. ఈ వైద్య శిబిరంలో సుమారు 300 మంది కంటి వైద్య పరీక్షలను నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా కంటి వైద్యులు పలువురికి ఉచితంగా మందులు పంపిణీ చేయడంతో పాటు, పలు సలహాలు సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు అంగిరేకుల నాగభూషణం, పిఎసిఎస్ చైర్మన్ లింగంపల్లి వెంకటయ్య, బీజేపీ మండల అధ్యక్షులు శివర్ల రమేష్ యాదవ్, మాజీ సర్పంచ్ జంగయ్య, మాజీ ఎంపీటీసీ కాసారపు శ్రీనివాస్, మాజీ ఉప సర్పంచ్ సలీం పాషా, గుణమోని కొండల్ యాదవ్, చెన్నయ్య, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, పత్రికా విలేకరులు, వివిధ గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# శిరీషావలి మృతి సీపీఐ పార్టీకి తీరనిలోటు



**విశ్వంభర, డిండి:** డిండి మండలంలోని తౌక్లపూర్ గ్రామానికి చెందిన సీపీఐ గ్రామ శాఖ సభ్యులు కామ్రేడ్ మహ్మద్ శిరీషావలి మృతి పార్టీకి, కుటుం బానికి తీరనిలోటని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బొడ్డుపల్లి వెంకటరమణ అన్నా రు. సోమవారం శిరిషావలి పార్థివ దేహంపై ఎర్ర జండాను కప్పి పూల మాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం కు టుంబ సభ్యులకు ప్రగాడ సానుభూతి సంతాపం తెలిపారు. వారిలో సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు తూం బుచ్చిరెడ్డి, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎండీ.మైనోద్దీన్, సీపీఐ డిండి మం డల కార్యదర్శి శ్రీరామదాసు కనకాచారి, సహాయ కార్యదర్శి బొల్లె శైలేష్, ఎఫ్ఐటియుసి జిల్లా సహాయ కార్యదర్శి నూనె వెంకటేశ్వర్లు, సీపీఐ గ్రామశాఖ కార్యదర్శి వంకేశ్వరం చక్రి, ఏ ఐ వై ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు ఎనమల్ల నవీన్, సీపీఐ గ్రామశాఖ సహాయ కార్యదర్శి భయ్యా శ్రీను, రహమం తాపూర్ గ్రామ శాఖ కార్యదర్శి సోమిడి శ్రీనయ్య, చెర్కుపల్లి గ్రామశాఖ కార్యదర్శి నూతనగంటి హన్మంతు, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి ఎల్మినేటి హుసేన్, గోరటి అల్లయ్య, నూకం రాములు, చెనమోని పర్వతాలు, నూనె మల్లేష్, వెంకటేష్, ఎనమల్ల శ్రీను, గాలి సిద్దార్థ్, తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే సంజయ్ అరెస్ట్‌ను ఖండించిన బీఆర్ఎస్ నేతలు



**విశ్వంభర,మెట్‌పల్లి:** ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశంలో పాల్గొన్న బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ మాజీ ఉపముఖ్యమంత్రి తాటికొండ రాజయ్య, మాజీఎమ్మెల్యే మెతుకు ఆనంద్, కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ లను అక్రమంగా అరెస్టు చేయడం కాంగ్రెస్ పార్టీ ఒంటెద్దు పోకడకు నిదర్శనమని పేర్కొన్నారు. గాంధీ ఆసుపత్రిని బీఆర్ఎస్ డాక్టర్ల బృందం సందర్శించడానికి వెళ్తే ఎందుకు అరెస్టు చేయించారో వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. మాజీఎంపీపీ మార్‌సాయిరెడ్డి మాట్లాడుతూ హౌస్ అరెస్టులకు బీఆర్ఎస్ కార్యకర్తలు ఎవరు కూడా భయపడరని ఎన్నో ఉద్యమాలు చేసి అరెస్టులకుగురై తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్నామని తెలిపారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# జన్మదిన వేడుకల్లో పాల్గొన్న కోలన్ హనుమంత రెడ్డి



**విశ్వంభర, కుత్బుల్లాపూర్:** కుత్బుల్లాపూర్ నియోజక వర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి కోలన్ హనుమంత్ రెడ్డి తెలంగాణ రాష్ట్ర మజీ మంత్రి ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి జన్మదిన వేడుకలలో పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. ఆయన మాట్లాడుతూ మహేందర్ రెడ్డి ఇంకా మరెన్నో జన్మదిన వేడుకలు జరుపుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొలన్ శ్రీనివాస్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ పాలకృష్ణ, సిద్దనోళ్ల సంజీవ్ రెడ్డి, ఎన్ .ఎమ్ .సి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొలన్ రాజశేఖర్ రెడ్డి, డివిజన్ నాయకులు గణేష్, బియ్యాన్ని శివ కుమార్, సోమన్న గారి శ్రీధర్ రెడ్డి, బేకు శ్రీనివాస్, గడ్డం రాజేందర్ రెడ్డి, రాధా కృష్ణ, లక్ష్మ రెడ్డి, రషీద్, కృష్ణ గౌడ్, నరేందర్ రెడ్డి, శ్రీనివాస్ రావు, శ్రీధర్ గౌడ్, జీవన్ రెడ్డి, బల్ రెడ్డి, విష్ణు వర్ధన్ రెడ్డి, విక్రమ్ రెడ్డి, మణికంఠ, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం, రెండు గేదెలు మృతి



**విశ్వంభర,మహేశ్వరం:** మహేశ్వరం మండలం డబిల్ గూడ గ్రామానికి చెందిన కర్ణం ప్రభాకర్ రైతుకు సంబంధించిన రెండు పాడి గేదెలు విద్యుత్ షాక్ గురై ప్రాణం విడిచాయి. ప్రభుత్వ అధికారులకు పలుమార్లు ఫోన్ చేసిన స్పందించకపోవడం బాధాకరం. గతంలో కూడా ఈ కరెంటు వైర్లు తెగిపడిన ఎలాంటి చర్యలు తీసుకోకుండా కాలయాపన చేశారు. ఇక ముందైనా అధికారులు రైతుల పట్ల నిర్లక్ష్యం వహించవద్దని ఇప్పటికైనా అధికారులు స్పందించి కరెంటు వైర్లను సరి చేయాలని రైతులు, కోరుకుంటున్నారు. మహేశ్వరం మండల బీఆర్ఎస్ యూత్‌వింగ్‌వైస్ ప్రెసిడెంట్ బోర్ర కరుణాకర్ గ్రామస్తులు ఉన్నారు.

# అధికారులు చురుకుగా పాల్గొనాలి



**విశ్వంభర, మహబూబాబాద్/గార్ల/బయ్యారం:** సోమవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందు మండలంలోని ఎస్.ఎస్.గార్డెన్ ఫంక్షన్ హాలులో ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య అధ్యక్షతన జరిగిన నియోజకవర్గ స్థాయి సమీక్ష సమావేశానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, మహబూబాబాద్ పార్లమెంట్ సభ్యులు పోరిక బలరాం నాయక్, జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్, భద్రాద్రి కొత్తగూడెం కలెక్టర్ జితేష్ వి.పాటిల్, భద్రాచలం ఐ.టి.డి.ఎ.పి.ఓ బి.రాహుల్, భద్రాద్రి కొత్తగూడెం ఎస్.పి.బి.రాహుల్ రాజ్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి జిల్లాలోని వివిధ శాఖలలో సాంక్షన్ అయి వివిధ దశలలో ఉన్న అభివృద్ధి పనులపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. జిల్లాలోని రెండు మండలాలలో ఈ మధ్య కురిసిన భారీ వర్షాల కారణంగా దెబ్బతిన్న రోడ్ల, సిసి రోడ్లు మరమ్మతులు పనులు ఎంతవరకు పూర్తి అయ్యాయని అధికారులను అడిగి తెలుసుకున్నారు. సాంక్షన్ అయి ఉంటే పనులను త్వరగా పూర్తి చేయాలని ఏమైనా సాంక్షన్ కాని పనుల కోసం వెంటనే ప్రతిపాదనలు పంపించి పనులు చేపట్టాలన్నారు. ఫారెస్ట్ రోడ్లకు సంబంధించి ఏమైనా సమస్యలు ఉంటే పరిష్కరించి పనులు త్వరగా చేపట్టాలన్నారు. బయ్యారం, గార్ల మండలాలకు సంబంధించిన పనుల యొక్క ఎస్టిమేషన్ త్వరగా పంపించి పనుల ప్రారంభానికి చర్యలు తీసుకోవాలని మంత్రి కలెక్టర్ కు సూచించారు. పట్టణాల్లో గ్రామాలలో విద్యుత్ సరఫరా ఆటంకం కలుగకుండా సరఫరా చేయాలని గ్రామాలలో వదులుగా ఉన్న కరెంటు తీగలను సరిచేయాలని, అమ్మ ఆదర్శ పాఠశాల పనులు పూర్తి చేయాలని ప్రతీ ఇంటికి మిషన్ భగీరథ మంచి నీరు అందజేయాలని అన్నారు. పాఠశాలల్లో విద్యార్థులకు అనుగుణంగా ఉపాధ్యాయుల కేటాయింపు కు విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వంవైద్యం, విద్యా వ్యవస్థలపై ప్రత్యేక దృష్టి సారించిందని అందుకనుగునంగా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించకుండా పనిచేయాలన్నారు. జిల్లాలో ఆక్రమణకు గురి అయిన ప్రభుత్వ స్థలాల విషయంలో ఎంత పెద్ద వారివైనా ఉపేక్షించకుండా పోలీసు వారి సహకారంతో ఒక్క గజం కూడా వదలకుండా రాబట్టేలా చర్యలు చేపట్టాలని అన్నారు. అక్టోబర్ 2 నుండి అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డు, హెల్త్ కార్డులు ప్రభుత్వం జారీ చేయనుందని, అదేవిధంగా ఇందిరమ్మ ఇండ్ల లబ్ది దారులను ఫైనల్ చేయబోతుందని కావున ప్రభుత్వ ఆలోచనలకు అనుగుణంగా అర్హులైన ప్రతి ఒక్కరికి లబ్ధి చేకూరే విధంగా అధికారులు పనిచేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ మాట్లాడుతూ గార్ల, బయ్యారం మండలాలలో రోడ్ల పనుల పరిస్థితులపై, అమ్మ ఆదర్శ పాఠశాలల పనుల పూర్తి, వైద్య, విద్యుత్, పంచాయతీ పలు శాఖలలో జరిగే పలు అభివృద్ధి పనులు, పెండింగ్ పనులపై మంత్రికి వివరించారు. ఈ సమీక్ష సమావేశంలో జిల్లా అధికారులు, సొసైటీ చైర్మెన్‌లు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# మోదీకి 56 అంగుళాల ఛాతీ ఇప్పుడు లేదు



**మన్ కీ బాత్ కాదు, కామ్ కీ బాత్ సంగతేంటి?**

**శ్రీనగర్ ఎన్నికల ప్రచారంలో రాహుల్ గాంధీ**

**శ్రీనగర్:** గతంలో ప్రధాని నరేంద్ర మోదీకి ఉన్న 56 అంగుళాల ఛాతీ ఇప్పుడు లేదని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. మన్?కీ బాత్ గురించి మాట్లాడే ప్రధాని, కామ్?కీ బాత్?(పని) గురించి ఎప్పుడు మాట్లాడతారని ప్రశ్నించారు. 25మంది వ్యాపారవేత్తల కోసం రూ.16 లక్షల కోట్లు మాఫీ చేశారని ఆరోపించారు. జమ్ముకశ్మీర్‌లో లెఫ్టినెంట్ గవర్నరే రాజు అని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అన్నారు. ఆయన జమ్ముకశ్మీర్ వ్యక్తి కాదని, ఔట్?సైడర్? అని చెప్పారు. ఇక్కడి ప్రజలు కోరుకునే అభివృద్ధిని ఆయన చేయలే దని, ఇక్కడి పరిస్థితుల గురించి గవర్నర్‌కు ఏం తెలియదని అన్నారు. మోదీ ప్రభుత్వం జమ్ముకశ్మీర్ ప్రజల హక్కులను హరించిందని ధ్వజమెత్తారు. పూంఛ్ జిల్లాలోని సూరన్?కొటె, శ్రీనగర్? జిల్లాలోని జైన్‌కొటెలో సోమవారం జరిగిన ఎన్నికల సభల్లో రాహుల్ మాట్లాడారు. బీజేపీపై మండిపడ్డారు.

**'అన్యాయంగా యూటీ చేశారు'**

భారత్‌లో కేంద్ర పాలిత ప్రాంతాలు(యూటీ) రాష్ట్రాలుగా మారాయని తెలిపారు రాహుల్. మధ్యప్రదేశ్? నుంచి ఛత్తీస్‌గఢ్, బిహార్ నుంచి ఝార్ఖండ్, ఆంధ్రప్రదేశ్ నుంచి తెలంగాణ ఏర్పాటు అయ్యాయని అన్నారు. అయితే, భారతదేశ చరిత్రలో ఒక రాష్ట్రాన్ని యూటీ చేయడం జరగలేదన్నారు. కానీ మొట్ట మొదటి సారి ఓ రాష్ట్ర ప్రజల హక్కులను హరించి యూటీ చేశారని మండిపడ్డారు. జమ్ముకశ్మీర్ ప్రజలు అన్యాయానికి గురయ్యారని చెప్పారు.

**'పార్లమెంట్?లో జమ్ముకశ్మీర్ ప్రజల వాణి వినిపిస్తా'**

పార్లమెంట్‌లో జమ్ముకశ్మీర్ ప్రజల వాణి వినిపిస్తానని, రాష్ట్ర హోదా కోసం కేంద్రంపై ఒత్తిడి తీసుకువస్తామని రాహుల్ అన్నారు. అవసరముంటే, ఆర్డర్? వేయగానే ప్రత్యక్షమవుతానని అన్నారు. "రాష్ట్ర హోదా పునరుద్ధరించడం ఇక్కడి ప్రజలకు అదిపెద్ద సమస్య. బీజేపీ చేయకున్నా(ఎన్నికల తర్వాత) ఆ పని మేము చేస్తామని గ్యారెంటీ ఇస్తున్నా. దేశవ్యాప్తంగా బీజేపీ హెచ్?ఎమ్?టీ వంటి అనేక కంపెనీలను మూసేసింది. సామాన్యులను పట్టించుకోకుండా, 25మంది వ్యాపారవేత్తలకు, రూ.16లక్షల కోట్లు మాఫీ చేసింది. కానీ పేదలు, రైతులు, కార్మికులు, విద్యార్థులు, మహిళలకు చేయలేదు. తప్పుల తడకగా ఉన్న జీఎస్?టీతో అనేక, చిన్న మధ్యతరగతి పరిశ్రమనలు మూతపడటానికి కారణమైంది. ఫలితంగా ఇక్కడి వారితో సహా యువతకు ఉద్యోగాలు లేకుండా పోయాయి. ఇది నరేంద్ర మోదీ గిఫ్ట్. ప్రధాని, మన్‌కీ బాత్‌లో అర్థం లేని సుదీర్ఘ ప్రసంగాలు ఇస్తారు, కానీ ప్రజల సమస్యలు పట్టించుకోరు. కామ్ కీ బాత్ మాట్లాడరు. ఇకపై ఎవరూ మోదీ మన్‌కీ బాత్ వినరు." అని రాహుల్ అన్నారు.

'లాల్ చౌక్‌లో ఐస్‌క్రీంతినడం- మీ హయాంలో సాధ్యమయ్యేదా రాహుల్' రాహుల్, శ్రీనగర్‌కు వచ్చినప్పుడల్లా, తన చెల్లెలు, స్నో బాల్స్‌తో ఆడుకుంటారని, లాల్ చౌక్‌లో ఐస్ క్రీం తింటారని, కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఇది సాధ్యమయ్యేదా అంటూ కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ ప్రశ్నించారు. వాళ్లు ద్వేషాన్ని వ్యాప్తి చేయడం వల్ల 30ఏళ్లు జమ్ముకశ్మీర్ ఉగ్రవాద నీడలో ఉందని ఆరోపించారు. ఇప్పుడు ఆ పరిస్థితిని ప్రధాని మోదీ మార్చారని అన్నారు.

# యూట్యూబ్స్, వెబ్‌సైట్స్‌కు రిజిస్ట్రేషన్ తప్పనిసరి

**పత్రికలకు ఆర్ఎన్ఐ, న్యూస్ ఛానల్లకు ఎంఐబీ గుర్తింపు ఉండాలి**

**విధివిధానాలపై లోతైన చర్చ అవసరం**

**తెలంగాణ మీడియా అకాడమీ**

**రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తల అభిప్రాయం**




విశ్వంభర, హైదరాబాద్ :యూట్యూబ్ న్యూస్ ఛానల్స్ గుర్తింపు, అక్రిడిటేషన్ల జారీ, నియమ నిబంధనలు, అనుసరించాల్సిన విధివి ధానాలపై, తెలంగాణ మీడియా అకాడమీ సోమవారం హోటల్ టూరిజం ప్లాజాలో చైర్మన్ కే. శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న పత్రికల సంపాదకులు, సీనియర్ జర్నలిస్టులు, యూట్యూబ్ ఛానెల్స్ నిర్వాహకులు పలు సూచనలు చేశారు. పత్రికలకు ఆర్ఎన్ఐ రిజిస్ట్రేషన్, టీవీ చానల్స్ కు మినిస్ట్రీ ఆఫ్ ఇన్ఫర్మేషన్ & బ్రాడ్కాస్టింగ్ గుర్తింపు, కంపెనీ ఆక్ట్ కింద నమోదు కావటం యూట్యూబ్ న్యూస్ చానెల్స్ కి కూడా అవసరమని అభిప్రాయపడ్డారు. న్యూస్ వెబ్సైట్లకి కూడా అలాంటి నియమనిబంధనలే ఉన్నాయన్నది గుర్తు చేశారు. యూట్యూబ్ ఛానల్స్ గుర్తింపుకు అనుసరించాల్సిన అంశాలపై ఈ కార్యక్రమంలో సుదీర్ఘ చర్చ జరిగింది. ఈ విషయాలు కేంద్ర ప్రభుత్వం పరిధిలోని అంశాలు అయినందున వాటిని అమలుపర్చాల్సిన కర్తవ్యం యూట్యూబ్ చానెల్స్ పై ఉందని సమావేశం అభిప్రాయబడింది. ఇలాంటి కార్యక్రమాల నిర్వహణలో ఇది మొదటిదని మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఈ అంశం పై ఇంకా లోతైన చర్చ జరగాల్సి ఉందన్నారు. భావస్వేచ్ఛకు ఉన్న పరిమితులకు లోబడి, జర్నలిజం వృత్తికి అనుగుణంగా, ఎప్పటికప్పుడు వార్తలు, చర్చా గోష్ఠిలు, ఇంటర్వ్యూలు, ప్రత్యేక కథనాలు ప్రసారం చేస్తున్న యూట్యూబ్ సంస్థలను మాత్రమే మీడియా సంస్థలుగా గుర్తించవచ్చనే అభిప్రాయం వ్యక్తం అయ్యింది. సబ్ స్కయిబర్స్, వ్యూస్ ని ప్రధాన నియమావళి తీసుకోరాదని అభిప్రాయం వ్యక్తం చేసింది. ఎలాంటి చట్టబద్ధత లేకుండా యూట్యూబ్ ప్లాట్ ఫామ్ లు సృష్టించి, హద్దు అదుపు లేకుండా చెలామణి అవుతున్న వారికి గుర్తింపు ఇవ్వడం ద్వారా మీడియా వ్యవస్థకు మచ్చ కలుగుతుందని, ఇందుకుగాను సంస్థ రిజిస్ట్రేషన్, లేబర్ లైసెన్స్, పోస్టల్ లైసెన్స్, ట్రేడ్ మార్క్ లైసెన్స్, జిఎస్టీ రిజిస్ట్రేషన్, కార్యాలయ నిర్వహణ తీరు, సిబ్బంది తదితర అంశాలను పరిశీలించాలనే అభిప్రాయం వ్యక్తం అయ్యింది. యూట్యూబర్స్ చేస్తున్న ప్రసారాలు జర్నలిజం నైతిక ప్రమాణాలకు కట్టుబడి ఉండాల్సిన అవసరం ఉంటుందనే అభిప్రాయం వ్యక్తం అయ్యింది.ఈకార్యక్రమంలో సియాసత్ మేనేజింగ్ ఎడిటర్, ఎమ్మెల్సీ ఆమెరలి ఖాన్, ఆంధ్రజ్యోతి ఎడిటర్ కే. శ్రీనివాస్ , ముఖ్యమంత్రి సి పి ఆర్ ఓ, అయోధ్య రెడ్డి, మీడియా అకాడమీ పూర్వాధ్యక్షులు అల్లం నారాయణ, ప్రముఖ జర్నలిస్టులు దిలీప్ రెడ్డి, కట్టా శేఖర్ రెడ్డి, పద్మజా షా, ఎం. ఏ. మాజీద్, కరుణాకర్ దేశాయ్, జర్నలిస్ట్ నాయకులు విరహత్ అలీ, సోమయ్య, పలు యూట్యూబ్ ఛానల్ల ప్రతినిధులు, సమాచార శాఖ జాయింట్ డైరెక్టర్ జగన్, మీడియా అకాడమీ సెక్రటరీ వెంకటేశ్వరరావు, సమావేశంలో పాల్గొన్నారు.

# ప్రజావాణికి 149 దరఖాస్తులు

- ఓపెన్ స్కూల్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు చేయాలి
- రాష్ట్ర మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి అధికారుల సమీక్షకు నివేదికలు సిద్ధం చేయాలి



**విశ్వంభర, సూర్యాపేట:** ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసమే ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు. సోమవారం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో వివిధ ప్రాంతాలకు చెందిన 149 మంది దరఖాస్తు చేసుకున్నారని కలెక్టర్ తెలిపారు. ప్రజావాణి దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. భూ సమస్యలకు 45 తాసిల్దార్లకు 16 ఆర్డీవో 7 దరఖాస్తులు, మున్సిపల్ కమిషనర్లకు 7 దరఖాస్తులు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారికి 11 దరఖాస్తులు, జిల్లా పంచాయతీరాజ్ అధికారికి 12 దరఖాస్తులు, పీడీ మెప్మా 8 దరఖాస్తులు, ఇతర శాఖలకు 43 దరఖాస్తులు వచ్చాయని కలెక్టర్ తెలిపారు. సంబంధించిన అధికారులు దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి సారించి త్వరగా పరిష్కరించాలని సూచించారు. వచ్చేనెల 3 అక్టోబర్ 2024 నుండి 9 అక్టోబర్ 2024 తారీకు వరకు జరగనున్న ఓపెన్ స్కూల్ 10వ తరగతి ఇంటర్ పరీక్షలకు అన్ని ఏర్పాటు చేయాలని జిల్లాలో మొత్తం 355 మంది విద్యార్థులు పరీక్షలు హాజరవుతున్నారని కలెక్టర్ తెలిపారు. మంగళవారం సాయంత్రం 6 గంటలకు రాష్ట్ర నీటిపారుదల శాఖ, పౌరసరఫరాల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి కలెక్టరేట్ నందు సమావేశం కలదు. కావున కలెక్టరేట్ కార్యాలయంలో అన్ని ఏర్పాట్లు చేయాలని సమావేశానికి అధికారులందరూ తమ పూర్తి నివేదికను సిద్ధం చేసుకొని రావాలని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఎఫ్ఓ సతీష్ కుమార్ డి ఆర్ డి ఓ వీవి అప్పారావు సిపిఓ ఎల్ కిషన్ అన్ని శాఖలకు చెందిన అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## పోషణ మాసం వారోత్సవాలలో సీడీపీఓ శాంతి రేఖ



**విశ్వంభర, తలకొండపల్లి:** ఆమనగల్ ప్రాజెక్ట్ తలకొండపల్లి మండలం వెల్జాల్ సెక్టార్ లోని 3 వ అంగన్వాడి కేంద్రంలో పోషకార వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీడీపీఓ శాంతిరేఖ విచ్చేసి మాట్లాడుతూ పిల్లలకు పోషకాలతో కూడిన ఆహారం అందించడంతో పాటు చదువు చెబుతామని చెప్పారు. అంగన్వాడీ కేంద్రాలు 1,2,3, లో సోమవారం పోషణ మాసం నిర్వహించారు. ఈ సందర్భంగా పౌష్టికాహారంలో లభించే కూరగాయలు ఆకుకూరలు ప్రదర్శించారు. వాటిగురించి వివరించారు. పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని చెప్పారు. గర్భిణీలు బాలింతలు చిన్న పిల్లలు కిషోర్ బాలికలు సమతుల్య ఆహారం తీసుకోవాలని సీడీపీఓ సూచించారు. కార్యక్రమంలో వెల్జాల్ గ్రామ స్పెషల్ ఆఫీసర్ ఎంపిఓ రఘు, సూపర్వైజర్ తిరుమల, డాక్టర్ సైదమ్మ, హెచ్ ఈ ఓ ఆంజనేయులు, సెక్రెటరీ ఎం. శరత్, అంగన్వాడీ టీచర్లు నస్రీన్ బేగం, వసంతలక్ష్మి, భూషణమ్మ, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, తల్లులు, గర్భిణీలు పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

**విశ్వంభర, తలకొండపల్లి:** తలకొండపల్లి మండలం మాదాయ పల్లి గ్రామంలో సోమవారం ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ తలకొండపల్లి మాజీ జెడ్పిటిసి శ్రీ ఉప్పల వెంకటేష్ ఉచిత వైద్య ఆరోగ్య శిబిరం ఏర్పాటు చేశారు. సీజనల్ వ్యాధులు వాపించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. డాక్టర్ అఖిల్ డాక్టర్ అనిల్ మరియు కామినేని హాస్పిటల్ ఆధ్వర్యంలో 225 మందికి డెంగ్యూ మలేరియా టైఫాయిడ్, బిపి, షుగర్, జలుబు, దగ్గు, వైరల్ ఫీవర్ వంటి వ్యాధుల బారిన పడిన వారికి మందులు అందజేసీ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు తెలిపారు.

## శిథిలావస్థలో పాఠశాల తరగతి గదులు

**నూతన పాఠశాల భవనం కోసం మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్‌కు విజ్ఞప్తి**



**విశ్వంభర, కుత్బుల్లాపూర్:** కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని రంగారెడ్డి నగర్ 127డివిజన్ లోని గిరినగర్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుల బృందం మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ తో మొరపెట్టుకున్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పాఠశాల భవనం పూర్తిగా దెబ్బతిందనిపాఠశాల గదులు శిథిలావస్థకు చేరాయని ఏ క్షణంలో అయిన కూలిపోయే ప్రమాదం ఉందని పాఠశాల ఉపాధ్యాయులు కూన శ్రీశైలం గౌడ్ కు వివరించారు. గత పదేళ్ల నుండి ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా బీఆర్ఎస్ ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. పాఠశాల పై కప్పు నుండి నీరు కారుతుందని... చిన్నపాటి వర్షాలకు కూడా వర్షపు నీరు తరగతి గదుల్లోకి వచ్చి చేరుతున్నాయని తెలిపారు. పాఠశాల ప్రాంగణమంత నీటితో , గదులంతా బురదతో నిండిపోతుందని అన్నారు. దాంతో పిల్లలు కింద పడి గాయాల పాలవుతున్నారని వర్షపు నీటిలో ఎక్కువసేపు ఉండటం వల్ల విద్యార్థులు అనారోగ్యానికి గురి అవుతున్నారని కూన శ్రీశైలం గౌడ్ గారి దృష్టికి తీసుకువచ్చారు. భవనం ఎప్పుడు కూలుతుందో తెలియక ప్రాణాలు అరి చేతుల్లో పెట్టుకొని విద్య బోధన చేయాల్సిన దుస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే స్పందించిన శ్రీశైలం గౌడ్ ఈ సమస్యపై ఎంఈఓ తో మాట్లాడి త్వరితగతిన నూతన భవనం నిర్మాణం అయ్యేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం విజయ ప్రకాష్, రిటైర్డ్ హెచ్ఎం అఫ్జల్, పాఠశాల కమిటీ చైర్మన్ శ్యామల, మోతే శ్రీనివాస్, సాయి కుమారి, వసుంధర, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

## కూతురు అంటే కుటుంబంలో బంగారు తల్లి

**కుమార్తెల దినోత్సవం శుభాకాంక్షలు గీతా మాధురి**



**విశ్వంభర, మహేశ్వరం:** పురాతన కాలం నుంచి అబ్బాయి పుడితే ఒకలాగా అమ్మాయి పుడితే మరో లాగా చూసే అలవాటు మనదేశంలో ఉంది. ఇప్పటికీ కొడుకులను ఎక్కువ చేసి మాట్లాడే సాంప్రదాయం కొనసాగు తుంది. కానీ ఈ తరం ఆడపిల్లలు మేమేమి తక్కువ కాదని కొడుకులతో సమానమే నని, ఏ రంగం లోనైనా వెనకాడబో మని, ఆడపిల్లలు నిరూపిస్తున్నారు. అటు ఇటు అన్నింటా నువ్వే జగమంతా వెలుగులు పూస్తావు వెళ్లే దారంతా' అంటూ ఓ సినీ గేయ రచయిత స్త్రీ గొప్పతనాన్ని పాటలో వివరించారు. అందుకే మహిళలు అడుగిడని రంగం లేదు. సాధించని కొలువు లేదు. అటు జన్మనిచ్చినవారి కలలను, ఇటు తమ లక్ష్యాలను సాధించుకుంటూ వన్నె తెస్తున్నారు. ఆడపి ల్లలు కుమార్తెల దినోత్సవం నిర్వహిస్తున్నారు. భారత దేశంలో ఆడపిల్లల పట్ల సమాజ వైఖరిలో మార్పు తీసుకురావడానికి కూతుర్ల దినోత్సవన్ని మనం ఘనంగా నిర్వహించుకుందాం.

# భారత్‌లో మంకీపాక్స్

## మరో కేసు నమోదు కేరళలో గుర్తింపు

**ఢిల్లీ:** ప్రాణాంతక మంకీపాక్స్‌కు సంబంధించి భారత్‌లో మరో కేసు నమోదైనట్లు సమాచారం. హెల్త్? ఎమర్జెన్సీకి దారితీసిన 'క్లేడ్ 1బీ' స్ట్రెయిన్‌గా దీన్ని గుర్తించారు. కేరళకు చెందిన యువకుడిలో గతవారం ఈ వ్యాధి నిర్ధరణ అయినట్లు కేంద్ర ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి.కేరళలోని మలప్పురానికి చెందిన 38 ఏళ్ల వ్యక్తి UAE నుంచి ఇటీవల ఇండియాకు వచ్చాడు. అతడిలో ఎంపాక్స్ లక్షణాలు కనిపించాయి. దీంతో వైద్య పరీక్షలు నిర్వహించగా క్లేడ్ 1గా నిర్ధరణ అయ్యింది. ప్రపంచ 'హెల్త్ ఎమర్జెన్సీ'కి దారితీసిన 'క్లేడ్ 1బీ' స్ట్రెయిన్‌గా దీన్ని గుర్తించారు. అయితే, ప్రస్తుతం అతడి ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉన్నట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. 2022లో ప్రపంచ ఆరోగ్య సంస్థ పబ్లిక్ హెల్త్ ఎమర్జెన్సీగా ప్రకటించినప్పటి నుంచి భారత్?లో 30కేసులు నమోదయ్యాయి. **కోలుకున్న 'క్లేడ్ 2' బాధితుడు:** ఇండియాలో సెప్టెంబర్ 9న మొదటి మంకీపాక్స్ కేసు నమోదైంది. ఫారిన్ నుంచి వచ్చిన ఓ వ్యక్తి నమూనాలు పరీక్షించారు. అది పశ్చిమ ఆఫ్రికాలో వ్యాప్తిలో ఉన్న క్లేడ్-2 స్ట్రెయిన్?గా నిర్ధరించారు. కాగా, దాని తీవ్రత తక్కువగా ఉన్నట్లు అప్పుడు వైద్యులు పేర్కొన్నారు. దాదాపు రెండు వారాల పాటు దిల్లీలోని ఎల్ఎన్‌జేపీ ఆసుపత్రిలో బాధితుడికి చికిత్స అందించారు. అనంతరం అతడిని సెప్టెంబర్ 21న డిశ్చార్జి చేసినట్లు అధికారులు తెలిపారు. **లక్షణాలుంటే మాకు చెప్పండి : కేరళ ఆరోగ్య శాఖ మంత్రి:** దేశంలో రెండో కేసు నమోదైన నేపథ్యంలో, ఏవైనా లక్షణాలతో విదేశాల నుంచి భారత్?కు వచ్చే వారు ఆరోగ్య శాఖకు తెలియజేయాలని కేరళ ఆరోగ్య శాఖ మంత్రి వీణ జార్జ్? సూచించారు. తద్వారా వీలైనంత త్వరగా చికిత్స పొందాలని విజ్ఞప్తి చేశారు. ఇక, ఈ వ్యాధి సోకిన వారికి రాష్ట్రంలో వివిధ జిల్లాల్లో చికిత్స, ఐసోలేషన్ ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ప్రాణాంతక మంకీపాక్స్- డెన్మార్క్‌లో పరిశోధన కోసం తెప్పించిన కోతుల్లో 1958లో మొదటి సారి వెలుగు చూసింది. అనంతరం 1970లో మానవుల్లో గుర్తించారు. 2005లో కాంగోలో వేల సంఖ్యలో ఈ కేసులు నమోదుకాగా 2017 తర్వాత నైజీరియా సహా అనేక దేశాలకు వ్యాపించింది. 2022 నుంచి మళ్లీ విస్తృతంగా వ్యాప్తి చెందుతూ దాదాపు 120 దేశాలకు పాకింది. సుమారు లక్ష కేసులు నిర్ధరణ అయితే తాజాగా కాంగోలో ఆందోళనకర స్థాయిలో ఈ వైరస్ వ్యాపిస్తోంది.

# కాంగ్రెస్ పార్టీ దళిత వ్యతిరేకి

**రిజర్వేషన్లను రక్షించగల ఏకైక వ్యక్తి మోదీనే**

**హరియాణా ఎన్నికల ప్రచారంలో అమిత్‌షా**

**ఢిల్లీ:** కాంగ్రెస్ పార్టీ దళిత వ్యతిరేకి అని, కుమారి సెల్జా వంటి పలువురు నేతలను అవమానించిందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఆరోపించారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్నంత వరకు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌కు భారతరత్న ఇవ్వలేదని అన్నారు. తాము ఆయనను గౌరవించేందుకు పంచతీర్థాన్ని స్థాపించామని, సంవిధాన్ దివస్ ప్రకటించామని తెలిపారు. హరియాణా అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో తోహాణాలో సోమవారం నిర్వహించిన ప్రచారంలో పాల్గొన్న షా, కాంగ్రెస్ పార్టీపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. రిజర్వేషన్లపై ఆ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలను తప్పుపట్టారు."రాహుల్ బాబా.. మీరేం మాట్లాడుతున్నారు? సిక్కు సమాజాన్ని అగౌరవపరిచిన చరిత్ర మీకు ఉంది. మీ ప్రభుత్వ హయాంలో జరిగిన దిల్లీ అల్లర్లలో వేలాది మంది సిక్కులు రోడ్లపై హత్యకు గురయ్యారు. పిల్లలు, మహిళలను కూడా విడిచిపెట్టలేదు. మీరు ఏదైనా చేయాలనుకుంటే తలపాగా ధరించి గురుద్వారాకు వెళ్లి సిక్కు సోదరులకు క్షమాపణ చెప్పండి. అగ్నివీర్ గురించి రాహుల్ బాబా యువకులను తప్పుదారి పట్టిస్తున్నారు" అని అమిత్ షా ఆరోపించారు. హరియాణాలో కాంగ్రెస్ అధికారంలోకి రావా లని దిల్లీ మధ్యవర్తులు ఎదురుచూస్తున్నారని ఎద్దేవా చేశారు. అందుకే రాష్ట్రాన్ని మధ్యవర్తుల చేతుల్లో పెట్టాలనుకుంటున్నారా అని ప్రజలను ప్రశ్నించారు అమిత్ షా. కాగా, 90 మంది సభ్యులు ఉన్న హరియాణా అసెంబ్లీకి అక్టోబర్ 5న ఎన్నికలు జరగనున్నాయి. అక్టోబర్ 8న ఫలితాలు వెలువడతాయి. 2019 అసెంబ్లీ ఎన్నికల్లో 40 సీట్లను బీజేపీ కైవసం చేసుకుంది. దుష్యంత్ సింగ్ చౌతాలా నేతృత్వంలోని జననాయక జనతా పార్టీ (జేజేపీ)తో పొత్తు పెట్టుకుని ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. ఇప్పుడు హ్యాట్రిక్ విజయంపై కన్నేసింది. మరోవైపు ప్రతిపక్ష కాంగ్రెస్, పదేళ్లుగా అధికారంలో ఉన్న బీజేపీని ఓడించి ఈసారి ఎలాగైనా గద్దెనెక్కాలని గట్టి పట్టుదలతో ఉంది.

## కలెక్టర్‌కు వినతి పత్రం అందజేసిన ఆర్యవైశ్య సంఘం



**విశ్వంభర, పరిగి:** తెలుగు విశ్వవిద్యాలయం కు పొట్టి శ్రీరాములు పేరు మార్చుటకు తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ఆర్యవైశ్య మహాసభ సభ్యులు సోమవారం వికారాబాదు జిల్లా కలెక్టర్ ప్రదీక్ జైన్ కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య జిల్లా మహాసభ రాజకీయ కో కన్వీనర్ పెట్టయ్య గుప్తా మాట్లాడుతూ భాషా ప్రాతిపదికన రాష్ట్రాల ఏర్పాటు కోసం 56 రోజులు దీక్ష చేసి తెలుగు మాట్లాడే ప్రజలందరి కోసం తెలుగు రాష్ట్రం ఏర్పాటుకు కృషి చేసిన వ్యక్తి పొట్టి శ్రీరాములు అని అన్నారు. కాంగ్రెస్ పార్టీ క్యాబినెట్ మీటింగ్‌లో పొట్టి శ్రీరాములు పేరును మారుస్తూ నిర్ణయం తీసుకోవడానికి తీవ్రంగా ఖండిస్తున్నాం అన్నారు. తెలుగు యూనివర్సిటీ కి పొట్టి శ్రీరాములు పేరును మార్చినట్లయితే ఆర్యవైశ్యుల కోపాగ్నికి ప్రభుత్వం గురికాక తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం సభ్యులు బలేష్ గుప్తా, రమేష్ గుప్తా, మధుసూదన్ గుప్తా, ఆకారం రాజు, శ్రీనివాస్ గుప్తా, కిరణ్ గుప్తా, బాలరాజ్ గుప్తా, విజయ్ గుప్తా, వేణు గుప్తా, పాల్గొన్నారు.

## ఆపద్బంధు ముఖ్యమంత్రి సహాయ నిధి



**విశ్వంభర, కుత్బుల్లాపూర్:** కుత్బుల్లాపూర్ నియోజక వర్గం 125 - గాజులరామారం డివిజన్ నెహ్రూ నగర్ కు చెందిన యు. సోమిరెడ్డి గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. స్థానిక నాయకుల ద్వారా సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ చలించి ముఖ్యమంత్రి సహాయ నిధి క్రింద 1,10,000/- రూపాయలను మంజూరు చేయించి సోమవారం ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ సోమిరెడ్డి కుటుంబ సభ్యులకు చెక్కును అందజేశారు.

## చెవుడు ఉన్న రోగులకు పీ హెచ్ సి లో చికిత్స

**విశ్వంభర, ఆమనగల్లు:** స్వచ్ఛత హి సేవా కార్యక్రమాల్లో భాగంగా ఆమనగల్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఇంటర్నేషనల్ వీక్ ఆఫ్ డెఫ్ పీపుల్ సెప్టెంబర్ 23 నుండి 29 వరకు వారోత్సవాల సందర్భంగా వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. అలాగే వినికిడి లోపం మరియు చెవుడు గురించి అవగాహన కల్పించేందుకు మండల స్థాయి మరియు కమ్యూనిటీ స్థాయి లో చికిత్స కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపాలిటీ సిబ్బంది కి రోగులకు వైద్య పరీక్షలు చేశారు. సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ, కుసుమ మాధురి ఎంపీఓ సుజాత, ఆసుపత్రి వైద్యులు పరీక్షిత్, నాగరాజు, తిరుపతి రెడ్డి మరియు వైద్య సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## ఇరానీ కప్‌లో అయ్యర్, శార్ధూల్..
## ముంబై కెప్టెన్సీ మళ్లీ అజింక్యా రహానేకే



**దిల్లీ :** దులీప్ ట్రోఫీలో ఎట్టకేలకు ఓ అర్థ శతకంతో మెరిసిన శ్రేయస్ అయ్యర్ టెస్టు జట్టులోకి రావడం మరింత ఆలస్యం కానుంది. చెపాక్‌లో బంగ్లాదేశ్‌పై భారీ విజయం అనంతరం బీసీసీఐ రెండో టెస్టుకు కూడా అదే స్క్వాడ్‌ను ప్రకటించింది. దాంతో, పునరామనంపై ఆశలు పెట్టుకున్న అయ్యర్ మరోమారు ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో ఆడేందుకు సిద్ధమయ్యాడు. దులీప్ ట్రోఫీలో ఇండియా డీ తరఫున ఆడిన అతడు అక్టోబర్ 1న జరుగబోయే ఇరానీ కప్‌లో ముంబై తరఫున బరిలోకి దిగనున్నాడు.మోకాలి గాయం నుంచి కోలుకున్న ఆల్‌రౌండర్ శార్ధూల్ ఠాకూర్ కూడా ఇరానీ కప్ మ్యాచ్‌కు అందుబాటులో ఉంటున్నాడు. రంజీలో ముంబైని విజేతగా నిలిపిన వెటరన్ ఆటగాడు అజింక్యా రహానే ఈ టోర్నీలోనూ సారథిగా వ్యవహరించనున్నాడని సమాచారం. అక్టోబర్ 1 నుంచి 5 మధ్య జరిగే ఇరానీ కప్‌లో రెస్ట్ ఆఫ్ ఇండియాతో రహానే బృందం తలపడనుంది. లక్నో లోని ఏక్‌నా స్టేడియం ఈ మ్యాచ్‌కు వేదిక కానుంది. అయితే.. ముంబై క్రికెట్ అసోసియేషన్ ఇప్పటికైతే అధికారికంగా స్క్వాడ్‌ను ప్రకటించలేదు. టోర్నీకి ఇంకా ఏడు రోజులే ఉండడంతో ఈ వారంలో ఎంసీఏ ముంబై స్క్వాడ్‌ను ఎంపిక చేసే అవకాశముంది.

రాహుల్ విఫలమైతే..

రంజీల్లో ఆడేందుకు సాకులు చెప్పి సెంట్రల్ కాంట్రాక్ట్ కోల్పోయిన శ్రేయస్ అయ్యర్ ఫస్ట్ క్లాస్ మ్యాచ్‌లపై ఫోకస్ పెట్టాడు. దులీప్ ట్రోఫీలో డీ జట్టు సారథిగా తొలి రౌండ్‌లో డకౌట్‌లతో నిరాశపరిచాడు. అయితే.. రెండో రౌండ్‌లో తొలి ఇన్నింగ్స్‌లో సున్నాకే ఔటైనా.. రెండో ఇన్నింగ్స్‌లో యాభైతో మెరిశాడు.టెస్టుల్లో పునరాగమనం కోసం వేచి చూస్తున్న అయ్యర్‌కు ఇరానీ కప్ అతడికి సువర్ణావకాశం కానుంది. ఎందుకంటే.. బంగ్లాదేశ్‌పై తొలి టెస్టులో కేఎల్ రాహుల్ విఫలమయ్యాడు. కాన్పూర్ టెస్టులోనూ రాహుల్ తడబడితే.. సెలెక్టర్లు అయ్యర్ పేరును పరిశీలించే అవకాశముంది.

## రాహుల్‌ను బ్యాటింగ్ చేయనిస్తే బాగుండేది

**ఆకాశ్ చోప్రా**



**దిల్లీ:** బంగ్లాదేశ్తో జరిగిన తొలి టెస్టు మ్యాచ్లో మిడిల్ ఆర్డర్ బ్యాటర్ కేఎల్ రాహుల్ కుదురుకునేందుకు కొంత సమయం ఇస్తే బాగుండేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మాజీ క్రికెటర్ ఆకాశ్ చోప్రా మాట్లాడుతూ అతడు ఆడుతున్న సమయంలో రోహిత్ ఇన్నింగ్స్ డిక్లేర్ చేసి ఉండాల్సింది కాదని అభిప్రాయపడ్డాడు.

"ఇంకా రోజున్నర సమయం మిగిలింది. మనం 280 పరుగుల విజయాన్ని అందుకున్నాం. అలాగని ఫాలోఆన్ కూడా ఆడించలేదు. సమయాభావమూ లేదు. వర్షం వచ్చే ముప్పు కనిపించలేదు. కేఎల్ రాహుల్ను 6070 పరుగులు చేయనిస్తే బాగుండేది. ఆప్షన్లు అందుబాటులో ఉన్నప్పుడు మీరు అతడికి ఒక ఛాన్స్ ఇస్తే బాగుండేది. ఎందుకంటే అదేమీ మొత్తం మ్యాచ్పై ప్రభావం చూపదు. మీ వర్క్‌లోడ్ మేనేజ్మెంట్పై కూడా ఎటు ప్రభావం ఉండదు. అలాంటి సమయంలో 19 బంతులకు 22 పరుగులు చేసి దూకుడు మీదున్న ఆటగాడిని కొద్ది సేపు ఆడించాల్సింది" అని చోప్రా పేర్కొన్నాడు.

ఇక పంత్ ఆటతీరును చోప్రా పొగడ్తలతో ముంచెత్తాడు. విదేశాల్లో ఆ యువ కీపర్ ఆటతీరు మిగిలిన వారి కంటే మెరుగ్గా ఉంటుందని అభిప్రాయపడ్డాడు. కాకపోతే భారత్లో అతడే అత్యుత్తమ టెస్టు బ్యాటర్ అనే విషయాన్ని కచ్చితంగా చెప్పలేనన్నాడు. భవిష్యత్తులో మాత్రం అత్యుత్తమ బ్యాటర్ అయ్యే అవకాశాలున్నాయని చెప్పాడు. "అతడు ఇప్పటికి కేవలం 58ఇన్నింగ్స్లు మాత్రమే ఆడి.. ఆరు శతకాలు సాధించాడు" అని వ్యాఖ్యానించాడు. అదే సమయంలోఈ జాబితాలో ధోనీ పేరు కూడా ఉంటుందని పేర్కొన్నాడు.

# భారత జట్టు అరుదైన ఘనత

- సుదీర్ఘ ఫార్మాట్‌లో అత్యధిక విజయాలు సాధించిన జట్టుగా రికార్డు
- దేశం తరఫున అత్యధిక టెస్టు విజయాలు సాధించిన ఆటగాళ్ల జాబితాలో టాప్‌లో ఈ ముగ్గురే..!



**విశ్వంభర(క్రీడావిభాగం):** సుదీర్ఘ ఫార్మాట్‌లో భారత జట్టు అరుదైన ఘనత సాధించింది. చెపాక్ స్టేడియంలో బంగ్లాదేశ్‌ను మట్టికరిపించి అత్యధికంగా 179 విజయాలతో అదరహో అనిపించింది. 280 పరుగుల భారీ తేడాతో గెలుపొందిన రోహిత్ శర్మ బృందం ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ పట్టికలో అగ్రస్థానం కాపాడుకుంది. మరో విషయం ఏంటంటే.. ప్రస్తుతం జట్టులో ఉన్న విరాట్ కోహ్లీ , ఆఫ్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్‌లు దేశం తరఫున ఎక్కువ టెస్టు విజయాలు సాధించిన ఆటగాళ్ల జాబితాలో చోటు సంపాదించారు.

భారత జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తూ అత్యధిక టెస్టు విజయాల్లో భాగమైనవాళ్లలో కోహ్లీ, అశ్విన్‌లది రెండో స్థానం. వీళ్లిద్దరూ 60 మ్యాచుల్లో విజయాన్ని చవి చూశారు. ఇక ఈ జాబితాలో టాప్‌లో ఉన్నది ఎవరంటే.. దిగ్గజ ఆటగాడు సచిన్ టెండూల్కర్ . తన బ్యాటింగ్ విన్యాసాలతో ఫ్యాన్స్‌ను అలరించిన సచిన్ టీమిండియా గెలుపొందిన 72 టెస్టుల్లో సభ్యుడు. నయావాల్‌గా పేరొందని ఛతేశ్వర్ పూజారా 58 విజయాల్లో భాగం కాగా.. వాల్‌గా కీర్తి గడించిన రాహుల్ ద్రవిడ్ (56 విక్టరీలు) నాలుగో స్థానంలో ఉన్నాడు. పేసర్ ఇషాంత్ శర్మ 48, మాజీ సొగసరి ఆటగాడు వీవీఎస్ లక్ష్మణ్ 47 టెస్టు విజయాల్లో భాగమయ్యారు.

**టెస్టుల్లో 179 విజయాలు..**

చెపాక్‌లో బంగ్లాదేశ్‌పై భారీ తేడాతో గెలుపొందిన భారత జట్టు అంతర్జాతీయ క్రికెట్‌లో అరుదైన ఘనతను సొంతం చేసుకుంది. సుదీర్ఘ ఫార్మాట్‌లో అత్యధిక విజయాలతో చరిత్ర సృష్టించింది. 92 ఏండ్ల భారత టెస్టు క్రికెట్ చరిత్రలో 580 టెస్టులు ఆడిన టీమిండియా తొలిసారి ఓటముల కంటే విజయాల సంఖ్య పెరిగింది. 580 టెస్టుల్లో 179 విజయాలు సాధించగా.. 178 ఓటములు ఎదురయ్యాయి. 222 మ్యాచ్‌లు డ్రా కాగా ఒక మ్యాచ్ టై అయింది. ప్రపంచ టెస్టు క్రికెట్‌లోఅపజయాల కంటే విజయాలు సంఖ్య ఎక్కువ ఉన్న దేశాలలో భారత్‌ది నాలుగో స్థానం.

## బుమ్రా.. దేవుడు చేసిన అద్భుతం

- యువపేసర్ ఆకాశ్ దీప్ వ్యాఖ్యలు



**విశ్వంభర (క్రీడావిభాగం):** అంతర్జాతీయ క్రికెట్‌లో టీమిండియా విజయాల్లో ఒకప్పుడు బ్యాటర్ల వాటానే సింహభాగం ఉండేది. కానీ ఇప్పుడు ట్రెండ్ మారింది. బౌలర్లు సైతం మేము కూడా జట్టును గెలిపించగలం అని చాటుతున్నారు. అందుకు.. పేసర్ జస్ప్రీత్ బుమ్రానే పెద్ద ఉదాహరణ. గత కొంతకాలంగా అతడు భారత జట్టుకు కొండంత భరోసా ఇస్తున్నాడు. మొన్న టీ20 వరల్డ్ కప్‌లో సంచలన ప్రదర్శనతో జట్టును విజేతగా నిలిపిన యార్కర్ కింగ్.. తాజాగా చెపాక్ స్టేడియంలో బంగ్లాదేశ్ నడ్డి విరిచాడు.మ్యాచ్ విన్నర్‌గా పేరొందిన బుమ్రా ఈతరంలో తనకు సాటి ఇంకొకరు లేరని చాటాడు. తొలి టెస్టులో అద్భుత బౌలింగ్‌తో అదరగొట్టిన బుమ్రాపై యువపేసర్ ఆకాశ్ దీప్ సంచలన వ్యాఖ్యలు చేశాడు. 'దేవుడు బుమ్రాను ప్రత్యేకంగా తయారు చేశాడని ఆకాశ్ అన్నాడు.'నేను తరచుగా బుమ్రాతో మాట్లాడుతా. అతడి బౌలింగ్‌ను గమనిస్తుంటా. అతడు చాలా ప్రత్యేకం. అతడిని దేవుడు విభిన్నంగా తయారుచేశాడు. అతడి నుంచి నేను చాలా సలహాలు తీసుకుంటా. ఓ బౌలర్‌గా అతడిని చూసి చాలా నేర్చుకున్నా కూడా. అంతేకాదు ఓసారి బుమ్రాతో ఫలానా బ్యాటర్‌కు బౌలింగ్ చేసేటప్పుడు మైండ్‌సెట్ ఎలా ఉండాలి? అని అడిగాను . అందుకు బుమ్రా విలువైన సలహాతో నా సందేహాన్ని తీర్చాడు' అని ఆకాశ్ దీప్ వెల్లడించాడు. అంతేకాదు బుమ్రా ఓ గిఫ్టెడ్ బౌలర్. అతడి అడుగుజాడల్లో నడవడం కూడా పెద్ద టాస్క్ అని ఈ బెంగాల్ పేసర్ అన్నాడు.

చెపాక్ స్టేడియంలో బంగ్లాదేశ్‌తో జరిగిన తొలి టెస్టులో బుమ్రా తన పేస్ పవర్ చూపించాడు. తొలి ఇన్నింగ్స్‌లో రవిచంద్రన్ అశ్విన్(113) సూపర్ సెంచరీ అనంతరం ఈ యార్కర్ కింగ్ నిప్పులు చెరిగాడు. బంగ్లా టాపార్డర్‌ను కూల్చి 4 వికెట్లతో పర్యాటక జట్టును కోలుకోలేని దెబ్బకొట్టాడు. ఆకాశ్ దీప్ కూడా దులీప్ ట్రోఫీ ఫామ్‌ను కొనసాగిస్తూ ఒకే ఓవర్లో వరుసగా రెండు వికెట్లో ఔరా అనిపించాడు. దాంతో, భారత్‌కు భారీ ఆధిక్యం లభించింది. ఇక శుభ్‌మన్ గిల్(119 నాటౌట్), రిషభ్ పంత్(109)ల శతక గర్జనకు అశ్విన్ (688) మాయాజాలం తోడవ్వడంతో టీమిండియా 280 పరుగుల తేడాతో జయభేరి మోగించింది.

## అందుకే జడేజా అంటే అసూయ'..
### అశ్విన్ కామెంట్ వైరల్



**దిల్లీ:** సొంతగడ్డపై భారత జట్టు టెస్టు మ్యాచ్ ఆడుతుందంటే ఆ ఇద్దరూ జట్టులో ఉండాల్సిందే. రికార్డులు, గణాంకాలు.. ఏ పరంగా చూసినా సరే వాళ్లలో ఒక్కరినీ తీసెయ్యడానికి వీల్లేదు. ఇప్పటికే మీకు అర్థమై ఉండి ఉంటుంది ఆ జోడీ ఎవరనేది. అవును.. ఆ ఇద్దరూ రవిచంద్రన్ అశ్విన్ , రవీంద్ర జడేజాలే. చెపాక్ టెస్టు బంగ్లాదేశ్‌పై అశూ, జడ్డూల ద్వయం చిరస్మరణీయ ఆటను అభిమానులు మర్చిపోలేరు.బ్యాటుతో, బంతితో మ్యాజిక్ చేసి స్పిన్ ఆల్‌రౌండర్లు అనే మాటకు నిలువెత్తు నిదర్శంగా మారింది ఈ స్పిన్ జోడీ. అయితే.. చెపాక్‌లో అద్భుత సెంచరీ.. ఆపై ఆరు వికెట్ల ప్రదర్శన చేసిన అశ్విన్ మ్యాచ్ అనంతరం జడేజా అంటే తనకు 'అసూయ'అని చెప్పాడు. అసలు అతడు ఎందుకలా అన్నాడంటే..?

జడేజాతో కలిసి టీమిండియా విజయాల్లో భాగమవుతున్న అశ్విన్ చెపాక్ టెస్టు తర్వాత ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. 'జడేజా రాకెట్ ఫీల్డర్. మైదానంలో రాకెట్‌లా వేగంగా కదులుతాడు. నేను అతడిలా చేయలను. అందుకనే అతడంటే నాకు అసూయ. మొత్తంగా అతడంటే విపరీతమైన అభిమానం' అని అశ్విన్ నవ్వుతూ అన్నాడు. అంతేకాదు జట్టులో చోటు కోసం జడేజాతో పోటీ గురించి కూడా అశూ భాయ్ స్పందించాడు. 'ఆటలో పోటీ అనేది సాధారణమే. అందులో భాగంగానే ఒకరినొకరు దాటేయాల్సి ఉంటుంది. ఒకవేళ జట్టులో చోటు దక్కినా కూడా మా మధ్య పోటీ ఉంటుంది' అని తేల్చేశాడు.

సూపర్ హిట్ జోడీ..

సుదీర్ఘ ఫార్మాట్‌లో అశ్విన్, జడేజాల జోడీ సూపర్ హిట్ అయింది. నిరుడు స్వదేశంలో బోర్డర్ - గవాస్కర్ ట్రోఫీ, ఆ తర్వాత ఇంగ్లండ్‌తో సిరీస్.. తాజాగా బంగ్లాదేశ్‌పై వీళ్లిద్దరూ ఆడిన తీరు అమోఘం. బంగ్లాదేశ్ బౌలర్ల ధాటికి టాపార్డర్ కుప్పకూలిన చోట అశ్విన్(113), జడేజా(86)లు ఇన్నింగ్స్ నిర్మించే బాధ్యత భుజాన వేసుకున్నారు. బంగ్లా బౌలర్లను విసిగిస్తూ.. స్కోర్‌బోర్డును పరుగులు పెట్టించారు.అశ్విన్ అయితే.. అటాకింగ్ గేమ్‌తో ప్రత్యర్థి కెప్టెన్ ఎత్తులను చిత్తు చేశాడు. బౌండరీలతో చెలరేగిన అతడు కెరీర్‌లో ఆరో టెస్టు శతకం నమోదు చేసి జట్టుకు భారీ స్కోర్ అందించాడు. అనంతరం రెండో ఇన్నింగ్స్‌లో ఆరు వికెట్లతో బంగ్లా పతనాన్ని శాసించాడు. జడ్డూ కూడా మూడు కీలక వికెట్లతో ఓ చేయి వేయగా ఇండియా 280 పరుగుల విజయం సాధించి.. రెండు టెస్టు సిరీస్‌లో 10తో ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. మైదానంలో ఆహ్లాదకరమైన పోటీని ఆస్వాదిస్తూనే.. జట్టుకు కష్టమొస్తే ఆపద్బాంధవులుగా అవతారమెత్తే అశ్విన్, జడేజాలకు టెస్టుల్లో గొప్ప రికార్డు ఉంది. వీళ్లిద్దరూ ఇప్పటివరకూ 53 టెస్టుల్లో 543 వికెట్లు పడగొట్టారు.


## రూ.లక్ష లోపు ధరకే ఐ-ఫోన్ 15 ప్రో..



**విశ్వంభర (బిజినెస్) :** ఈకామర్స్ ప్లాట్ ఫామ్ ఫ్లిప్‌కార్ట్ బిగ్ బిలియన్ డేస్ 2024 సేల్ శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నది. ఫ్లిప్ కార్ట్ ప్లస్ మెంబర్లకు 24 గంటల ముందుగా అంటే 26వ తేదీ నుంచి ఆఫర్లు అందుబాటులో ఉంటాయి. పలు బ్రాండ్ల స్మార్ట్ ఫోన్లపై భారీ డిస్కౌంట్లు అందుబాటులో ఉన్నాయి. ఆపిల్ ఐఫోన్ 15 ప్రో, ఐఫోన్ 15 ప్రో మ్యాక్స్ ఫోన్లపైనా గణనీయ డిస్కౌంట్ ఆఫర్ చేస్తోంది. సెలెక్టెడ్ బ్యాంక్ కార్డులు, ఈఎంఐ లావాదేవీలపై డిస్కౌంట్లతోపాటు అదనపు రాయితీ కూడా అందుబాటులో ఉంటుంది. అదనంగా ఎక్స్చేంజ్ ఆఫర్ కూడా ఉంది. భారత్ మార్కెట్లో ఐఫోన్ 16 వచ్చిన నేపథ్యంలో ఆపిల్ తన ఐఫోన్ 15 ప్రో, ఐఫోన్ 15 ప్రో మ్యాక్స్ ఫోన్లను డిస్ కంటిన్యూ చేయనుంది. ఈ నేపథ్యంలో ఈ రెండు ఫోన్లనూ రూ.లక్ష లోపు ధరకే అందుబాటులోకి తెస్తోంది.

ఐఫోన్ 15 ప్రో ఫోన్ 128 జీబీ స్టోరేజీ వేరియంట్ ధర రూ.1,09,900 కాగా, ఐఫోన్ 15 ప్రో మ్యాక్స్ ఫోన్ ధర రూ.1,34,900. ఫ్లిప్ కార్ట్ బిగ్ బిలియన్ డేస్ సేల్ కింద ఐఫోన్ 15 ప్రో రూ.89,999, ఐఫోన్ 15 ప్రో మ్యాక్స్ రూ.99,999లకు లభిస్తాయి. సెలెక్టెడ్ బ్యాంక్ క్రెడిట్ లేదా డెబిట్ కార్డులతోపాటు ఈఎంఐ లావాదేవీలపై క్యాష్‌బ్యాక్, ఎక్స్చేంజ్ డిస్కౌంట్లు అందిస్తున్నది ఫ్లిప్‌కార్ట్. యూపీఐ బేస్డ్ పేమెంట్ డిస్కౌంట్లు, నోకాస్ట్ ఈఎంఐ ఆప్షన్లు అందుబాటులో ఉన్నాయి. ఈ ఫోన్లు ఏ17 ప్రో చిప్ సెట్, ట్రిపుల్ రేర్ కెమెరా సెటప్ కలిగి ఉంటాయి.

## భారతీయ స్టాక్ మార్కెట్ల జైత్రయాత్ర..
### మరోసారి ఆల్‌టైమ్ రికార్డు స్థాయికి సూచీలు..!



**ముంబయి :** భారతీయ స్టాక్ మార్కెట్లు వరుసగా మూడో సెషన్‌లో లాభాల్లో ముగిశాయి. సెన్సెక్స్, నిఫ్టీ తొలిసారిగా రికార్డు స్థాయికి చేరాయి. సెన్సెక్స్ 85వేల పాయింట్లకు చేరువ కాగా.. నిఫ్టీ 26వేల పాయింట్లకు చేరుకుంది. అమెరికా ఆర్థిక వ్యవస్థ సాధారణ స్థితికి చేరుకుందన్న వార్తలు స్టాక్ మార్కెట్లకు కొత్త ఊపునిచ్చింది. ఈ క్రమంలో ఆల్‌టైమ్ రికార్డు స్థాయికి చేరాయి. ఇటీవల అమెరికా ఫెడ్ రిజర్వ్ నాలుగేళ్ల తర్వాత వడ్డీ రేట్లను 50 బేసిస్ పాయింట్లు తగ్గించింది. మళ్లీ నవంబర్ 7న ఫెడ్ రిజర్వ్ వడ్డీ రేట్లను మరో 50 బేసిస్ పాయింట్లు తగ్గించే అవకాశం ఉందని ఆర్థిక నిపుణులు అంచనా వేస్తున్నారు. ఈ క్రమంలో భారతీయ మార్కెట్లు వరుసగా గరిష్ఠాలకు చేరుతున్నాయి. సెన్సెక్స్ ఉదయం క్రితం సెషన్‌తో పోలిస్తే 84,651.15 పాయింట్ల వద్ద లాభాల్లో మొదలైంది. ఇంట్రాడేలో 84,607.38 పాయింట్ల కనిష్ఠానికి చేరిన సెన్సెక్స్.. అత్యధికంగా 84,980.53 పాయింట్ల గరిష్ఠానికి చేరుకున్నది.

సెన్సెక్స్ ఈ స్థాయికి చేరుకోవడం ఇదే తొలిసారి. చివరకు 384.30 పాయింట్ల లాభంతో 84,928.61 వద్ద ముగిసింది. నిఫ్టీ 25,872.55 పాయింట్ల వద్ద లాభాల్లో మొదలైంది. ఆ తర్వాత స్వల్పంగా తగ్గిన సూచీలు.. మధ్యాహ్నం వరకు మళ్లీ లాభాల్లోకి దూసుకెళ్లాయి. ఇంట్రాడేలో 25,847.35 పాయింట్లు తగ్గిన నిఫ్టీ.. గరిష్ఠంగా 25,956 పాయింట్లకు చేరింది. చివరకు 148.10 పాయింట్ల లాభంతో 25,939.05 వద్ద స్థిరపడింది. ట్రేడింగ్‌లో దాదాపు 2,274 షేర్లు పురోగమించగా.. 1661 షేర్లు పతనమయ్యాయి. నిఫ్టీలో ఎంఅండ్ఎం, ఓఎన్జీసీ, బజాజ్ ఆటో, ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్, హీరో మోటోకార్ప్ లాభపడ్డాయి. ఐషర్ మోటార్స్, దివీస్ ల్యాబ్స్, ఐసీఐసీఐ బ్యాంక్, టెక్ మహీంద్రా, ఇండస్‌ఇండ్ బ్యాంక్ నష్టపోయాయి. పీఎస్‌యూ బ్యాంక్ ఇండెక్స్ 3శాతం కంటే ఎక్కువ పెరిగింది. రియల్టీ ఇండెక్స్ 2శాతానికి వృద్ధిని నమోదు చేసింది. ఆటో, ఇంధనం, ఎఫ్ఎంసీసీ, మెటల్, ఫార్మా, మీడియా 0.5శాతం నుంచి ఒకశాతం పెరిగింది. అయితే, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఇండెక్స్ 0.5శాతం పతనమైంది. బీఎస్ఈ, స్మాల్ క్యాప్ ఇండెక్స్ 0.7శాతం చొప్పున పెరిగాయి.

# దేవి శరన్నవరాత్రులు.. వాహనాలకు భారీగా డిమాండ్..!



**విశ్వంభర (బిజినెస్) :** ఈ ఏడాది దసరా శరన్నవరాత్రుల సీజన్‌లో వాహనాల విక్రయాలు భారీగా పెరగనున్నాయని కంపెనీలు అంచనా వేస్తున్నాయి. ఈ ఏడాది దేవీ శరన్నవరాత్రుల రోజుల్లో దాదాపు 4వేల వాహనాలు డెలివరీ కనున్నాయి. వీటి విలువ రూ.400 కోట్ల వరకు ఉంటుందని అంచనా. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది వాహనాల డెలివరీ భారీగా పెరగనున్నట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. గతేడాది ఈ కాలంలో 3400 వాహనాలు డెలివరీ అయ్యాయి. డీలర్ల నివేదిక ప్రకారం.. ఈ సారి 1800 ఫోర్ వీలర్స్, 2200 ద్విచక్ర వాహనాలు డెలివరీ అయ్యే అవకాశం ఉందని అంచనా. వాస్తవానికి హిందువులు దేవి శరన్నవరాత్రులను శుభప్రదమైనవిగా భావిస్తారు. చాలామంది వాహనాలను కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపుతుంటారు. ఇప్పటికే పలువురు వాహనాల కోసం అడ్వాన్స్ బుకింగ్ సైతం చేసుకుంటున్నారు. ఈ సారి నవరాత్రులతో పాటు ధన్‌తేరస్, దీపావళితో సహా ఇతర పండుగల సీజన్‌లో భారీగా వ్యాపారం జరుగుతుందని అంచనా. లగ్జరీ వాహనాల బుకింగ్స్ సైతం పెద్ద ఎత్తున జరిగాయి.

50 లక్షలకుపైగా విలువైన 500 వాహనాలు బుక్ అయ్యాయి. గతేడాది ఇలాంటి వాహనాలు 361 మాత్రమే అడ్వాన్స్ బుకింగ్ చేసుకున్నారు. వాహనాల రిజిస్ట్రేషన్‌తో రవాణా శాఖకు ఆదాయం సైతం పెరగనున్నది. మహీంద్రా కంపెనీ జనరల్ మేనేజర్ సంతోఖ్ సింగ్ మాట్లాడుతూ.. ఈ ఏడాది వాహనాలు తొలి నుంచి ఎక్కువగానే విక్రయించినట్లు తెలిపారు. ఈ క్రమంలో నవరాత్రుల్లోనూ భారీగానే అమ్మకాలు ఉంటాయని ఆశాభావం వ్యక్తం చేశారు. అదే సమయంలో ఎక్కువ మంది కొత్త మోడల్స్‌కి ప్రాధాన్యం ఇస్తున్నారని టాటా మోటార్స్ వీరేంద్ర సింగ్ తెలిపారు.

ఈ సారి హైబ్రిడ్ వాహనాల బుకింగ్‌లో భారీ పెరుగుదల కనిపిస్తుందని.. దీనికి కారణం 100శాతం పన్ను మినహాయింపేనని అంచనా వేస్తున్నారు. ఇప్పటి వరకు దాదాపు 400 హైబ్రిడ్ వాహనాలు బుక్ అయ్యాయి. ఇందులో ఎలక్ట్రిక్ వాహనాలకు సైతం డిమాండ్ ఉంటుందని పేర్కొంటున్నారు. ఈవీ వాహనాల తయారీలో కంపెనీలకు ఈ ఏడాది ఇబ్బంది లేదని.. సెమీకండక్టర్ల లభ్యత పెరిగిందని సంబంధిత వర్గాలు తెలిపాయి.

దాంతో వాహనాలు సకాలంలో డెలివరీ అయ్యే అవకాశం ఉంటుందని వివరించారు. ఇక 2021లో 1,245 వాహనాలు, 2022లో 1475, 2023లో 3400 వాహనాలు డెలివరీలు కాగా.. 2024లో 4వేల వాహనాలు డెలివరీలు అయ్యే అవకాశం ఉందని అంచనా.

## దక్షిణాఫ్రికాకు ఎగుమతవుతున్న హ్యుందాయ్ ఎక్స్టర్ కార్లు



**విశ్వంభర (బిజినెస్) :** ప్రముఖ ఆటోమొబైల్ సంస్థ, హ్యుందాయ్ మోటార్ ఇండియా లిమిటెడ్(హెచ్ఎంఐఎల్) తన ఎంట్రీలెవల్ ఎస్‌యూవీ ఎక్స్టర్ కార్లను దక్షిణాఫ్రికాకు ఎగుమతి చేయడం ప్రారంభించినట్లు తెలిపింది. ఇది భారత్ నుంచి దక్షిణాఫ్రికాకు ఎగుమతి అవుతున్న ఎనిమిదవ మోడల్ అని సంస్థ పేర్కొంది. హ్యుందాయ్ మోటార్ ఇండియా, మొదటి బ్యాచ్గా 996 ఎక్స్టర్ కార్లను పంపించింది. హ్యుందాయ్ ఇప్పటికే గ్రాండ్ ఐ10, నియోస్, ఔరా, ఐ20, ఐ20 N లైన్, వెన్యూ, వెన్యూ ఎన్ లైన్, ఆల్కాజార్ వంటి మోడళ్లను దక్షిణాఫ్రికాకు ఎగుమతి చేస్తోంది. 'హ్యుందాయ్'కు దక్షిణాఫ్రికా ఎల్లప్పుడూ ముఖ్యమైన ఎగుమతి మార్కెట్గా ఉందని, తమిళనాడు ప్లాంట్లో ఉత్పత్తి చేసిన మోడళ్లను దక్షిణాఫ్రికాకు ఎగుమతి చేస్తుంటామని హ్యుందాయ్ మోటార్ ఇండియా ఫంక్షన్ హెడ్ కార్పొరేట్ ప్లానింగ్ జే వ్యాన్ రూ తెలిపారు. హెచ్ ఎంఐఎల్ ద్వారా ప్రత్యేకంగా ఉత్పత్తి చేస్తున్న హ్యుందాయ్ ఎక్స్ టర్.. ప్రారంభించిన ఒక సంవత్సరంలోనే భారత్లో 1 లక్ష కార్ల విక్రయాల మైలురాయిని అధిగమించింది. ఇది ఆటోమేటిక్ డ్రైవ్తో పాటు, 19.20 నుంచి 19.40 Kmpl మైలేజీ ఇస్తుంది. మోడల్ ఇప్పుడు హై సీఎన్జీ(డ్యూయల్ సిలిండర్ సీఎన్జీ), నైట్ ఎడిషన్ వేరియంట్లను అందిస్తోంది. పది విభిన్న రంగుల్లో ఇది మార్కెట్లో అందుబాటులో ఉంది.

## కొత్తగా మరో సెక్యూరిటీ ఫీచర్‌ని తెస్తున్న వాట్సాప్..!

**విశ్వంభర (బిజినెస్) :** వాట్సాప్ యూజర్లకు గుడ్‌న్యూస్ చెప్పింది. తాజాగా ఆండ్రాయిడ్ యూజర్ల కోసం కొత్తగా సరికొత్త సెక్యూరిటీ ఫీచర్‌ను తీసుకరాబోతున్నది. దాంతో యూజర్లకు మరింత భద్రత పెరగనున్నది. వాట్సాప్‌కు ప్రపంచవ్యాప్తంగా అత్యధిక మంది వినియోగిస్తున్నారు. వారిని ఆకట్టుకునేందుకు మెటా యాజమాన్యంలోని కంపెనీ ఎప్పటికప్పుడు సరికొత్త ఫీచర్స్‌ని తీసుకువస్తుంది. అదే సమయంలోనూ భద్రతకు పెద్దపీట వేస్తున్న విషయం తెలిసిందే. తాజాగా వాస్తవానికి మనకు తెలిసిన వారితో పాటు తెలియనివారి నుంచి సైతం సందేశాలు వస్తుంటాయి. అయితే, తెలియనివారి అకౌంట్స్‌ని బ్లాక్ చేసేలా వాట్సాప్ ఫీచర్‌ని తీసుకువస్తోంది. ఈ ఫీచర్ 'బ్లాక్ మెసేజెస్ ఫ్రమ్ అన్‌నౌన్ అకౌంట్స్' అనే ఆప్షన్‌తో రానున్నది. వాట్సాప్ ఈ కొత్త ఫీచర్‌ని ఆండ్రాయిడ్ వాట్సాప్ బీటా 2.24.20.16 వెర్షన్‌లో అందులోకి తెచ్చింది.త్వరలోనే వాట్సాప్ ఈ ఫీచర్‌ను మిగతా అన్ని వెర్షన్లలో అందుబాటులోకి తీసుకురాబోతున్నది. ఈ ఫీచర్ వాట్సాప్ సెట్టింగ్‌లో ఉన్న అడ్వాన్స్‌డ్ సెట్టింగ్ ట్యాబ్‌లో కనిపిస్తుంది. ఈ ఫీచర్‌ని ఎనేబుల్ చేయడానికి పక్కనే కనిపించే టోగుల్‌ని ఆన్ చేయాల్సి ఉంటుంది. ఈ ఫీచర్ ఐపీ ప్రొటెక్షన్ ఫీచర్‌పై కనిపిస్తుంది. దీన్ని ఆన్ చేసుకున్న తర్వాత.. తెలియనివారి నుంచి వచ్చే మెసేజెస్ ఆటోమెటిక్‌గా బ్లాక్ అవుతాయి. ప్రస్తుతం బీటా యూజర్లు సైతం ఈ ఫీచర్‌ని వాడుకునేందుకు అవకాశం ఉంది. మీరు బీటా యూజర్లు అయితే, మొదట సెట్టింగ్స్‌లోకి వెళ్లాలి. ఆ తర్వాత ప్రైవసీ బటన్‌పై క్లిక్ చేయాలి. అనంతరం అడ్వాన్స్‌డ్ బటన్‌పై క్లిక్ చేయాలి. ఐపీ ప్రొటెక్షన్ ఫీచర్ ఆన్ చేస్తే తెలియని అకౌంట్స్‌ని నుంచి వచ్చే సందేశాలను బ్లాక్ చేసుకోవచ్చు. వాట్సాప్ స్పామ్, స్కామ్‌లకు అడ్డుకట్ట వేసేందుకు ఈ ఫీచర్‌ని తీసుకువస్తున్నది.

## దేవర టికెట్ల పెంపునకు

# తెలంగాణ ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్..

- అర్ధరాత్రి ఒంటి గంట ఆటకు కూడా అనుమతి



**హైదరాబాద్** : యంగ్ టైగర్ ఎన్టీఆర్, కొరటాల శివ కాంబినేషన్‌లో వస్తున్న చిత్రం దేవర. ఈ నెల 27న పాన్ ఇండియా స్థాయిలో ఈ మూవీ విడుదల కానుండగా.. ఎన్టీఆర్ ఫ్యాన్స్ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. భారీ బడ్జెట్‌తో ఈ మూవీ టికెట్స్‌ను పెంచుకునేందుకు తెలంగాణ ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. అలాగే, ఈ నెల 26న అర్ధరాత్రి ఒంటిగంట షోలకు సైతం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. 29 థియేటర్లలో అర్ధ రాత్రి ఒంటిగంట షోకు అనుమతి ఇస్తూ ఆదేశాలు జారీ చేసింది. ఒంటిగంట షోలకు రూ.100 టికెట్ ధర పెంచుకునేందుకు వీలు కల్పించింది. తొలిరోజు ఉదయం 4 గంటల నుంచి షోలు వేసుకునేందుకు అంగీకరించింది. మూవీ విడుదల రోజు రాష్ట్రంలోని అన్ని థియేటర్లలో రూ.100 పెంచుకునే ఛాన్స్ కల్పించింది. ఈ నెల 28 నుంచి అక్టోబర్ 6 వరకు తొమ్మిది రోజుల పాటు టికెట్ల ధరలను పెంచుకోవచ్చని చెప్పింది.
సింగిల్ స్క్రీన్ థియేటర్లలో రూ.25, మల్టిప్లెక్స్‌లలో రూ.50 పెంచుకునేందుకు అవకాశం కల్పించింది. జూనియర్ ఎన్టీఆర్ నటిస్తున్న ఈ చిత్రం రెండుపార్టులుగా తెరకెక్కనున్నది. తొలి పార్ట్ ఈ నెల 27న విడుదలవుతున్నది. ఎన్టీఆర్ ఈ మూవీలో ద్విపాత్రాభినయం చేస్తుండగా.. అలనాటి అందాలతార శ్రీదేవి ముద్దుల తనయ జాన్వీకపూర్ తెలుగులోకి ఎంట్రీ ఇస్తున్నది. ఈ మూవీలో బాలీవుడ్ నటుడు సైఫ్ అలీఖాన్ విలన్‌గా నటిస్తుండడంతో సినిమాపై భారీగానే అంచనాలున్నాయి. ఇప్పటికే విడుదలైన టీజర్, పాటలు అభిమానులను అలరించాయి. సినిమా ఓపెనింగ్స్‌తో నుంచే కొత్త రికార్డులు సృష్టించడం ఖాయమని ఎన్టీఆర్ అభిమానులు పేర్కొంటున్నారు. ఇదిలా ఉండగా.. ఏపీలోని ఇటీవల దేవర సినిమా టికెట్ల ధరలను పెంచుకునేందుకు ప్రభుత్వం అంగీకరించింది. ఈ మేరకు జీవో జారీ చేసింది. ఈ క్రమంలో ఏపీలో సోమవారం నుంచి టికెట్ల అడ్వాన్స్‌డ్ బుకింగ్ మొదలైంది.

## సత్యం సుందరం ట్రైలర్ విడుదల




కోలీవుడ్ స్టార్ యాక్టర్లు కార్తీ , అరవింద్ స్వామి లీడ్ రోల్స్‌లో నటిస్తోన్న తమిళ చిత్రం మెయ్యళగన్ . 96 ఫేం ప్రేమ్ కుమార్ సీ దర్శకత్వం వహిస్తున్న ఈ మూవీ తెలుగులో 'సత్యం సుందరం' పేరుతో విడుదల కానుంది. సెప్టెంబర్ 28న తెలుగు రాష్ట్రాల్లో విడుదలవుతోంది. ప్రమోషన్స్‌లో భాగంగా ట్రైలర్ లాంచ్ చేశారు. కార్తీ, అరవింద్‌స్వామి మధ్య అనుబంధం నేపథ్యంలో భావోద్వేగ పూరిత సన్నివేశాలతో సినిమా ఉండబోతున్నట్టు ట్రైలర్‌తో హింట్ ఇచ్చేశాడు డైరెక్టర్. ఇద్దరి స్నేహితుల కథతో ఫన్ ఎలిమెంట్స్‌తో సరదా సన్నివేశాలతో సీరియస్ ఎలిమెంట్స్‌తో సినిమా సాగనున్నట్టు ట్రైలర్ చెప్పకనే చెబుతోంది.ఈ చిత్రాన్ని హోం బ్యానర్ 2డీ ఎంటర్‌టైన్‌మెంట్స్‌పై సూర్య జ్యోతిక రాజశేఖర్ కర్పూరసుందరపాడ్యన్‌తో కలిసి సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఈ మూవీలో రాజ్ కిరణ్, శ్రీదివ్య, స్వాతి, దేవదర్శిని, జయప్రకాశ్, శ్రీరంజని ఇతర కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి 96 ఫేం గోవింద్ వసంత సంగీతం అందిస్తున్నాడు. ఈ చిత్రం తమిళంలో సెప్టెంబర్ 27న విడుదలవుతోంది.

## మోదీ ఎదుట ప్రదర్శనను జీవితాంతం గుర్తు పెట్టుకుంటా: దేవిశ్రీ ప్రసాద్



న్యూయార్క్ లోని నస్సావ్ వెటరన్స్ కొలస్సియంలో ఆదివారం సాయంత్రం జరిగిన ప్రవాస భారతీయుల సదస్సులో భారత ప్రధాని నరేంద్రమోదీ ఎదుట ప్రదర్శన ఇవ్వడంపై సంగీత దర్శకుడు దేవిశ్రీ ప్రసాద్ స్పందించారు. తాజాగా ఓ ఆంగ్ల పత్రికతో మాట్లాడిన ఆయన తన ఆనందాన్ని తెలియజేశారు. ఈ క్షణాలను జీవితాంతం గుర్తు పెట్టుకుంటానని తెలిపారు. "ఇలాంటి గొప్ప కార్యక్రమంలో భాగమైనందుకు చాలా సంతోషంగా ఉంది. 'హర్ ఘర్ తిరంగా' పాట కంపోజ్ చేసే అవకాశం వచ్చినప్పుడు నేను ఎంతో ఆనందించా. దానిని మాటల్లో వర్ణించలేను. ప్రాణం పెట్టి దాని కోసం పని చేశా. ఇక ప్రధాని నరేంద్రమోదీకి స్వాగతం పలుకుతూ ఈ పాటను ఆలపించడం ఎన్నో మధుర జ్ఞాపకాలు అందించింది. ఆయన నన్ను ప్రేమగా ఆలింగనం చేసుకున్నారు. జీవితాంతం దీనిని గుర్తు పెట్టుకుంటా. ప్రపంచవ్యాప్తంగా ఎంతోమందిలో స్ఫూర్తి నింపుతున్నందుకు ధన్యవాదాలు మోదీ జీ" అని దేవిశ్రీ ప్రసాద్ పేర్కొన్నారు.382 మంది జాతీయ, అంతర్జాతీయ కళాకారులు ఈ వేడుకలో ప్రదర్శనలిచ్చారు. 117 మంది కళాకారులు తమ కళా ప్రదర్శనలతో ప్రతినిధులను ఆహ్వానించారు. 'శ్రీవల్లి' పాటతో ఆహుతులను దేవిశ్రీ ఉర్రూతలూగించారు. అనంతరం ఆయన 'హర్ ఘర్ తిరంగా' పాట పాడుతుండగా మోదీ వేదికపైకి చేరుకున్నారు. 'నమస్తే ఇండియా' అంటూ ప్రవాస భారతీయులను పలకరించిన దేవిశ్రీ.. మోదీ సమక్షంలోనే తన పాటను కొనసాగించారు. అనంతరం డీఎస్పీతో పాటు గుజరాతీ గాయకుడు ఆదిత్య గాఢ్వీ. ఇతర కళాకారులను మోదీ అభినందించారు.

# ఆస్కార్ 2025 బరిలో నిలిచే తెలుగు సినిమాలివేనా..?




97వ ఆస్కార్ అవార్డ్ నామినేషన్ కార్యక్రమానికి రంగం సిద్ధమైంది. 2025 మార్చి 2న జరుగనున్న ఈ మెగా ఈవెంట్‌కు సంబంధించి వివిధ దేశాల నుంచి ఎంట్రీలు వెళ్లనున్నాయి. అమీర్ ఖాన్ నిర్మాణంలో కిరణ్ రావు దర్శకత్వంలో వచ్చిన 'లాపతా లేడీస్' సినిమా 2025 ఆస్కార్ కు ఇండియా తరపున ఎంపికైన విషయం తెలిసిందే. ఈ విషయాన్ని ఫిల్మ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అధికారికంగా ప్రకటించింది.ఈ నేపథ్యంలో ఈ సారి ఆస్కార్ బరిలో నిలిచే తెలుగు సినిమాలపై ఇండస్ట్రీలో ఆసక్తికర చర్చ నడుస్తోంది. ఈ సారి ఆస్కార్ అఫీషియల్ ఎంట్రీ ఇవ్వబోతున్న టాలీవుడ్ సినిమాలివేనన్న వార్త ఒకటి ఇండస్ట్రీ సర్కిల్‌లో రౌండప్ చేస్తోంది. టాలీవుడ్ నుంచి ప్రభాస్ నటించిన కల్కి 2898 ఏడీ, తేజ సజ్జా హనుమాన్, పాయల్ రాజ్‌పుత్ నటించిన మంగళవారం బరిలో నిలిచినట్టు ఫిలింనగర్ సర్కిల్‌లో ఓ వార్త వైరల్ అవుతోంది. మరి వీటిలో ఏ సినిమా ఆస్కార్‌లో అఫీషియల్ ఎంట్రీ ఇస్తుందనేది తెలియాలంటే.. కేంద్ర ప్రభుత్వం నుంచి అధికారిక ప్రకటన వస్తే స్పష్టత రానుంది.ఆస్కార్‌లో ఇతర భారతీయ సినిమాలు కూడా ఆస్కార్‌లో సత్తా చాటే ప్రయత్నంలో ఉన్నాయి. ఇప్పటికే ఎస్ఎస్ రాజమౌళి డైరెక్షన్‌లో తెరకెక్కిన ఆర్ఆర్ఆర్ ఆస్కార్ గెలుచుకున్న విషయం తెలిసిందే. నాటు నాటు పాటకు గాను ప్రతిష్టాత్మక బెస్ట్ ఒరిజినల్ సాంగ్ అవార్డ్‌ను అందుకుంది జక్కన్న టీం. మరి ఈ సారి ఏ తెలుగు సినిమా ప్రపంచ వేదికపై మెరుస్తుందో చూడాలి.

## రూ.700 కోట్ల క్లబ్‌లో 'స్త్రీ 2'..


### ఆ రికార్డు సాధించిన తొలి హిందీ సినిమా.!




బాలీవుడ్ బ్లాక్ బస్టర్ 'స్త్రీ 2' మరో కొత్త రికార్డును నమోదు చేసింది. ఇప్పటికే జవాన్ రికార్డును బద్దలుకొట్టి అత్యధిక కలెక్షన్లు సాధించిన చిత్రంగా నిలిచిన ఈ చిత్రం తాజాగా మరో అరుదైన రికార్డును అందుకుంది. ఈ సినిమా తాజాగా రూ. 713 కోట్ల క్లబ్‌లో ఎంటర్ అయ్యింది. ఇందులో వరల్డ్ వైడ్‌గా రూ.113 కోట్లు రాగా.. కేవలం హిందీలోనే రూ.600 కోట్ల వసూళ్లను సాధించింది. దీంతో ఫస్ట్ టైం రూ.604 కోట్లు దాటిన హిందీ సినిమాగా చరిత్ర సృష్టించింది. అలాగే ఇండియన్ బాక్సాఫీస్ వద్ద అత్యధిక వసూళ్లు సాధించిన ఆరో చిత్రంగా 'స్త్రీ 2' ఉంది. దీనికంటే ముందు 'బాహుబలి 2' మొదటి స్థానంలో ఉండగా.. 'కేజీయఫ్ 2', 'ఆర్ఆర్ఆర్', 'కల్కి 2898 ఏడీ', 'జవాన్' వరుస స్థానాలు కైవసం చేసుకున్నాయి. అయితే 'స్త్రీ 2' ఇంకా థియేటర్లలో రన్ అవుతుండటంతో ఈ ప్లేస్ మారే అవకాశం ఉంది.
బాలీవుడ్ నటులు రాజ్ కుమార్ రావు, శ్రద్ధా కపూర్, పంకజ్ త్రిపాఠీ ప్రధాన పాత్రలో వచ్చిన ఈ సినిమాకు అమర్ కౌశిక్ దర్శకత్వం వహించాడు. ఐదేళ్ల కిందట బాలీవుడ్‌లో వచ్చిన 'స్త్రీ' (Stree) చిత్రం సృష్టించిన రికార్డులు అంతా ఇంతా కాదు. కేవలం పదిహేను కోట్ల బడ్జెట్ తో తెరకెక్కిన ఈ సినిమా రూ.180 కోట్ల రేంజ్‌లో కలెక్షన్‌లు కొల్లగొట్టింది. ఇదే సినిమాకు ఇప్పుడు సీక్వెల్ రాగా ఇది కూడా బాక్సాఫీస్ వద్ద కలెక్షన్ల వర్షం కురిపిస్తుంది.
ఈ సినిమా కథ విషయానికి వస్తే.. 'స్త్రీ' సమస్య తొలగిందని చందేరి ప్రజలు ఊపిరి పీల్చుకునేలోగా సర్కటా అనే మరో దెయ్యం వస్తుంది. ఈ రాక్షసుడు మోడ్రన్‌గా ఉండే అమ్మాయిలను ఇబ్బందులు పెడుతుంటాడు. అయితే దీన్ని అంతమొందించడానికి విక్కీ (రాజ్ కుమార్ రావ్), రుద్ర (పంకజ్ త్రిపాఠి) తో పాటు శ్రద్ధా కపూర్ ఏం చేశారు అనేది ఈ సినిమా స్టోరీ.

## విడాకుల వదంతులకు

# చెక్ పెట్టిన ఐశ్వర్యారాయ్ బచ్చన్..!



అభిషేక్ బచ్చన్ - ఐశ్వర్యా రాయ్ విడాకులు తీసుకోబోతున్నారని కొంతకాలంగా ప్రచారం జరుగుతోంది. అయితే ఈ ప్రచారంపై ఎప్పుడూ నేరుగా స్పందించకపోయినా పలు వేడుకలకు కలిసి హాజరవుతూ పరోక్షంగా క్లారిటీ ఇచ్చే ప్రయత్నం చేసింది బచ్చన్ ఫ్యామిలీ. అయినా వదంతులు వస్తూనే ఉన్నాయి. ఈ క్రమంలో వెడ్డింగ్ రింగ్ ధరించి వాటికి మరో చెక్ పెట్టారు ఐశ్వర్యా రాయ్.
అట్టహాసంగా జరుగుతున్న 'పారిస్ ఫ్యాషన్ వీక్' కు కుమార్తె ఆరాధ్యతో కలిసి ఆమె హాజరయ్యారు. ఈ ఈవెంట్‌లో పాల్గొనే ముందు ఐశ్వర్యారాయ్ కెమెరాకు పోజులిచ్చారు. సంబంధిత వీడియో బయటకు వచ్చింది. వివాహ సమయంలో అభిషేక్ బచ్చన్ ఇచ్చిన ఉంగరాన్ని ధరించి ఐశ్వర్య ఫ్యాషన్ వీక్‌కు హాజరయ్యారంటూ బాలీవుడ్ మీడియా పేర్కొన్నది. దాంతో విడాకుల రూమర్స్‌కు ఆమె చెక్ పెట్టినట్టయ్యింది.
అమితాబ్ బచ్చన్ ఎక్స్‌లో గత ఏడాది 'అంతా అయిపోయింది' అని అర్థం వచ్చేలా ఒక పోస్ట్ పెట్టారు. దాన్ని కొందరు తన కుమారుడు, కోడలు దాంపత్య జీవితానికి ఆపాదించారు. మరోవైపు ఐశ్వర్యారాయ్ సోషల్ మీడియా ఖాతాను అమితాబ్ అన్‌ఫాలో చేశారంటూ బాలీవుడ్ మీడియాలో వార్తలు వచ్చాయి. దాంతో విడాకుల వదంతులు మొదలయ్యాయి. కొంతకాలంపాటు ఆ పుకార్లు షికార్లు చేశాయి. ముంబైలోని అంబానీ ఇంటర్నేషనల్ స్కూల్ వార్షిక వేడుకలో అమితాబ్, అభిషేక్, ఐశ్వర్య సందడి చేయడంతో వాటికి తెరపడింది.

## హీరోగా కమెడియన్ గౌతంరాజు తనయుడు



కమెడియన్ల వారసులు ఇండస్ట్రీకి ఎంట్రీ ఇవ్వడం టాలీవుడ్‌లో కొత్తేమీ కాదు. తాజాగా ఈ జాబితాలో మరో కమెడియన్ కూడా చేరిపోయాడు. ఇంతకీ ఆ యాక్టర్ ఎవరనే కదా మీ డౌటు. సీనియర్ కమెడియన్ గౌతమ్ రాజు. ఈ టాలెంటెడ్ కమెడియన్ తనయుడు కృష్ణ హీరోగా నటిస్తోన్న ప్రాజెక్ట్ కిలాడీ కుర్రోళ్లు. ఈ సినిమా షూటింగ్, పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు పూర్తయినట్టు ఇన్‌సైడ్ టాక్. కృష్ణ త్వరలోనే కిలాడీ కుర్రోళ్లు సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నట్టు ఫిలింనగర్ సర్కిల్ సమాచారం. కృష్ణారావు సూపర్ మార్కెట్ సినిమాతో కృష్ణ ఇప్పటికే నటుడిగా ఎంట్రీ ఇవ్వగా.. ఈ చిత్రం కోవిడ్ టైంలో ఓటీటీలో విడుదలైంది. మరి కృష్ణ హీరోగా ఎలాంటి ఇంప్రెషన్ కొట్టేస్తాడో చూడాలంటున్నారు సినీ జనాలు.










Edited, Printed, Published & Owned by Dr. KACHAM SATYANARAYANA. Printed at DVM Multi Colour Offset Printers, Dilsukhnagar, Hyderabad - 500060. Telangana. Published at #204, 2nd Floor, Badam Complex, Opp. Metro Pillar No. 1560, Chaitanyapuri X Road, Hyderabad - 500060. Telangana.EDITOR: Dr. KACHAM SATYANARAYANA. Cell: 9441222429 | Email: vishwambhara.daily@gmail.com